తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
21 Glorious years
epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ సిటీ fb.com/vaartha
PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
7-8-2017 సోమవారం సంపుటి :23 సంచిక : 187 పేజీలు :12 వెల : 5.00

కమ్ముకొస్తున్న కరవు!



ప్రశ్నార్థకంగా ఖరీఫ్.. ఎండిపోతున్న పంటలు
సాధారణం కంటే తగ్గిన వర్షపాతం.. ఆందోళనలో రైతాంగం
వర్షాభావంపై నేడు హైదరాబాద్‌లో అత్యవసర సమావేశం

నల్లమబ్బులు కరవైన ఆకాశం రైతులను వెక్కిరిస్తోంది. వాన చుక్కకోసం ఎదురు చూసి.. చూసి రైతు కంటి నుంచి కన్నీటి చుక్కలు రాలుతున్నాయి. రాష్ట్రంలో క్రమంగా కరవు ఛాయలు అలముకుంటున్నాయి. కరవుకు సంబంధించిన ప్రతిపాదనల్లో అధికారవర్గాలు నిమగ్నమయ్యాయి. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై అంచనా వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సోమవారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రభుత్వం కరవు పరిస్థితులపై నివేదికలను రూపొందించాలని అధికారులను ఆదేశించింది. కాగా ఖరీఫ్ ప్రారంభంలో ఒకమాదిరి వర్షాలు కురియడంతో రైతుల కళ్లల్లో వచ్చిన ఆనందం కాస్తా వర్షాభావ పరిస్థితులతో ఆవిరైపోతోంది...

హైదరాబాద్, అగస్టు 6, ప్రభాతవార్త: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కరవు ఛాయలు అలముకున్నాయి. కరవుకు సంబంధించిన ప్రతిపాదనల్లో అధికారవర్గాలు నిమగ్నమయ్యాయి. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై అంచనా వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈనెల 7వ తేదీన అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రభుత్వం కరవు పరిస్థితులపై నివేదికలను రూపొందించాలని అధికారులను ఆదేశించింది. కాగా ఖరీఫ్ ప్రారంభంలో ఒకమాదిరి వర్షాలు కురియడంతో రైతుల కళ్లల్లో వచ్చిన ఆనందం కాస్తా వర్షాభావ పరిస్థితులతో ఇప్పుడవి ఆవిరవుతున్నాయి. రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో లోటు వర్షపాతం కారణంగా ప్రస్తుత ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా తయారైంది. సాగునీరు లేకపోవడంతో వేసిన చేలు ≫2

అదే 'మోత'!



మారని బడి పిల్లల తలరాత

మార్గదర్శకాలు సరే... కార్యాచరణేది...?
బ్యాగ్ బరువు మోతపై 'ఉత్త'ర్వులేనా...!
పాఠ్య పుస్తకాల అమలులో భిన్న వాదనలు
ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలనే వాడాలని ఉత్తర్వులో స్పష్టత
ఇష్టమైన పుస్తకాలను వినియోగించుకోవాలని మంత్రి వ్యాఖ్య
సందిగ్ధంలో పాఠశాల విద్యాశాఖ అధికారులు



హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: తాంబులాలిచ్చాం... తన్నుకు చావండన్నట్లు వ్యవహరిస్తుంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. రాష్ట్రంలో పాఠశాల విద్యార్థుల బ్యాగుల మోతను తగ్గించేందుకు మార్గదర్శకాలను విడుదల చేసిన సర్కార్ వాటి అమలుకు కావాల్సిన కార్యాచరణ ప్రణాళిలను మాత్రం విస్మరించింది. దీంతో ఈ మార్గదర్శకాలను పాటించని పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై సందిగ్ధత నెలకొంది. దీంతో పాఠశాల విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వీటి అమలు చేయకపోతే చేసేదేమి లేదన్నట్లుగా ప్రైవేటు పాఠశాలల యాజమానులున్నారు. ఈ నేపథ్యంలో ఎలా ముందుకు సాగాలనే దానిపై పాఠశాల విద్యాశాఖాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్ర భుత్వం పాఠశాల విద్యార్థుల బ్యాగు బరువును తగ్గించేందుకు ఉత్తర్వులను విడుదల చేసింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను సైతం అందులో సవిరంగా పేర్కొంది. అయితే వీటిని అమలు చేసేందుకు కావాల్సిన కార్యాచ రణను మాత్రం ప్రకటించలేదు. దీంతో ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు 'ఉత్త'ర్వులుగానే మిగిలే అవకాశముందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పిల్లల బ్యాగు బరువు తగ్గించాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు కు నోచుకునే పరిస్థితి కనిపించడం లేదు. కార్యాచరణ పట్ల పాఠశాల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకునేందుకు సాహసించడం లేదు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటే ఏమవుతుందనే ఆందోళనలో విద్యాశాఖ ≫2

ప్రాజెక్టులపై జిఎస్టీ తగ్గించే దాకా
రాజీలేని పోరాటం

ప్రధానికి లేఖ రాస్తాం, స్పందించకుంటే న్యాయపోరాటమే!
తెలంగాణకే కాదు అన్ని రాష్ట్రాలకూ ఇదే సమస్య
జిఎస్టీతో నష్టాలపై సమీక్షించిన సిఎం కెసిఆర్



ఆదివారం ప్రగతిభవన్‌లో జిఎస్టీపై సమీక్ష నిర్వహించిన సిఎం కెసిఆర్. చిత్రంలో సిఎస్, ఇతర ఉన్నతాధికారులు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు6: ప్రజోపయోగ కార్యక్రమాల కోసం చేపడుతున్న నిర్మాణాలపై విధించిన 12శాతం జిఎస్టీని తగ్గించే వరకు రాజీలేని పోరాటం చేయనున్నట్లు టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మరోసారి స్పష్టం చేశారు. జూన్ 30 నాటికే ప్రారంభమైన ప్రాజెక్టులకు జూలై1 నుంచి అమలయ్యే జిఎస్టీని వర్తింపచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది కేవలం తెలంగాణ రాష్ట్రం సమస్య మాత్రమే కాదు. యావత్ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఎదురవుతున్న ఇబ్బంది. దీనిపై కేంద్రం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో 5శాతం వ్యాట్ అంచనాలతో ఈ ప్రాజెక్టులకు అంచనాల తయారీ, బడ్జెట్ కేటాయింపులు జరిగినందున ఇప్పుడు వాటిని సవరించడం కూడా కుదరదని సిఎం అన్నారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు విధించాలనుకునే 12 శాతం జిఎస్టీని తగ్గించాలని ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాయాలని నిర్ణయించుకున్న ముఖ్యమంత్రి కెసిఆర్ ఆ లేఖలో పొందుపరచాల్సిన అంశాల గురించి చర్చించడానికి ప్రగతి భవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.

నిర్మాణ పనులపై 12శాతం జిఎస్టీ విధించడం వల్ల ఏఏ శాఖలపై ఎంత ప్రభావం పడుతుంది అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రాథమిక అంచనాలను సిఎం ముందు పెట్టారు. ఆదివారమే ప్రధాని లేఖ రాయాలని మొదట భావించినా, నీటిపారుదల, మిషన్ భగీరథ, గృహ నిర్మాణం, విద్యుత్ ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం తదితర ప్రాజెక్టుల్లో వ్యయానికి సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలను పొందుపరచడం కోసం వాయిదా వేశారు. సోమవారం అధికారులు మరోసారి సమావేశమై లోతుగా అధ్యయనం చేసి గణాంకాలకు తుది రూపం ఇస్తారు. తర్వాత పూర్తి వివరాలతో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రధానికి లేఖ రాయాలని సిఎంనిర్ణయించారు. ఏఏ శాఖ పరిధిలో ప్రస్తుతం ఎంత వ్యయమయ్యే పనులు జరుగుతున్నాయి? ఇప్పటికే ఎంత వ్యయమయ్యే పనులు పూర్తయ్యాయి? ఇంకా ఎంత వ్యయం పనులు పూర్తి కావాలి? ఈ పనులకు 12శాతం జిఎస్టీ విధించడం వల్ల పడే భారమెంత? మొత్తం అన్ని పనులకు కలిపి రాష్ట్రంపై పడే భారమెంత? ఆ భారాన్ని ఎలా భరించాలి? తదితర వివరాలను తయారు చేయాలని సిఎం అదేశించారు. ఈ వివరాలు సమకూరడానికి ఒకటీ రెండు రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. కాబట్టి సమగ్ర సమాచారంతోనే ప్రధానికి లేఖ రాయాలని నిర్ణయించారు.

'ప్రజోపయోగ నిర్మాణాలపై ఎక్కువ జిఎస్టీ విధించవద్దని తెలంగాణ ప్రభుత్వం తరఫున మొదటి నుంచీ కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ వస్తున్నాం. జిఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని బలంగా వాదించాం. శనివారంఢిల్లీలో జరిగిన సమావేశంలో కూడా మన రాష్ట్రం తరఫున ప్రజోపయోగ నిర్మాణాలపై ఎక్కువ పన్ను విధించవద్దని గట్టిగా చెప్పాం. తెలంగాణ రాష్ట్రం గట్టిగా కోరడంతో 18శాతం ఉన్న జిఎస్టీని 12శాతానికి తగ్గించాలని కేంద్రం ≫2



జయశంకర్ జయంతి సందర్భంగా ఆదివారం జగిత్యాలలో నివాళులర్పిస్తున్న ఎంపీలు కవిత, వినోద్- 6లో

సిడబ్ల్యుసి సభ్యునిగా
కుంతియా
తెలంగాణకు పూర్తి స్థాయి ఇన్‌చార్జిగా కొనసాగించే అవకాశం



హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీగా ఇటీవల నూతనంగా నియమితులైన రామచంద్రకుంతియాకు మరో అరుదైన అవకాశం లభించింది. తాజాగా జాతీయ కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలకమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా కుంతియాను ≫2

కాసులు కదిలితేనే
ఫైళ్లకు కాళ్లు!



మున్సిపాలిటీలలో నిర్లక్ష్యం
మ్యుటేషన్లలో తీవ్ర జాప్యం... అవినీతి కంపు
భారీగా దరఖాస్తులు... పరిశీలించినవి తక్కువే
నెలలు వేచిచూడాల్సిందే.. 9962 దరఖాస్తుల్లో 15 రోజుల్లో జారీ చేసినవి 3,033
మిగిలిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే..!

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలో మ్యూటేషన్లలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుంది. కాసులిస్తే కాని కదలని పరిస్థితి నెలకొంది. ఒక్కోచోట వందల సంఖ్యలో ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలిసిపోతుంది. నిబంధనల ప్రకారం 15రోజుల్లో పేరు మార్పిడి చేసి జారీచేయాల్సి ఉండగా అలా జారీ చేసినవి 10 శాతానికి మించడం లేదు. దీంతో గుట్టలు గుట్టలు పేరుకుపోతున్నాయి. కాసులిస్తే కానీ ఫైలు కదలదు అన్నట్లు వ్యవహారాలు సాగుతున్నాయి. పేరు మార్పిడి చేసే విషయంలో తీవ్ర అవినీతి చోటు చేసుకుంటుంది. రోజులు కాదు నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పైరవీలు చేసిన ఫైళ్లకే మోక్షం కలుగుతుంది. ఆస్తికి సంబంధించి తమ పేరు మార్చాలంటూ వచ్చిన దరఖాస్తుల పరిశీలిస్తే ఎంత దారుణంగా ఉదో తెలిసిపోతుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాలో మ్యూటేషన్‌కు సంబంధించి మొత్తం 9962 దరఖాస్తులు అందగా వాటిలో 3,033 దరఖాస్తులకు మాత్రమే మోక్షం కలిగిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. వీటిలో నిర్మాణానికి సంబంధించినవి 9358, ఖాళీ స్థలాలకు సంబంధించినవి 604 వచ్చాయి. వీటిలో పత్రాలు జారీ చేసినవి నిర్మాణంలో ఉన్న వాటికి జారీ చేసినవి 2850, ఖాళీ స్థలాలకు సంబంధించి వచ్చినవి 183 మాత్రమే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. వాస్తవంగా టైటిల్‌ను 15రోజుల్లో మార్చాలన్న నిబంధనలు ఉన్నాయి. కానీ ఆ నిబంధనలను ఒక్క మున్సిపాలిటీల కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 జిల్లాలను పరిశీలిస్తే ఎక్కువగా జగిత్యాలలో 1291 దరఖాస్తులు అందగా 571 దరఖాస్తులకు ధృవీకరణ పత్రాలు జారీ చేయగా, 635 పరిశీలనలో ఉండగా, తిరిస్కరించినవి 85, 15రోజుల్లో జారీ చేసినవి 213, 15 రోజుల తరువాత జారీ చేసినవి 442 ఉన్నాయి. ఆ తరువాత స్థానం ఖమ్మం జిల్లాకు సంబంధించినది. 909 దరఖాస్తులు అందగా 381 దరఖాస్తులకు ధృవీకరణ పత్రాలు జారీ చేయగా, 528 పరిశీలనలో ఉండగా, 15రోజుల్లో జారీ చేసినవి 124, 15 రోజుల తరువాత జారీ చేసినవి 287 ఉన్నాయి.మహబూబ్‌నగర్ జిల్లాలో 687 దరఖాస్తులు అందగా 257 దరఖాస్తులకు ≫2

నేడు చంద్రగ్రహణం... ఆలయాల మూసివేత 5లో

నిండు వర్షాకాలంలో
తాగునీటి గండం



హైదరాబాద్ ప్రజలకు అరకొరగా నీరు
సాగర్‌లో పూర్తిగా పడిపోయిన నీటి మట్టం
కర్ణాటక కరుణించకుంటే పరిస్థితి మరింత తీవ్రం

హైదరాబాద్ ఆగస్టు 6, ప్రభాతవార్త : నిండు వర్షాకాలంలో హైదరాబాద్, నల్గొండలకు తాగునీటి గండం ఏర్పడింది. గత ఆరునెలలుగా ఎలాగోలా వాయిదాల పద్ధతిపై ఏపిని ఒప్పించి ఈ గండం నుంచి గట్టెక్కుతూ వచ్చిన తెలంగాణకు ఈ సారి ఏపి సహకరిస్తానన్నా ఫలితం లేని పరిస్థితి నెలకొంది. వర్షాభావంతో కృష్ణా బేసిన్‌లోకి చుక్క నీరు రాలేదు. హైదరాబాద్, నల్గొండలకు తాగునీరందించే నాగార్జునసాగర్‌లో ఇప్పటికి ప్రమాదస్థాయిని మించి దిగువకు తోడి హైదరాబాద్, నల్గొండలకు తాగునీరు తీసుకుంటున్నారు. ఇది కూడా జూలై నెలాఖరు వరకు మాత్రమే కష్టంగా ఇచ్చే పరిస్థితి. అప్పటి వరకు వర్షాలు కురిసి జలాశయంలోకి నీళ్లు వస్తాయని భావించినా అది జరగలేదు. దీంతో గతవారం రోజులుగా తప్పనిసరి పరిస్థితిలో అత్యవసరం మేరకు సాగర్ నుంచి అరకొర తాగునీటిని విడుదల చేస్తున్నారు. నిజానికి సాగర్ నీటి మట్టం 510 అడుగులకు చేరితే దాని నుంచి ఎలాంటి నీటిని తీసుకోవద్దు. అయితే తాగునీటి అవసరాల దృష్ట్యా తప్పనిసరి పరిస్థితిలో ఏపికి ఇవ్వాల్సిన వాటాను కూడా తగ్గించి కృష్ణా బోర్డు 503 అడుగుల వరకు తోడుకుని నీటిని తీసుకునేందుకు అనుమతిచ్చింది. అతి కష్టం మీద ఏపికి, తెలంగాణలకు జూలై నెలాఖరు వరకు ఒక్కో టిఎంసీని కేటాయించింది. దానిని వాడుకుంటూ కాలం వెల్లదీసారు. ఆగస్టు మొదలై వారం రోజులు గడిచినా సాగర్ పరిస్థితి మారకపోగా మరింత దిగజారి దాని నీటి మట్టం ప్రస్తుతం 500.5అడుగులకు పడిపోయింది. జూలై నెలాఖరు వరకు కష్టం మీద హైదరాబాద్, నల్గొండల తాగునీటికి ప్రతి రోజు 8384టిఎంసీల నీటిని విడుదల చేశారు. ఇప్పుడు గత వారం రోజులుగా అతి కష్టం మీద రోజుకు 505టిఎంసీల నీటిని వదులుతున్నారు. ఈ తరుణంలో కర్టాటక జూరాలకు నీటిని వదిలితే ≫2



నేడే రక్షాబంధన్
సోదర ప్రేమకు ప్రతిరూపం

ఏడుకొండల్లో పవర్‌లేని నిఘానేత్రాలు!

కానరాని పటిష్టమైన సిసికెమెరాల ఏర్పాటు



తిరుమల, ఆగస్టు 6, ప్రభాతవార్త: ప్రపంచప్రసిద్ధిచెందిన హిందూధార్మికసంస్థగా భాసిల్లుతున్న తిరుమలలో అటు శ్రీవారి ఆలయం ఇటు భక్తుల భద్రతకు పోలీసు,టిటిడి విజిలెన్స్‌యంత్రాంగం అనుసరిస్తున్న వ్యూహం ఎంతవరకు భద్రత కల్పిస్తుందో శ్రీనివాసుడికే ఎరుకగా మారింది. ఇందుకు తాజాగా 17 రోజుల క్రిందట తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట నిద్రిస్తున్న అనంతపురం జిల్లాకు చెందిన ఏడాదిబాలుడు చెన్నకేశవ్‌ను తమిళనాడు భక్తులు అపహరించుకెళ్ళడం, ఈ సంఘటనలు సిసికెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలు పరిశీలిస్తే కొంతవరకు ఫలితమివ్వలేకపోవడమేకారణంగా తెలుస్తోంది. ఏడుకొండల్లో అటు వెంకన్న ఇటు భక్తుల భద్రతపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఇప్పటికే కేంద్రనిఘా వర్గాలు హెచ్చరికలు చేసినా భద్రత యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసుకున్న పాపానలేదు. ఏదో నామమాత్రంగా సిసికెమెరాలు ఏర్పాటుచేసి చేతులుదులుపేసుకుందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరుమల,తిరుపతి పుణ్యక్షేత్రాల పర్యటనకు నిత్యం ప్రముఖులు (వివిఐపిలు) వస్తున్న సమయంలో పోలీసుబలగాలు రెట్టింపు ఉత్సాహంతో తనిఖీల పేరుతో నానాహడావిడి చేస్తుంటారు. తిరుమలకు విచ్చేస్తున్న భక్తుల సంఖ్యకూడా రోజురోజుకూ రెట్టింపవుతోంది. ఒకప్పుడు రోజుకు 30వేల నుంచి 40వేలమందివరకు శ్రీవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య నేడు 95 వేలు నుంచి 99వేలు వరకు చేరింది. ఈ సంఖ్య భవిష్యత్తులో 2లక్షలకు చేరినా అతిశయోక్తిలేదు. ఇంత అశేషసంఖ్యలో ఏడుకొండలకు భక్తులు చేరుకొంటుంటే వారి భద్రత ఏ పాటిదనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఓవైపు పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగ్గట్లు కొండపై భద్రతను పటిష్టం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలు మాత్రం నామమాత్రమేనని చెప్పుకోవాలి. శ్రీవేంకటేశ్వరస్వామి,భక్తుల భద్రత దృష్ట్యా పోలీసుశాఖతో బాటు టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది,ఆక్టోపస్,ఏపిఎస్‌పి, ఎస్‌పిఎఫ్ బలగాలు తిరుమలపై అనుక్షణం డేగకళ్ళతో పహరాకాస్తున్నాయి. ఏడుకొండల్లో భద్రతాపరంగా టిటిడి కూడా శ్రీవారి ఆలయం పరిసరాల్లో ఇన్నర్‌కారిడార్ పేరుతో పటిష్టమైన కంచెను, ఔటర్‌కారిడార్ పేరుతో శేషాచలం అటవీప్రాంతం చుట్టూ కంచెను నిర్మించేపనులు వేగవంతంగా చేపడుతోంది. నిత్యం కొండకు చేరుకుంటున్న భక్తుల్లో ఎవరు, ఏమిటి అని కనుక్కోవడం క్లిష్టంగా మారింది. భక్తుల రద్దీ ఎక్కువగా వుండే రోజుల్లో, ప్రముఖ పర్వదినాల్లో, విశేషరోజుల్లో మరీ పోలీసుఅధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గత ఏడాది ఉగ్రవాది తిరుమలలో సిఆర్‌వో,ఆలయం పరిసరాల్లో, పిఏసి ప్రాంతాల్లో జనరద్దీగా వుండేచోట్ల రెక్కీనిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు.

తిరుమలకు వాహనాల్లో చేరుకునేందుకు ప్రధానంగా తిరుపతి అలిపిరి మార్గం ఒకటి. ఈ మార్గంలో నిత్యం వేలాదివాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అలిపిరి వద్ద సెక్యూరిటీ,ఎస్‌పిఎఫ్ పోలీసులు నిశితంగా వాహనాలను సప్తగిరితనిఖీకేంద్రంలో తనిఖీ చేసిన తరువాత కొండకు అనుమతినిస్తుంటారు. ఇక్కడ భక్తులను,లగేజీలను వేర్వేరుగా క్షుణ్ణంగా శోధించి పంపుతారు.ఈ తనిఖీల్లో భక్తులు తిరుమలకు మద్యంబాటిళ్ళు, గుట్కా, వంటివాటిని తీసుకువస్తుండటం అడపాదడపా కనిపెట్టి పట్టుకుంటారు.

ఫైళ్లకు కాళ్లు!

ధృవీకరణ పత్రాలు జారీ చేయగా, 413 పరిశీలనలో ఉండగా, తిరిస్కరించినవి 17, 15రోజుల్లో జారీ చేసినవి 6, 15 రోజుల తరువాత జారీ చేసినవి 196 ఉన్నాయి. అతి తక్కువగా మెదక్ జిల్లాలో 7 దరఖాస్తులు అందగా ఆరు పరిశీలనలో ఉండగా, ఒక దరఖాస్తును తిరిస్కరించారు. ఆచార్య జయశంకర్ జిల్లాలో ఏడు దరఖాస్తుల్లో ఏడు పరిశీనలో ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఏ ఒక్క చోట పూర్తిస్థాయిలో పరిశీలన చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

పేరు మార్పిడి విషయంలో అవినీతి కంపు తీవ్ర స్థాయిలో చోటు చేసుకుంటుంది. పైరవీలు చేసేవారు, కాసులు కురిపించే వారికి మినహాయిస్తే మిగిలిన మ్యూటేషన్‌ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా పేరు మార్పిడి దరఖాస్తుల్లో ఏవైనా మార్పులు ఉంటే తిరస్కరించాల్సి ఉండగా, అలా తిరస్కరణ జరగడం లేదు. దరఖాస్తుదారుడు వచ్చి అడిగితే తప్ప వాటి వివరాలు తెలియడం లేదు. దరఖాస్తులన్ని పరిశీలనలో ఉన్నాయంటూ ప్రకటిస్తున్నారు. ఒకవైపు పారదర్శకంగా పనులు చేస్తున్నామంటూ పురపాలకశాఖ మంత్రి ప్రకటిస్తున్నారు. కానీ ఆచరణలో మాత్రం నీరు గారుతుందని చెప్పొచ్చు. ఏదీఏమైనా పేరుకుపోయిన మ్యూటేషన్‌ల విషయంలో వేగంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మ్యూటేషన్లకు సంబంధించి మెత్తం దరఖాస్తులు 9962 దరఖాస్తులు అందాయి. వాటిలో ధృవీకరణ పత్రాలు అందినవి 3,033 ఉండగా, పరిశీలనలో ఉన్నవి 6480, తిరస్కరించినవి 449, 15రోజుల్లో జారీ చేసినవి 994, 15రోజుల తరువాత జారీ చేసినవి 2039 దరఖాస్తులు ఉన్నాయి. 15రోజుల్లో ధృవీకరణ పత్రాలు అందించిన వాటిని పరిశీలిస్తే గద్వాల్(జోగులాంబ), నాగర్‌కర్నూల్, మేడ్చేల్, మహబుబాబాద్, రంగారెడ్డి, మెదక్, అచార్య జయశంకర్ జిల్లాల పరిధిలో వచ్చిన దరఖాస్తుల్లో ఒక్కటి కూడా ఇవ్వలేదు. వరంగల్ రూరల్ పరిధిలో 1, కొత్తగూడెం, కామారెడ్డిలో 2, వనపర్తిలో 3, వికారాబాద్‌లో 4, యాదాద్రి, కొమురంభీం ఆసిఫాబాద్ ప్రాంతాలలో ఆరుచొప్పున 15రోజుల్లో జారీ చేశారు. అంటే నిబంధనల ప్రకారం 15రోజుల్లో మ్యూటేషన్ల జారీ శాతం కూడా చాలా తక్కువగా ఉందని చెప్పొచ్చు.

	నిర్మాణం	ఖాళీ స్థలం	మొత్తం
దరఖాస్తుల స్వీకరణ	9358	604	9962
ధృవీకరణ పత్రాల జారీ	2850	183	3033
పరిశీలనలో ఉన్నవి	6061	419	6480
తిరస్కరించినవి	447	2	449
15రోజుల్లో జారీ చేసినవి	815	179	994
15రోజుల తరువాత జారీ చేసివని	2035	4	2039

సిడబ్ల్యుసి సభ్యునిగా కుంతియా

నియమించింది. ఈనెల 8న న్యూఢిల్లీలో జరిగే వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరు కావాల్సిందిగా పార్టీ అధిష్ఠానం ఆయనకు లేఖ పంపింది. సాధారణంగా ఎఐసిసి ప్రధానకార్యదర్శికి మాత్రమే సిడబ్ల్యుసి మెంబర్‌గా అవకాశం ఇస్తారు. అయితే ఇంకా ఇప్పటి వరకు ఎఐసిసి కార్యదర్శిగా మాత్రమే కొనసాగుతున్న కుంతియాకు సిడబ్ల్యుసిలో అవకాశం కల్పించడంతో ఆయనకు ప్రధానకార్యదర్శిగా నియమిస్తారని ఎఐసిసి వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో కుంతియాకు రాబోయే రోజుల్లో తెలంగాణకు దీర్ఘకాలిక ఇంచార్జ్‌గా కొనసాగుతారని భావిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణకు కార్యదర్శిగా ఇంచార్జ్‌గా ఉన్న కుంతియాకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించి పూర్తిస్థాయిలో దీర్ఘకాలికంగా తెలంగాణ ఇంచార్జ్‌గా కొనసాగిస్తారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

తాగునీటి గండం

తప్ప హైదరాబాద్, నల్గొండలు తాగునీటి గండం నుంచి గట్టెక్కె పరిస్థితి లేదు. కర్ణాటక కరుణిస్తే మాత్రం హైదరాబాద్, నల్గొండలు తాగునీటి కష్టం నుంచి బయటపడతాయి. ఈ వర్షాకాలం గోదావరి బేసిన్‌లోకి వరద లేకున్నా.. కృష్ణా బేసిన్‌లో వరద పరిస్థితి ఫరావాలేదు. బేసిన్ ఎగువ భాగంలో కురిసిన వర్షాలకు అల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు బాగానే నీళ్లు వచ్చాయి. అల్మట్టి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 129.72టిఎంసీలు కాగా ప్రస్తుతం 126.74 టిఎంసీలకు చేరుకుంది. దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టులోకి మరో టిఎంసీ నీరు చేరితే పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంటుంది. దీని పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 37.64టిఎంసీలు కాగా ప్రస్తుతం 36.35టిఎంసీలు ఉంది. అయినా సరే జూరాలకు నీటిని మాత్రం వదలడం లేదు. అల్మట్టిలోకి తాజాగా 21వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉంది. అయినా సరే ఈ నీటిని విద్యుత్ ఉత్పత్తి కోసం కాలువల ద్వారా వదులుతున్నారు కాని దిగువన ఉన్న తెలుగురాష్ట్రాల అత్యవసర పరిస్థితుల కోసం వదలడం లేదు. అయితే నిబంధనల ప్రకారం, ఒప్పందాల మేరకు ఈ నీటిని వదిలాలలని చెప్పే పరిస్థితి లేదు. కర్ణాటక మానవతా దృక్పథంతో ఆలోచించి పొరుగురాష్ట్రానికి మేలు చేయాలని భావించి వదలాలే తప్ప మరో మార్గం లేదు. అలాగే నారాయణపూర్ ప్రాజెక్టుకు 19,432 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీనిలో నుంచి 11వేల క్యూసెక్కులు నీటిని కాలువలకు, 6500క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తికి వదులుతున్నారు. 15టిఎంసీల నీటిని వదలమని కర్ణాటకను కోరాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. నాగార్జునసాగర్ చీఫ్ ఇంజనీర్ సునీల్ ఈ నీరును వదలాలలని కోరుతూ కర్ణాటక ఇరిగేషన్ ఇంజనీర్-ఇన్-చీఫ్‌కు లేఖను రాశారు. కర్ణాటక స్పందిస్తే ఇప్పటికి నీటి కష్టాల నుంచి బయటపడవచ్చు.

SINGAM KUIL BLUE SUNDAY
Draw No:112 DrawDate on:06/08/17

SINGAM SERIES
1st Prize Rs.10.000/- S 886151
2nd Prize Rs.7.000/- 84783
3rd Prize Rs.3.500/-
01145 11588 19723 23093 30688
39100 62170 81483 87422 98955
4th Prize Rs.200/-
0252 0295 2355 4555 5540 5631 5882
8600 8765 8855
5th Prize Rs.100/-
2114 2905 3908 4665 6452 7589 9073
9317 9671 9963
6th Prize Rs.50/-
0264 1699 3028 5070 6091 7429 9192
0401 1862 3242 5088 6394 7552 9337
0402 2199 3337 5140 6423 7712 9440
0528 2285 3454 5394 6632 7715 9535
0546 2302 3813 5410 6638 7757 9737
0561 2351 3928 5458 6723 7956 9811
0757 2361 4174 5459 6728 8015 9820
1051 2434 4488 5490 6824 8104 9910
1150 2441 4496 5558 7025 8213 9973
1250 2448 4670 5572 7065 8410 9984
1360 2690 4826 5658 7095 8689
1376 2779 4832 5710 7120 8839
1448 2810 4958 5914 7222 9060
1528 2953 4972 5951 7353 9146
1560 2958 5036 6012 7361 9176

KUIL SERIES
1st Prize Rs.10.000/- K 384875
2nd Prize Rs.7.000/- 86663
3rd Prize Rs.3.500/-
09710 29795 34145 42358 52699
61103 64080 69615 90447 98430
4th Prize Rs.200/-
0138 0142 0440 2603 3836 6920 7708
8799 8926 9547
5th Prize Rs.100/-
0100 0538 3165 3313 5650 6147 6802
6866 8053 9724
6th Prize Rs.50/-
0033 1587 3033 4509 5653 7041 8776
0371 1739 3060 4625 5729 7101 8830
0384 1769 3159 4680 5915 7191 8896
0425 1883 3270 4812 6035 7201 9196
0512 1960 3326 4827 6190 7307 9220
0525 2027 3516 4897 6208 7365 9326
0625 2093 3566 4953 6382 7798 9696
0824 2138 3625 4969 6418 7882 9743
0833 2373 3729 5041 6531 7952 9875
0955 2388 3976 5125 6554 8017 9945
1074 2402 4011 5202 6675 8126
1174 2443 4024 5238 6756 8268
1195 2753 4239 5457 6765 8462
1409 2815 4363 5552 6816 8553
1486 2828 4366 5599 6921 8598

ROSA DEER SILVER SUNDAY
Draw No:112 DrawDate on:06/08/17

ROSA SERIES
1st Prize Rs.10.000/- R 024156
2nd Prize Rs.7.000/- 67087
3rd Prize Rs.3.500/-
05450 07716 09222 19109 51529
56129 59016 63587 70993 79915
4th Prize Rs.200/-
0127 2762 3527 3920 4023 5258 7721
7758 8368 9106
5th Prize Rs.100/-
0516 2424 3011 3251 4508 5123 5868
6263 6272 8838
6th Prize Rs.50/-
0169 1864 3498 5007 6507 7652 8770
0259 2146 3598 5489 6644 7659 9002
0340 2168 3627 5491 6660 7711 9053
0464 2178 3781 5633 6664 7723 9185
0770 2290 3965 5758 6762 7831 9198
0823 2340 3978 5856 7077 7844 9266
0847 2371 4375 5909 7083 7852 9338
1169 2508 4444 5918 7186 7867 9382
1325 2513 4460 6106 7202 7902 9652
1338 2640 4510 6221 7346 7975 9719
1374 2906 4538 6271 7349 8194
1576 2949 4644 6308 7378 8246
1728 3167 4861 6366 7478 8595
1746 3294 4904 6440 7493 8610
1855 3411 4950 6497 7612 8685

DEER SERIES
1st Prize Rs.10.000/- D 371097
2nd Prize Rs.7.000/- 07242
3rd Prize Rs.3.500/-
08440 17827 25166 26847 35421
63252 68107 76797 77664 78686
4th Prize Rs.200/-
0212 0269 0696 1056 1092 3240 4919
5777 8156 9507
5th Prize Rs.100/-
1334 1525 2121 2616 2930 2992 6886
8412 9553 9848
6th Prize Rs.50/-
0290 2148 3458 4746 6598 7510 8821
0455 2265 3626 4847 6669 7531 8927
0633 2350 3651 5137 6705 7565 9117
0654 2378 3744 5142 6736 7729 9123
0703 2391 4188 5224 6818 7748 9321
0744 2484 4252 5629 6946 7855 9401
0762 2490 4336 5719 6957 8068 9406
0836 2523 4408 5771 7049 8110 9670
0841 2615 4459 5992 7105 8142 9853
1171 2921 4490 6013 7151 8256 9934
1260 2933 4563 6114 7160 8312
1264 3049 4626 6196 7180 8332
1426 3254 4656 6319 7241 8354
1427 3418 4704 6333 7284 8393
2113 3442 4724 6413 7299 8717

THANGAM NALLANERAM EFFORT SUNDAY
Draw No:112 DrawDate on:06/08/17

THANGAM SERIES
1st Prize Rs.10.000/- T 201366
2nd Prize Rs.7.000/- 50798
3rd Prize Rs.3.500/-
08460 19846 34402 37204 41990
46645 48594 62451 67454 74893
4th Prize Rs.200/-
2479 2726 2880 4607 5199 5960 6562
7622 8697 9557
5th Prize Rs.100/-
0724 1198 1535 1891 4447 5543 6318
6591 7485 9976
6th Prize Rs.50/-
0183 2194 3922 5575 6597 8012 9448
0518 2262 3955 5578 6701 8187 9542
0737 2287 4076 5604 6777 8199 9631
0788 2546 4379 5637 6800 8279 9654
0888 2619 4380 5752 6938 8320 9679
0908 2782 4415 5770 7034 8475 9756
0985 2798 4574 5799 7252 8540 9780
1118 2928 4614 5858 7309 8675 9822
1178 2968 4643 5869 7343 8744 9829
1323 3408 4689 5881 7345 8760 9937
1439 3533 4761 5926 7512 8767
1542 3597 5179 5941 7620 9081
1796 3761 5413 5983 7642 9250
1859 3825 5485 6043 7699 9299
1942 3911 5547 6093 8006 9352

NALLANERAM SERIES
1st prize Rs.10.000/- N 678282
2nd Prize Rs.7.000/- 08391
3rd Prize Rs.3.500/-
10167 12757 24028 30322 48845
62424 68948 83580 86136 91460
4th Prize Rs.200/-
3045 4106 4359 5209 6528 8073 8315
8503 8538 9310
5th Prize Rs.100/-
0691 2480 5549 6121 6171 7605 8013
9407 9415 9702
6th Prize Rs.50/-
0066 2050 3153 5102 6217 7251 9223
0089 2131 3437 5105 6257 7262 9243
0783 2204 3439 5231 6295 7682 9339
0813 2400 3845 5268 6326 7725 9346
0884 2418 3987 5432 6365 8089 9374
0930 2586 4031 5452 6417 8162 9708
1133 2590 4144 5505 6549 8219 9766
1217 2599 4194 5612 6607 8480 9818
1243 2663 4209 5648 6639 8496 9849
1417 2719 4446 5731 6651 8843 9884
1425 2759 4473 5800 6785 9147
1524 2875 4624 5850 6813 9180
1892 2890 4742 5884 6919 9193
1955 2909 4883 6063 6985 9213
1975 2994 5068 6127 7036 9218

KUMARAN VISHNU THUNDER SUNDAY
Draw No:112 DrawDate on:06/08/17

KUMARAN SERIES
1st prize Rs.10.000/- K 944822
2nd Prize Rs.7.000/- 03220
3rd Prize Rs.3.500/-
02509 11763 12028 16103 36331
42080 44260 55563 56094 70371
4th Prize Rs.200/-
0951 1043 1091 2623 4837 5853 6530
6879 8152 9905
5th Prize Rs.100/-
2052 2221 2507 3152 3930 4357 5040
5842 6914 8304
6th Prize Rs.50/-
0064 1836 3218 4126 5492 7847 8950
0275 1897 3229 4169 6222 7984 9070
0294 1995 3378 4298 6361 8092 9129
0497 2132 3415 4456 6397 8288 9161
0566 2184 3436 4562 6407 8296 9658
0642 2208 3576 4747 6574 8370 9688
0709 2233 3590 4764 6804 8478 9693
0819 2276 3740 4843 6901 8560 9763
0942 2754 3866 5002 6903 8563 9891
1182 2799 3871 5119 6986 8695 9923
1228 2825 3927 5138 7010 8701
1442 3064 3960 5168 7253 8702
1683 3094 3969 5359 7608 8796
1724 3104 4010 5362 7792 8891
1774 3190 4058 5393 7817 8946

VISHNU SERIES
1st prize Rs.10.000/- V 777507
2nd Prize Rs.7.000/- 92917
3rd Prize Rs.3.500/-
01763 03566 17155 44740 49427
54826 57492 59078 67321 75489
4th Prize Rs.200/-
1694 2939 3664 4956 5219 5910 7043
7389 7593 9799
5th Prize Rs.100/-
0806 1730 1944 2015 4429 5726 6289
8731 9357 9614
6th Prize Rs.50/-
0177 1392 2665 4412 5709 7056 8798
0216 1656 2683 4520 5743 7197 9005
0431 1660 2773 4659 5780 7367 9230
0503 1777 2885 4711 5985 7476 9239
0543 1985 3138 4802 6007 7598 9384
0560 2153 3463 4915 6027 7628 9419
0623 2331 3565 4938 6053 7668 9486
0637 2453 3702 4965 6095 7803 9582
0707 2502 3914 4990 6239 8059 9711
0877 2536 4015 5062 6502 8331 9793
1040 2558 4071 5152 6578 8386
1076 2593 4259 5162 6700 8489
1156 2654 4303 5355 6794 8584
1347 2655 4315 5440 6833 8704
1377 2659 4367 5644 6891 8755

రోడ్డుపైకి వచ్చి రభస సృష్టించిన ఖడ్గమృగం



చెన్నై, ఆగస్టు 6, ప్రభాతవార్త: అసోం సమీప అటవీ ప్రాంతం నుంచి ఓ ఖడ్గమృగం రోడ్డుపైకి వచ్చింది. రహదారిపై వాహనాలను వెంబడిస్తూ పరుగులు పెట్టింది. దీన్ని చూసిన వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. కొందరు తమ వాహనాలను వెనక్కు మళ్లించారు. మరికొందరు దాని నుంచి తప్పించుకొని ముందుకు వెళ్లారు. అనంతరం ఆ ఖడ్గమృగం అడవిలోకి వెళ్లిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆ మార్గంలో వెళ్తున్న ఓ వ్యక్తి తీసి సమాజిక మాధ్యమాల్లో పెట్టగా వైరల్‌గా మారింది.

తుమ్మలను పరామర్శించిన సిఎం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు6: అస్వస్థత గురై యశోధా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పరామర్శించారు. ఆదివారం మధ్యాహ్నం ఆసుపత్రికి వెళ్లి తుమ్మలతోనూ, వైద్యులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడారు. చికిత్స అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. త్వరగా కోలుకోవాలని, తగినంత విశ్రాంతి తీసుకున్న తర్వాతే విధులకు హాజరుకావాలని సిఎం కెసిఆర్ మంత్రి తుమ్మలకు [illegible].

వారం - వర్జ్యం
7-8-2017 సోమవారం
హేవళంబి నామ సంవత్సరం దక్షిణాయనం
శ్రావణమాసం శుక్లపక్షం
పౌర్ణమి రా. 10.46
శ్రవణం తె. 4.06
రా. క. 7.30-9.00
దు. మ. 12.31-1.22
వ. ఉ. 6.39-8.22

రాజీలేని పోరాటం

నిర్ణయించింది. దీనితో మనం సంతృప్తి చెందడం లేదు. కాళేశ్వరం,పాలమూరు, సీతారామ లాంటి నీటిపారుదల ప్రాజెక్టులు ఏడాది, రెండేళ్ల కిందటే ప్రారంభమయ్యాయి. మిషన్ భగీరథ ప్రాజెక్టు రెండేళ్ల కిందే ప్రారంభమైంది. మొదటి దశను స్వయంగా ప్రధానే ప్రారంభించారు. యాదాద్రి,భద్రాద్రి పవర్ ప్లాంటుల నిర్మాణాలు కూడా ఎప్పుడో ప్రారంభమయ్యాయి. గృహ నిర్మాణాలు కూడా రెండు,మూడేళ్ల నుంచి జరుగుతునే ఉన్నాయి. ఈ ఏడాది చేయాల్సిన పనులకు సంబంధించి బడ్జెట్‌లో అంచనాలు రూపొందించి, నిధులు కేటాయించాం. మధ్యలో జూలై1 నుంచి జిఎస్టీ అమల్లోకి వచ్చింది. మధ్యలో వచ్చిన జిఎస్టీని ఎప్పటి నుంచో నడుస్తున్న ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు వర్తింప చేయడం భావ్యం కాదు. న్యాయం కాదు' అని పేర్కొన్నారు. 'కొన్ని ప్రాజెక్టులను బయట ఆర్థిక సంస్థల సహకారంతో నిర్మిస్తున్నాము. దాని ఒప్పందాలు కూడా జిఎస్టీ కన్నా ముందే కుదుర్చుకున్నాము. వాటిని మార్చడం సాధ్యం కాదు. కేంద్ర ప్రభుత్వం విధించిన 12శాతం జిఎస్టీ చెల్లిస్తె రా ష్ట్రానికి చాలా నష్టం జరుగుతుంది. ఇది కేవలం తెలంగాణ రాష్ట్రం సమస్య మాత్రమే కాదు. యావత్ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఎదురవుతున్న ఇబ్బంది. దీనిపై కేంద్రం పునరాలోచించాల్సిన అవసరం ఉంది. కేంద్రం మన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందిస్తుందనే ఆశిద్దాం. లేకుంటే న్యాయ పోరాటం చేయకతప్పదు. జరిగే నష్టంపై సమగ్ర వివరాలతో ప్రధానికి లేఖ రాద్దాం. ప్రధాని స్పందనను చూసి తదుపరి కార్యాచరణ సిద్ధం చేద్దాం' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సిఎం వద్ద జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పిసింగ్, జెన్‌కో ఛైర్మన్ డి.ప్రభాకర్‌రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, ప్రభుత్వ సలహాదారు జిఆర్‌రెడ్డి, సీనియర్ ఐఎఎస్ అధికారులు సోమేశ్‌కుమార్,శివ శంకర్, శాంతకుమారి, అనిల్ కుమార్, సందీప్ సుల్తానియా. సునీల్‌శర్మ దానకిశోర్,శ్రీదేవి, జిహెచ్‌ఎంసి కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఈఎన్సీలు మురళీధర్, రవీందర్‌రావు, గణపతిరెడ్డి, విజయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై వత్తిడి తెస్తాం: బూర నర్సయ్యగౌడ్

జిఎస్టీ భారం అన్ని రా ష్ట్రాల్లోనూ ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై పడుతుందని, దీనిని తగ్గించేందుకు అన్ని రాష్ట్రాలను సమన్వయం చేసుకుని కేంద్రంపై వత్తిడి తెస్తామని టిఆర్ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారంనాడు మీడియాతో మాట్లాడిన ఆయన ఎన్డీయే తీసుకొచ్చిన జిఎస్టీ బిల్లుకు టిఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని, అయితే కేంద్రం బిల్లు పాస్ అయ్యేంత వరకు అన్ని రాష్ట్రాల అంశాలను పరిగణలోకి తీసుకుంటామన్నారని తెలిపారు. మా అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని కేంద్రం బిల్లులో జీ చేస్తారని, రాష్ట్రంలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ,డబుల్ బెడ్ రూమ్‌పై పెద్ద ఎత్తున జిఎస్టీ భారం పడుతోందన్నారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు అంబానీ, ఆదాని కంపెనీలు కావని, ప్రజలకు అవసరమైన ప్రాజెక్టులని ఆయన వ్యాఖ్యానించారు. బిజెపికి మూడేళ్ల నుంచి అన్ని అంశాల్లో సపోర్ట్ చేస్తున్నామని, ఇప్పటికైనా తెలంగాణ ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు సహకరించాలని కోరారు. కేంద్ర పెద్దలు ఎయిమ్స్‌పై నీళ్ల చల్లారని, సీట్ల పెంపు లేదని చెప్పారని, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీపై కేంద్ర స్పందన లేదని అన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి హక్కులను సాధించుకోవడం టిఆర్ఎస్‌కు కొత్త కాదన్నారు.

అదే 'మోత'!

కొనసాగు తుంది. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులు గందరగోళ పరిణామాలను దారితీస్తున్నాయి. బరువు తగ్గించకపోతే పాఠశాలలపై ఎలాంటి చర్యలు చేపడతారనే అంశంపై స్పష్టమైన విధానం లేదు, కానీ పిల్లలు బ్యాగు బరువు తగ్గించేందుకు యాజమాన్యాలు చర్యలు తీసుకుంటున్నాయా లేదా అన్న అంశాన్ని పరిశీలించేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధికారులు తనిఖీలు నిర్వహించాలని మాత్రం ప్రభుత్వం విద్యాశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వానికే స్పష్టత లేదనే ఉద్దేశ్యంతో యాజమాన్యాలు దీనిపై పెద్దగా దీనిపై దృష్టి సారించే పరిస్థితి కనిపించడం లేదు.

పాఠ్య పుస్తకాల అమలుపై బిన్న వాదనలు...

రాష్ట్రంలో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలు తమ ఇష్టానుసారంగా పాఠ్య పుస్తకాలను వినియోగిస్తున్నాయి. తమకు నచ్చిన పబ్లిషర్స్‌కు సంబంధించిన పుస్తకాలను అమలు చేస్తున్నాయి. వాటికి తోడు పదుల సంఖ్యలో నోటు పుస్తకాలు ఉండడంతో విద్యార్థులకు మోత తప్పడం లేదు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) నిర్ధేశించిన పుస్తకాలను మాత్రమే అమలు చేయాలి. కానీ ఇది ఆచరణలో ఎక్కడ అమలు కావడం లేదు. దీనికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి సైతం ప్రైవేటు స్కూళ్ళ అభిమతానికే మద్దతిచ్చారు. దీంతో ప్రైవేటు పాఠశాలల ఎస్‌సీఈఆర్‌టీ నిబంధలను అమలు చేసేందుకు ఏ మాత్రం సుముఖను ప్రదర్శించడం లేదు. ఇటీవల ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల సంఘం నాగోలులో నిర్వహించిన ఒక సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కడియం దీనికి సంబంధించిన వ్యాఖ్యలు చేశారు. 1 నుంచి 5వ తరగతి వరకు మీ ఇష్టం వచ్చిన పాఠ్య పుస్తకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎస్‌సీఈఆర్‌టీ నిర్ధేశించిన పుస్తకాలను వాడాల్సిన అవసరం లేదన్నారు. ఇదే విషయాలను ప్రైవేటు యాజామాన్యాలు పట్టుకొని అధికారులను దబాయించేలా మాట్లాడుతున్నారు. దీంతో గతేడాది పుస్తకాల విషయంలో కఠినంగా వ్యవహరించిన విద్యా శాఖ ఈ ఏడాది వాటినే మాత్రం పట్టింతచుకోవడం లేదు. స్కూలు బ్యాగు బరువు తగ్గించేందుకు జారీ చేసిన ఉత్తర్వుల్లో మాత్రం ఈ విషయాన్ని ఖచ్చితంగా చెప్పారు. ఎస్‌సీఈఆర్‌టీ నిర్ధేశించిన పుస్తకాలనే వాడాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎస్‌సీఈఆర్‌టీ నిర్ధేశించిన పుస్తకాలనే వాడాలనే నిబంధనపై హైకోర్టులో స్టే కొనసాగుతుంది. ఈ అంశం కోర్టులో ఉండడంతో ఈ ఏడాది అమలు చేయడం సాధ్యం కాదు. సీబీఎస్, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ ఒకే విధంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. దీనివల్ల జాతీయ స్థాయి పోటీ పరీక్షల అనుగుణంగా పాఠ్య పుస్తకాలుండాలని ప్రైవేటు యాజామాన్యాలు కోరుతున్నారు. కానీ ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకాలకు ఆ స్థాయి లేదని, దీనివల్లనే యాజామాన్యాలు ప్రైవేటు పుస్తకాల వైపు మొగ్గుచూపుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టకుండా కాగితాలకే పరిమితమయ్యే ఉత్తర్వుల విడుదలపై విమర్శలు చేలరేగుతున్నాయి. వీటిపై దృష్టి పెట్టకపోతే ఈ ఉత్తర్వు ఉత్తర్వుగానే మిగిలే అవకాశం కూడా లేకపోలే దని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పిల్లల బ్యాగు బరువులిలా....

ప్రైవేటు పాఠశాలల్లో 1 , 2వ తరగతి వరకు 7 కేజీలు, 3 నుంచి 5వ తరగతికి 9 కేజీలు, 6, 7వ తరగతికి 12 కేజీలు, 10వ తరగతికి 17 కేజీలు బరువు ఉందని విద్యాశాఖ నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. దీనివల్ల విద్యా ర్థుల పలు రకాల అనారోగ్యాలకు గురవుతున్నారనే అభిప్రాయానికి అధికారులు వచ్చారు. ప్రధానంగా శారీరక ఎదుగుదల దెబ్బతినడంతో పాటు వెన్నుపూస వంగిపోతుందని స్పష్టం చేశారు. ఇదే విషయాలు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులో పేర్కొంది. ఈ నేపథ్య ంలోనే ఎస్‌సీఈఆర్‌టీ నిర్ధేశిత పుస్తకాలనే వాడాలని నిర్ణయించారు. పైగా బ్యాగుతో సహా 1 ,2 తరగతులకు 1.5 కేజీలు, 3, 4, 5 తరగతులకు 2 కేజీలు, 6, 7 తరగతులకు 4 కేజీ లు, 8, 9, 10 తరగతులకు 4.5 కేజీలుండాలని స్పష్టం చేసింది. అయితే వీటిని పాటించని స్కూళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి, కేసులు నమోదు చేయాలా లేక గుర్తింపును రద్దు చేయాలా వంటి అంశాలను మాత్రం ఉత్తర్వులోఓ లేకపోవడం ఈ మార్గ దర్శకాలు బుట్టదాఖ లయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బ్యాగు మోతలపై ముందుగా అవగాహన, చైతన్యం దృష్టి పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ తెలిపారు. ఇది ఒకరితో జరిగే పని కాదని, విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాలల యజమానులతో కలిసి చేయాల్సిన పనులన్నారు. సమిష్టిగా చేస్తే తప్ప దీనికి తగిన ఫలితాలు రావనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బ్యాగు బరువు వల్ల కలిగే దుష్పరిణాలు తెలిసినా... వాటిపై అవగాహన కల్పిం చి బరువు తగ్గించేందుకు చర్యలు తీసుకునేలా చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అయినా కూడా పాఠశాలల యాజమానుల్లో మార్పు లేకపోతే చర్యలకు శ్రీకారం చుడతామని వివరించారు. ఇప్పటికే దీ నికి సంబంధించిన కార్యాచరణను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిందని చెప్పారు. ఇందుకోసం మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో కూడా కమిటీని ఏర్పాటు చేసి అవ గాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కమ్ముకొస్తున్న కరవు!

ఎండిపోతున్నాయని రైతాంగం గగ్గోలు పెడుతోంది. పంట భూములకు సాగు నీరందక ప్రధానంగా మెట్ట ప్రాంతాల్లోని పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభమై రెండు నెలలు దాటినా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ని పలు జిల్లాల్లో చుక్క నీరు లేకపోవడంతో అన్నదాతల పరిస్థితి దయనీయంగా తయారైంది. మరో పది రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగితే రెండు రాష్ట్రాల్లోనూ కరవు పరిస్థితి తప్పదని అధికారయంత్రాంగం సైతం భావిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో మొత్తం 43.24 లక్షల హెక్టార్లలో సాగవుతుందని వ్యవసాయ శాఖ అం చనా వేసింది. ఇందులో 16.76 లక్షల హెక్టార్లలో పత్తి, 9.34 లక్షల హెక్టా ర్లలో వరితో కలిపి 19.48 లక్షల హెక్టార్లలో ఆహారధాన్యాలు, 3.25 లక్షల హెక్టార్లలో వేరుశెనగ, పొద్దతిరుగుడు, సోయాబీన్ వంటి ఆయిల్ పంటలను సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే వర్షాలు తగినంతగా కురవకపోవడం, ప్రాజెక్టుల్లో నీరు చేరకపోవడంతో ప్రణాళికలన్నీ తారుమారై ఖరీఫ్ సాగు ముందుకు సాగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ ప్రారంభమైన జూన్ నెల మొదటి నుండి ఈనెల 2వ తేదీ నాటికి వర్షపాతాన్ని పరిశీలిస్తే రాష్ట్రంలోని మేడ్చర్ల, మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, జోగులాంబ జిల్లాల్లో మాత్రమే సాధారణం కంటే 20 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో -23 శాతం, కొమరంభీంలో -33 శాతం, మంచిర్యాలలో -37 శాతం, నిర్మల్‌లో -38 శాతం, నిజామాబాద్-33 శాతం, జగిత్యాల -36 శాతం, పెద్దపల్లి -30 శాతం, జయశంకర్-20 శాతం, వరంగల్ అర్బన్ -15 శాతం, రాజన్నలో -19 శాతం, సంగారెడ్డి -12 శాతం, వరంగల్ రూరల్ -6 శాతం, కరీంనగర్ -5 శాతం, కామారెడ్డి -7 శాతం, మెదక్ -27 శాతం, జనగామ -14 శాతం, వికారాబాద్ -16 శాతం, నాగర్‌కర్నూల్-8 శాతం చొప్పున తక్కువగా వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో కొంత వర్షాభావ పంటలు వేయగా, వర్షపాతం లేని జిల్లాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 15 శాతం తక్కువ వర్షపాతం కురిసింది. ఈనేపథ్యంలో తెలంగాణలో ఇప్పటి వరకూ 32.17 లక్షల హెక్టార్లలో పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కకట్టింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 3.45 లక్షల హెక్టార్లలో వరి నాట్లు వేశారు. ఇంకా దాదాపు 6లక్షల హెక్టార్లలో వరి నాట్లు వేయాల్సి ఉంది. మొత్తం ఆహార ధాన్యాల సాగు విషయంలో 19.48 లక్షల హెక్టార్లకుగాను ఇప్పటి వరకూ 11.58 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. జూలై నెలలో కురిసిన వర్షాలకు విత్తనాలు మొలకలు వచ్చి కొంత వరకూ ఏపుగా పెరిగినా, గత కొన్ని రోజులుగా వర్షాలు పడకపోవడంతో అవి దెబ్బతినే పరిస్థితి ఏర్పడినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇదే పరిస్థితి మరో పది రోజులు కొనసాగితే ఖరీఫ్ సీజనులో పంటలు అధికంగా నష్టపోయే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అలాగే ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలో సైతం ఇదే పరిస్థితి ఏర్పడడంతో రైతాంగం ఆందోళనలో కొట్టుమిట్టాడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 42 శాతం విస్తీర్ణమే సాగైంది. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 42,06,686 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికిగాను ఇప్పటి వరకూ 17,54,186 హెక్టార్లలో నాట్లు పడినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. వర్షపాతం విషయంలో రాష్ట్రంలోనే సాధారణం కంటే తక్కువగా -33.2 మిల్లీ మీటర్లతో అనంతపురం జిల్లా ఉండగా, ఆ తర్వాత -6.4 మిల్లీ మీటర్లతో ప్రకాశం జిల్లా, -2.1 మిల్లీ మీటర్లతో శ్రీకాకుళం జిల్లా, -2-.8 మిల్లీ మీటర్లతో కర్నూలు జిల్లా, -24.9 మిల్లీ మీటర్లతో కడప జిల్లా, -21.3 మిల్లీ మీటర్లతో చిత్తూరు జిల్లా, -6.4 మిల్లీ మీటర్లతో ప్రకాశం జిల్లాల్లో వర్షపాతం తక్కువగా నమోదైంది. ఈ పరిస్థితుల్లో కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్ నుండి శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో ఆ ప్రాంతంలోని పంటలు ఎండిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. కాగా గత రెండేళ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కరవు పరిస్థితులు రైతాంగాన్ని ఆర్థికంగా దెబ్బతీశాయి. కరవు రక్కసి నుండి తమను ఆదుకుంటారనే ఆశతో రెండేళ్లుగా ఎదురు చూసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కరవు రైతాంగానికి రిక్తహస్తమే మిగిలింది. 2015-16 సంవత్సరంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని 231 మండలాలను కరవు మండలాలుగా ప్రభుత్వం గుర్తించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 359 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించింది. అలాగే 2016-17లో ఏపి ప్రభుత్వం 245 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించింది. రాష్ట్రంలోని శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లోని ఆయా మండ లాల్లో కరవు ప్రాంతాలుగా ప్రకటించినట్లు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈనేపథ్యంలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో కూడా కరవు ఛాయలు నెలకొనడంతో వేసిన పంటలు ఎండిపోతుండడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

ఒబిసి కమిషన్‌కు రాజ్యాంగ భద్రత

జిఎస్‌టిపై కేంద్రప్రభుత్వానిది ఏకపక్ష నిర్ణయమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ మాట సబబుకాదు, న్యాయసమ్మతం అసలేకాదు, -తెలంగాణలో బిజెపికి ప్రత్యర్థి పార్టీ టిఆర్ఎస్: కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ

హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 6 ప్రభాతవార్త: ఓబిసి కమిషన్ బిల్లును కాంగ్రెస్‌పార్టీ కుట్రపూరిత రాజకీయంతో అమెండ్‌మెంట్ తీసుకువచ్చి దాని యొక్క రాజ్యాంగ స్ఫూర్తినే తారుమారుచేసి తూట్లుపొడిచిందని కేంద్ర కార్మిక ఉపాధికల్పనాశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును లోక్‌సభ, తదుపరి రాజ్యసభలో ప్రవేశపెట్టి అత్యధిక మెజారిటీతో ఓబిసి కమిషన్ బిల్లును తీసుకువచ్చి దానికి రాజ్యాంగ భద్రతకల్పిస్తామ న్నారు. దీనివల్ల ఓబిసిలకు ఉద్యోగావకాశాలు మెరుగవుతాయన్నారు. ఆదివారం ఉదయం ఆదర్శనగర్‌లోని ఇసిఐసిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ మైనార్టీలపైనే కాంగ్రెస్‌పార్టీకి ప్రేమని, దీని ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నా వారు గుణపాఠం నేర్చుకోలేదని ఎద్దేవా చేశారు. వామపక్షాలదీ ఇదే బాట అన్నారు. ఓబిసిపై సమావేశాలను ప్రతి జిల్లాలోపెట్టి కాంగ్రెస్ కుట్రను బట్టబయలు చేస్తామని, ఓబిసికి వ్యతిరేక పార్టీ కాంగ్రెసేనని, కేవలం మొసలి కన్నీరే కారుస్తుందని దుయ్యబట్టారు. కనీసం మండల్ కమిషన్‌కు కూడా కాంగ్రెస్ సక్రమంగా అమలుపరచలేక పోయిందని చెప్పారు. ఈ తప్పుకు తెలంగాణలో కూడా కాంగ్రెస్ తప్పక మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. ఇక తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, ఐటిశాఖ మంత్రి కెటిఆర్ నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై కేంద్ర 12శాతం జీఎస్‌టిని విధించడం సరైంది కాదు-ఏకపక్ష నిర్ణయం అనడం



ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ

సబబుకాదని, న్యాయసమ్మతం అసలేకాదన్నారు. జీఎస్‌టి కమిటీలో టిఆర్ఎస్ కూడా భాగస్వామి అన్న విషయాన్ని మరువద్దని, అన్ని నిర్ణయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తీసుకొన్నాయేనని, ఈ కమిటీలో రాష్ట్రప్రభుత్వాల సభ్యులే ఎక్కువన్న విషయాన్ని గుర్తుచేశారు. జీఎస్‌టి వల్ల ప్రాజెక్టులకు ఉపయోగపడే వస్తువులైన సిమెంటు, స్టీలు, రవాణా ఖర్చులు తగ్గాయని, సిఎం కెసిఆర్ ఇప్పుడే ఒక నిర్ధారణకు రావడం సరైంది కాదన్నారు. తెలంగాణ ప్రాజెక్టులు రైతులు, సామాన్య ప్రజల కోసం ఉపయోగపడుతున్నాయి కాబట్టి ఈ విషయంలో పూర్తి నివేదికలు తెప్పించుకొని, సునిశితంగా పరిశీలించి ఆ వివరాలతో ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ, అధికారులతో చర్చించి తగునిర్ణయం తీసుకొనేందుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. చివరిగా కార్మికశాఖ మంత్రిగా కార్మికుల యొక్క సాంఘిక భద్రతను పెంచే ప్రక్రియలు వేగవంతం చేశామన్నారు. డైరెక్టర్ జనరల్ అడ్వయిజ్ అండ్ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్, ఫ్యాక్టరీ అడ్వయిజరీ అండ్ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్‌లతో ఇఎస్ఐసి వీటిమధ్య ఎంఓయు కుదుర్చుకోవడం జరిగిందన్నారు. దీనివల్ల వృత్తిపరమైన కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, వివిధ వ్యాధులకు గురికాకుండా ఆరోగ్య పరిరక్షణ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, ఆయా ఇన్‌స్టిట్యూట్ల ద్వారా హెల్త్ రిలేటెడ్ ట్రైనింగ్ ఇఎస్ఐసి డాక్టర్లచే ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ సెంటర్‌ను ఫరీదాబాద్‌లో ప్రారంభించామని, త్వరలో ముంబయ్, చెన్నై, కోల్‌కతా, కాన్పూర్ ప్రారంభించబోతున్నా మన్నారు. వీటి వల్ల కార్మికులకు సామాజిక భద్రత, అసంఘటిత కార్మికులకు సంఘటితం వైపు వెళ్లే అవకాశం కలుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పెద్దయెత్తున లబ్ధి చేకూరుతుందని వివరించారు. చివరిగా తెలంగాణ రాష్ట్రంలో తమకు ప్రత్యర్థి పార్టీ టిఆర్ఎస్ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఎస్ఐసి ప్రాంతీయ సంచాలకుడు అరుణ్‌పాండే, డా. తిరుపతితదితరులు పాల్గొన్నారు.

ప్రొ.భార్గవ వల్లే సిసిఎంబికి ప్రపంచవ్యాప్త గుర్తింపు

కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి



ఆదివారం భార్గవ సంతాపసభలో ప్రసంగిస్తున్న కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి

హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 6 ప్రభాతవార్త: పి.ఎం.భార్గవ లాంటి వ్యక్తులను భారతదేశం పుట్టించకపోతే భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉందని, ఆయన విశ్వమానవుడని కేంద్ర మాజీమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి అన్నారు. సీసీఎంబి(సెంటర్ ఫర్ సెల్యులర్ మాలిక్యులర్ బయోలజీ)ని ప్రపంచపటంలో నిలిపిన ఘనత పుష్ప భార్గవకే దక్కుతుందని అన్నారు. సీసీఎంబి పూర్వ డైరెక్టర్ డాక్టర్ పిఎం.భార్గవ సంతాప సభ ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ భార్గవ ఒక వ్యక్తికాదు సంస్థ అని నివాళులు అర్పించారు. మండలవాదానికి అనుగుణంగా మాట్లాడి వెనుకబడిన వర్గాలవారికి రిజర్వేషన్లు రావాలని కోరుకున్న వ్యక్తి అని చెప్పారు. శాస్త్రీయ విప్లవం వల్లే ఆధునిక సమాజమైందని పేర్కొన్నారు. అన్నింటికన్నా పెద్ద విప్లవం శాస్త్రీయ విప్లమేనని, ఈ విప్లవం వచ్చాకే అన్నీవచ్చాయని, మొత్తంగా చెప్పాలంటే శాస్త్రీయ విప్లవం ఆధునిక సమాజానికి పునాది అని జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే కొందరు శాస్త్రవేత్తల్లో వైజ్ఞానిక దృక్పదం లోపిస్తోందని అన్నారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ చుక్కా రామయ్య మాటాడుతూ శాస్త్రవేత్తలు మౌనం వహించడం తీవ్రవాదానికంటే ప్రమాదమని అన్నారు. శాస్త్రవేత్తలు మౌనం పాటిస్తున్నారని, ఇది తగదని ఆయన అన్నారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ సైన్స్ ప్రభావంతో రాజకీయాల్లోకి వచ్చానని, అందుకే శాస్త్రవేత్తలంటే తనకెంతో గౌరవం అని తెలిపారు. పాత అంశాన్ని విశ్లేషించి కొత్తవాటిని కనుగొనేవారే శాస్త్రవేత్తలని, శాస్త్రాలను, శాస్త్రవేత్తలను ప్రోత్సహించే స్ఫూర్తితో ముందుకు పోదామని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి పి.నారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు పార్టీలే లేవంటున్నారు, మా విధానమే కమ్యూనిస్టు విధానమని చెప్పుకుంటున్నారు, ఇందులో ఆంతర్యమేమిటో అర్థంకావడం లేదన్నారు. డాక్టర్ పి.ఎం.భార్గవ వైజ్ఞానిక దృక్ఫధాన్ని, ప్రజాసైన్స్ ప్రోత్సాహ కేంద్రం ఏర్పాటుకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని, ఈ విషయంలో సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన ఒప్పుకుంటే మంచిపేరు వస్తుందన్నారు. సిసిఎంబి డైరెక్టర్ రాకేశ్‌శర్మ, మాజీ డైరెక్టర్‌లు లాల్జీసింగ్, డాక్టర్ సిహెచ్. మోహన్‌రావు, నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మెహతాబ్ ఎస్.బాంబ్జి, ఐఐసిటి మాజీ డైరెక్టర్ డాక్టర్ అమ్మద్ కమాల్, ఎన్‌జిఆర్ఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ హర్షగుప్త, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఆదినారాయణ, ప్రతినిధులు టి.శ్రీనాథ్, ప్రొఫెసర్ బిఎన్.రెడ్డి, ప్రొఫెసర్ కె.సత్యప్రసాద్, రమేశ్, ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డ మరో డ్రగ్స్ ముఠా

180 గ్రాముల కొకైన్ స్వాధీనం, నైజీరియన్ సహా ఇద్దరు అరెస్టు



స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న కొకైన్‌ను ఆదివారం మీడియాకు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ చీఫ్ లింబారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: హైదరాబాద్‌లో మరో డ్రగ్స్ ముఠా పట్టుబడింది. ఈ సందర్భంగా ఒక నైజీరియన్ సహా ఇద్దరు అరెస్టవగా వీరి వద్ద నుంచి 180గ్రాముల కొకైన్‌ను, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ లింబారెడ్డి దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. నైజీరియాలోని లాగోస్ నగరానికి చెందిన ఒగుగువా జాన్ బాస్కో (37) బిజినెస్ వీసాపై ఇండియాకు వచ్చి ఇక్కడి దుస్తులను తమ దేశానికి ఎగుమతి చేస్తుంటాడు. ముంబాయిలో రెండేళ్లుగా వుంటున్న ఇతనికి కొకైన్ అలవాటు ఉంది. ముంబాయిలోని పలువురికి ఇతను కొకైన్ అలవాటు చేశాడు. నైజీరియా నుంచి తక్కువ ధరకు కొకైన్‌ను తీసుకువచ్చే జాన్ బాస్కో ఇక్కడ ఎక్కువ ధరకు అమ్మేవాడు. ఈ క్రమంలో ఇతనికి దేశ వ్యాప్తంగా పలు నగరాలలో నమ్మదగ్గ ఏజెంట్లు వున్నారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో నివసించే కాకినాడ వాసి మహమ్మద్ జహరుల్లా అలియాస్ సన్నీ ఊరఫ్ ఐజాజ్ (33) కూడా ఇతనికి ఏజెంట్‌గా వున్నాడు. కొంత కాలంగా ఐజాజ్, జాన్ బాస్కో నుంచి కొకైన్‌ను తక్కువ ధరకు కొనుగోలుచేసి ఎక్కువ ధరకు విక్రయిస్తుండే వాడు. ఒక గ్రాము కొకైన్‌ను రెండు వేల రూపాయల నుంచి రెండున్నర వేలకుకొని ఐదువేల రూపాయలనుంచి ఆరువేల వరకు ఐజాజ్ విక్రయించేవాడు. ఐజాజ్‌కు నగరంలోని పలువురు ఈవెంట్ మేనేజర్లు పరిచయం వుండడంతో కొకైన్ అమ్మకాలను ఇతను బాగానే చేసేవాడు. కాగా వారంరోజుల క్రితం ఐజాజ్, జాన్ బాస్కోకు ఫోన్ చేసి తనకు వెంటనే 80 గ్రాముల కొకైన్ కావాలని కోరాడు. అందుకు జాన్ బాస్కో అంగీకరించి శనివారం ముంబాయినుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఐజాజ్‌ను సంజీవరెడ్డి నగర్‌లోని మధురానగర్ పార్కులో జాన్‌బాస్కో కలిశాడు. అనంతరం ఐజాజ్‌కు 80 గ్రాముల కొకైన్ అందించాడు. తనకు పరిచయమున్న మరో ఏజెంట్‌కోసం వంద గ్రాముల కొకైన్‌ను తన వద్దే వుంచుకున్నాడు. కాగా దీనిపై సమాచారం అందుకున్న ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్, సంజీవరెడ్డినగర్ పోలీసులు శనివారం రాత్రి ఏడుగంటల ప్రాంతంలో సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఐజాజ్ వద్ద 80 గ్రాములు, జాన్‌బాస్కోవద్ద వంద గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరివద్దనుంచి మోటార్ సైకిల్‌తోపాటు నాలుగు సెల్‌ఫోన్లను కూడా జప్తు చేశారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం సంజీవరెడ్డి నగర్ పోలీసులకు అప్పగించారు. కాగా జాన్ బాస్కో, ఐజాజ్ లింకులపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

రద్దయిన నోట్ల చలామణి ముఠా అరెస్టు

రూ.99 లక్షల పాత నోట్ల జప్తు

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: వెయ్యి, 500 రూపాయల నోట్లను కేంద్రం నిషేధించి పది నెలలు అవుతున్నా వీటి చలామణి చేసే ముఠాల ఆగడాలు కొనసా గుతూనే వున్నాయి. చాలా మంది బడా బాబులు తమ వద్ద వున్న నల్ల ధనాన్ని మార్కెట్లోకి తేలేక, బ్యాంకుల్లో వేయలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పసిగడు తున్న కొన్ని ముఠాలు వీటిని తాము మార్పిడి చేస్తామని నమ్మిస్తున్న ఉదంతాలు వరుసగా వెలుగు చూస్తూనే వున్నాయి. ఇటువంటిదే ఒక ముఠాను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఈ ముఠా నుంచి 99 లక్షల రూపాయల రద్దయిన నోట్లను, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ లింబారెడ్డి దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు.

హైదరాబాద్ శివార్లలోని ఉప్పల్‌లో వుంటున్న సాయికుమార్ (22) ఇంజనీరింగ్ విద్యార్థి. జల్సా జీవితానికి అలవాటుపడ్డ సాయికుమార్ తన అవసరాలకు ఇంట్లో వారు ఇచ్చే డబ్బులు సరిపోక పోవడంతో దారితప్పాడు. ఇదే సమయంలో మియాపూర్‌లో వుంటున్న సాయి (24) (నెల్లూరు వాసి)తో ఏర్పడ్డ పరిచయం కారణంగా ఇద్దరు కలిసి రద్దయిన నోట్లను చలామణి చేసేందుకు వ్యూహం పన్నారు. అనుకున్నదే తడవు గా ఇద్దరు కలిసి తమకు పరిచయం వున్న ప్రవీణ్ అనే వ్యాపారి నుంచి 99 లక్షల రూపాయల రద్దయిన వెయ్యి, 500 రూపాయల నోట్లు తీసుకున్నారు. అనంతరం ఈ నోట్లను 50 శాతం కమీషన్‌కు మార్పిడి చేసేందుకు గుంటూరు జిల్లా నర్సారావుపేటకు చెందిన రియల్టర్ ప్రసాద్ (35), వరంగల్ జిల్లా జనగాంకు చెందిన కిరాణా షాపు యజమాని నాగేందర్ (42), నగర శివార్లలోని గడ్డి అన్నారంకు చెందిన రాంబాబు (36)లతో సంప్రదింపులు జరిపారు. ఈ ముగ్గురు కూడా జల్సా జీవితాలకు అలవాటు పడిన వారే కావడం గమనార్హం. ఇలా ఐదుగురు కలిసి తమ వద్ద వున్న 99 లక్షల రూపాయలను శనివారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఒక బ్యాగులో వుంచి సంజీవయ పార్కు వద్దకు వచ్చారు. ఈ నోట్లను తీసుకునేందుకు మరో ముఠా కోసం వారు ఎదురు చూస్తున్న తరుణంలో దీనిపై సమాచారం అందు కున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి ఐదు గురిని అరెస్టు చేసి వారి వద్ద వున్న 99 లక్షల రూపాయలను, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం రాంగోపాల్‌పేట్ పోలీసులకు అప్పగించారు.



రద్దయిన నోట్లను చలామణి చేసేందుకు వచ్చి టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన ముఠా

విద్యార్థులకు సామాజిక అంశాలపైనా అవగాహన

పెప్సీకో ఉపాధ్యక్షురాలు నీలిమ ద్వివేది

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక, ఆర్థిక అంశాలతో పాటు ఐక్యరాజ్య సమితి, భద్రత, ప్రపంచ పరిణామాలు, రాజ్యాంగ పరిస్థితులు తదితర అంశాలపై అవగాహన కల్పించడం ఆవశ్యకమని పెప్సీకో ఉపాధ్యక్షురాలు నీలి మా ద్వివేది అన్నారు. ఇలాంటి అంశాలపై అవగాహన కోసం సమావేశాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఐక్యరాజ్య సమితి, మానవ హక్కులు, భద్రత మండలి సర్వసభ్య సమావేశం, సైబర్ వార్ ఫేర్, ఆర్థిక, సామాజిక అంశాలతో పాటు భారత పార్లమెంట్‌లో చర్చలు జరిగే తీరుతో పాటు చేపట్టే అంశాలపై ఆదివారం ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నగరంలోని 30 పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మేడ్చల్‌లోని గుండ్ల పోచంపల్లిలోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో డిఆర్ఎస్ఎంయూఎన్ 2కె 17' పేరుతో నిర్వహించిన సమావేశంలో విద్యార్థి నేతలే ప్రతినిధులుగా వ్యవహరించారు. మానవ జాతికి సంబంధించిన పలు కీ లక అంశాలపై వారికున్న పరిజ్ఞానం మేరకు చర్చించి తమ ప్రతిభను చాటుకున్నారు.


ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి సమావేశాల సందర్భంగా ఎంపిక చేసిన ఎనిమిది అంశాలపై చర్చించడానికి విద్యార్థి ప్రతినిధులతో ఎనిమి ది గ్రూప్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్య సమితి, లోక్‌సభలో నిర్ణయించిన ఎజండాలపై సభ్యులు ఏ విధంగా మాట్లా డతారో ఈ మాక్ సమావేశంలో విద్యార్థి ప్రతినిధులు తమ గ్రూప్‌కు కేటాయించిన అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా నీలిమా ద్వివేది మాట్లా డుతూ ఐక్యరాజ్య సమితి, భారత పార్లమెంట్ పనితీరు, ప్రపంచ దేశాలలో ఏర్పడుతున్న పరిణామాలు, పర్యావరణానికి ఏర్పడుతున్న ముప్పు, డ్రగ్స్ మహమ్మరి వంటి అంశాలపై విద్యార్థులకు చిన్నతనంలోనే అవగాహనను కల్పిస్తే పెద్దయ్యాక వాళ్లు మంచిపౌరులుగా ఎదిగే అవకాశముంటుందనే అభి ప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డీఆర్ఎస్. ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతినిధి ఎకె.అగర్వాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే లోక జ్ఞానాన్ని పెంచి వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయాలన్న ఉద్దేశ్యంతో గడి చిన ఐదేళ్ళుగా ఈ మాక్ ఐక్యరాజ్యసమితి సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపల్ గౌరవ్ మురడియా, వైస్ ప్రిన్సిపల్ రుడోల్ఫ్ నొరోన్హా, సీఈఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా, రాజకీయ సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమాలు

15 నుంచి సెప్టెంబర్ 1 వరకు నిరసనలు

మీడియా సమావేశంలో సిపిఎం నేత రాఘవులు



హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: ప్రజా, రాజకీయ సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమాలను నిర్వహించనున్నట్లు సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు తెలిపారు. ఇందులో భాగంగానే ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఆరు అంశాల ప్రతిపాదికన ఉద్యమాన్ని రూపొందించామని వివరించారు. రెండు రోజుల పాటు జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాఘవులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో రుణమాఫీ అమలు కాలేదని, దీన్ని అమలు చేయాలని పలురాష్ట్రాల్లో రైతులు ఆందోళనలను చేసిన విషయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు రుణాలు రైతులతో పాటు కౌలు రైతులకు ఇచ్చేందుకు చట్టం తేవాలని కూడా డిమాండ్ చేశారు. గ్రామ సీమల్లో 60 శాతం ప్రజలు మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని విస్మరించి విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలే ముఖ్యమన్నట్లు కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్పొరేట్లకు చెందిన వ్యక్తులు, సంస్థలకు 1.56 లక్షల కోట్ల రూపాయల పన్నులను 2016-17 ఆర్థిక సంవత్సరంలోనే పాత బకాయిల పేరుతో మాఫీ చేసిందన్నారు. ఇదే మొత్తాన్ని రైతులకు ఉన్న రుణాలను మాఫీ చేస్తే దేశవ్యాప్తంగా అప్పులు రద్దయ్యేవన్నారు. కార్పొరేట్ రు ణాలను మాఫీ చేస్తే అభివృద్ధి మార్గం ఏర్పడుతుందని, రైతు రుణాలను మాఫీ చేస్తే వారిని సోమరిపోతులను చేస్తున్నట్లు అవుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన వ్యాఖ్య లపై రాఘవులు తీవ్రంగా మండిపడ్డారు. మో డీ ఎన్నికలకు ముందు ఏటా రెండు కోట్ల మందికి ఉద్యో గాలిస్తా మని హామీనిచ్చారు. కొత్త ఉద్యోగాల సంగతేమో గానీ గతేడాది 70 లక్షల ఉద్యోగాలు పోయాయని తెలిపారు.

ఫిక్కీ సర్వే ప్రకారం 97 శాతం పరిశ్రమల్లో కొత్తగా ఒక్కరిని కూడా ఉద్యో గంలోకి తీసుకోలేదన్నారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి కూడా ఉపాధి తగ్గిందని, కొత్తవారికి అవకాశాలు లేవని ప్రకటించిందన్నారు. నోట్ల రద్దు జీఎస్టీ అమలు తర్వాత ఉపాధి అవకాశాలు నాశనమ య్యాన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం ఏ మాత్రం మంచిది కాదన్నారు. రైల్వేను ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఇందులో భాగంగానే ఇప్పటికే 46 స్టేషన్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించిందని చెప్పారు. ఎయిరిండియా, బ్యాంకుల్లో ఈక్విటీని కూడా ప్రైవేటు వారికి విక్రయిం చేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తుందని విమర్శించారు.

సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శితమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట్, టి.జ్యోతిలు పాల్గొన్నారు.

సిఎం సభాస్థలిని పరిశీలించిన మంత్రి హరీష్ రావు

ఆర్మూర్, ఆగస్టు 6 ప్రభాతవార్త: నిజామాబాద్ జిల్లా ప్రస్తుత మెండోర మండలం (గత బాల్కొండ మండలం) పరిధిలోని పోచంపాడ్ గ్రామంలో గల శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పునర్జీవం కల్పించేందుకు శంకుస్థాపన చేసేందుకు ఈ నెల10వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు రానున్నా విషయం పాఠకులకు విదితమే. అక్కడ జరిగే సభాస్థలి ఏర్పాట్లను ఆదివారం మంత్రులు హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న నిజామాబాద్ ఎంపీ కవితతో పాటు కొప్పుల ఈశ్వర్, ఎంపీ వినోద్, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, బిగాల గణేష్ గుప్త, బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, షకీల్, కలెక్టర్ యోగితా రాణా, జాయింట్ కలెక్టర్ రవీందర్ రెడ్డిలతో పాటు నాయకులు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగ హరీష్ రావు ముఖ్యమంత్రి ఆవిష్కరించే పైలాన్, హెలీ పాడ్, పార్కింగ్ స్థలాలతో పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వచ్చేదారులను క్షుణ్ణంగా పరిశీలిం చారు. ఏర్పాట్లలో ఎలాంటిఇబ్బందులు ఎదురు కాకుండ అధికారులకు, నాయకులకుపలు జాగ్రత్తలు, సూచనాలు చేశారు. ఎంపీ కవిత మాట్లాడారు. నేను ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు పునర్జీవం పోసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కంకణం కట్టుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని దీంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగం కళ్లల్లో ఆనంద భాష్పాలు వెల్లి విరిస్తున్నాయన్నారు. వెయ్యి కోట్ల రూపాయలతో రివర్స్ పంపింగ్‌తోపాటు కాలువల ఆధునీకీకరణ చేపట్టడం జరుగుతుందని, మొత్తం 126కిలో మీటర్లకు తాగు, సాగునీటి సౌకర్యం కలుగు తుందని, తన నియో జకవర్గ పరిధిలో 102కిలో మీట ర్లకు నీటి సౌలభ్యం చేకూరడం తనకెంతో గర్వకారణం గా ఉందన్నారు. సభా స్థలిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు కలుగకుండా తనతోపాటు నాయకులు, అధికారులు శాయశక్తుల కృషి చేస్తున్నామన్నారు.



ముఖ్యమంత్రి సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రులు హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు

వార్త

గొప్పవాళ్లను కీర్తించడం సులువు. వాళ్లను అనుసరించడం చాలాకష్టం.
-కార్లయల్

దక్షతకు గౌరవం

భారత ఉపరాష్ట్రపతిగా ఓ తెలుగుతేజం అఖండ విజయం సాధించింది. విపక్ష అభ్యర్థిగా భారత స్వాతంత్ర్యోద్యమాన్ని దశదిశలా వ్యాపింపచేసిన మహాత్మా గాంధీమనుమడు పోటీకి దిగినా దేశ పార్లమెంటు చరిత్రలో ఓ తెలుగు రాజకీయనేత,సీనియర్‌నాయకుడు ముప్పవరపు వెంకయ్యనాయుడికే పట్టం కట్టారు. 11వతేదీ ప్రమాణ స్వీకారం చేయనున్న వెంకయ్య ఎన్నికముందు లాంఛన ప్రాయమేనని భావించినా మెజార్టీపైనే అధికార బిజెపి దృష్టి పెట్టింది. వీటికితోడు వెంకయ్య రాజకీయంగానూ, ప్రజా జీవితంలోను దేశవ్యాప్తంగా చిరపరిచితుడైన వ్యక్తి. తన వాగ్ధాటితో ఇతరులను ఎంతటివారినైనా సులువుగా తనవైపుకు తిప్పుకోగలిగిన దిట్టగా పేరున్న వెంకయ్యను భారత ఉపరాష్ట్రపతి పదవి వరించింది. ప్రత్యక్ష రాజకీయాలకు దూరం అవుతున్నామన్న భావన కొంత ఆయనకు వెలితిగా కనిపించినా పార్టీ ఏపదవిఇచ్చినా శిరసావహిస్తానన్న మాటకు కటుబడి మౌనంగా అంగీకరించారు. అనుకున్న స్థాయికంటే ఎక్కువ ఓట్లు వచ్చాయంటే ఆయన వ్యక్తిత్వానికి దక్కిన గౌరవమేనని పలువురువిశ్లేషించడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు. పార్లమెంటు ఉభయసభల సభ్యులు వేసిన ఓట్లతో జరిపిన కౌంటింగ్‌లో 272 ఓట్ల తేడాతో వెంకయ్య గెలుపొందారు.ఒక రాజ్యసభ సభ్యుడే రాజ్యసభ ఛైర్మన్ కావడం మరింత గర్వంగా ఉందని పార్టీవర్గాలు విశ్లేషిస్తున్నాయి. దేశవ్యాప్తంగా రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు బిజెపి పాలిత,ఎన్డీయే పాలితరాష్ట్రాల్లో సమర్థుడికి తగిన గౌరవం లభించిందన్న ప్రశంసలు మిన్నంటాయి. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వెంకయ్య గురించి ప్రత్యేకించి విశ్లేషించాల్సిన అవసరంలేదు. చిన్ననాటినుంచే ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధంఉన్న వెంకయ్య ఎబివిపిలోచురుకైన కార్యకర్తగా పనిచేశారు. జైఆంధ్ర ఉద్యమంలో కీలక పాత్రపోషించిన వెంకయ్య ఆనాటి అత్యవసర పరిస్థితిలోను తన నిరసనగళం విప్పారు. 1978లో ఉదయగిరి శాసనసభ నియోజకవర్గం నుండి ఎన్నికై రాజకీయరంగ ప్రవేశం చేసిన వెంకయ్య నాయుడు ఆనాటి నుంచి వెనుదిరిగి ఎరుగని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షునిగానూ, కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ, పట్టణాభివృద్ధిశాఖలు, సమాచార ప్రసారశాఖల మంత్రిగా పనిచేశారు. నెల్లూరు జిల్లాలో ఒక మారుమూల గ్రామంలో ఎలాంటి రాజకీయ నేపథ్యంలేని కుటుంబంలో జన్మించి, తన ప్రయాణాన్ని మొదలుపెట్టి ఎన్నో విజయాలను, మెట్లవెంట పదవులను ఉన్నతశిఖరాలను అధిరోహించారు. ఇతరులను తనదైన చమత్కారశైలిలో విమర్శిస్తూ బిజెపికి జాతీయస్థాయిలోప్రచార సారథ్యం కూడా వహించిన వ్యక్తిగా ఆయనకు పేరుంది. ఆయన ప్రసంగిస్తే చాలు పదాలు వెల్లువలా వస్తాయనే భావన అందరిలోను ఉంది. గుక్కతిప్పుకోని వాగ్ధాటితో ఎంతటివారినైనాసరే ఆకర్షించే వెంకయ్య రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకముద్ర వేసుకున్న వ్యక్తి. విద్యార్థిదశనుంచే క్రియాశీలక రాజకీయాల్లో ప్రవేశించి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒకసారి అధ్యక్షునిగా ఎన్నికైన రాజకీయ అరంగేట్రంచేసిన వెంకయ్య దేశ అత్యున్నతస్థాయి ఉపరాష్ట్రపతిపదవికి ఎన్నికయ్యారు. ప్రత్యేకించి రెండు తెలుగు రాష్ట్రాలతో వెంకయ్యకు వీడని అనుబంధం ఉంది. ప్రతికూల పరిస్థితులను సైతం ఆయనకు అనుకూలంగా మార్చుకునే రాజకీయవిజ్ఞత ఆయనకు వెన్నతోపెట్టిన విద్యగా వచ్చింది. రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరు పొందిన వెంకయ్య నాయుడు సమయస్ఫూర్తి, వాగ్ధాటి, లౌక్యం, మాటకారితనం కష్టపడిపనిచేసే తత్వం ఆయన్ను ఉపరాష్ట్రపతిపదవికి ఎంపిక చేసాయన్నదే రాజకీయ పరి శీలకుల విశ్లేషణ. జనతాపార్టీతరపున 1977లో తొలిసారి ఒంగోలునుంచి పోటీ చేసి పరాజయం చవిచూసిన ఆయన 1978లో రాష్ట్రమంతటా ఇందిరమ్మ ప్రభంజనంవీచిన సమ యంలో ఉదయగిరి నియోజకవర్గంనుంచి గెలుపొంది విజయతాకం ఎగువేసారు. ఆనాడు ఎన్టీఆర్ ప్రభంజనంలో ఇదే సత్తాచాటి ఉదయగిరి నుంచి రెండోసారి గెలుపొందారు. బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాల్లో వెంకయ్య చేసిన ప్రసంగానికి ఆనాడు అపూర్వ స్పందన లభించింది. వెంకయ్య జాతీయ రాజకీయ ప్రవేశానికి ఇదేబీజం వేసిందని చెప్పాలి. తన అభివృద్ధికి తానే సొంతంగా వ్యూహాలు మలచుకుంటూ అంచలంచలుగా ఎదిగిన వ్యక్తిగా వెంకయ్యను చెప్పవచ్చు. ఎంతో ఉన్నతస్థాయిలో ఉన్నా పర్యటనల సమయంలో ఎక్కువగా మిత్రులతో గడిపేందుకు ఇష్టపడే వ్యక్తికి దేశరాజకీయాలపై విశేష అవగాహనఉందని చెప్పవచ్చు. మరీముఖ్యంగా చెప్పాలంటే పల్లెనుంచి ఢిల్లీకి ఎదిగిననేతగా ఆయన్ను అభివర్ణించాల్సిందే. పుట్టిపెరిగిన గ్రామం,జిల్లాను మరువని అరుదైన నాయకుల్లో ఒకరిగా గుర్తింపుపొందారు వెంకయ్య. ఆయన జీవితపుస్తకంలో జ్ఞాపకాల దొంతరలుఎన్నో. ఎంత ఎదిగినా ఒదిగిఉండే స్వభావమే ఆయన్ను అత్యున్నతపదవికి ఎంపిక చేసిందని చెప్పవచ్చు.ఏ పార్టీ పాలనలోఉన్నా ఇటు రాష్ట్రంలోను అటు కేంద్రంలోసైతం తన ప్రసంగాల పట్టుతో అందరినీ ఇరుకునపెట్టే సామర్థ్యంసత్తా ఆయనలో ఉన్నాయని అంతర్జాతీయ మీడియా విశ్లేషకులు సైతం పేర్కొంటుంటారు. రాజకీయాలకు అతీతంగా నడిచే అత్యున్నత పదవి ఉపరాష్ట్రపతి. ఇద్దరు ఒకేపార్టీకి చెందిన వ్యక్తులు పదవిచేపట్టడం, అందులోనూ రాజనీతికోవిదులుగా పరిగణించే నేతలు ఇరువురు ఒకరు రాష్ట్రపతిగాను, మరొకరు ఉపరాష్ట్రపతిగాను ఎంపికకావడం దేశ రాజకీయాల్లో సరికొత్త శకానికి నాంది పలికినట్లయింది. ఆనాడు నీలంసంజీవరెడ్డి తర్వాత మరోసారి తెలుగుతేజం దేశ అత్యున్నత పదవిని అలంకరించింది వెంకయ్యనాయుడుతోనేనని నిస్సందేహంగా చెప్పగలం. అందుకు రాజకీయాల్లో వెంకయ్యప్రతిభా పాటవాలే ఆయనను అత్యున్నతమైనపదవికి నడిపించాయనడంలో సందేహంలేదు. దేశంలో రెండో అత్యున్నత పదవుల్లో రెండోదైన ఉపరాష్ట్రపతి పదవికి ఎంపికయ్యారు అంటే భావితరాలకే కాదు నేటితరాలకు కూడా ఆయన ఆదర్శప్రాయుడు. నిబద్ధత, అంకితభావం, నిజాయితీ, ఆత్మవిశ్వాసం కలిగినవారు ఏ స్థాయికైనా ఎదగగలరనేందుకు వెంకయ్యనాయుడు ప్రత్యక్ష ఉదాహరణ.

“మారుతున్న దేశ రాజకీయాలను అర్థం చేసుకునేందుకు ప్రస్తుత పనితీరును మార్చుకోవాలి.”



■ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ

“ప్రజలను గూండాలు, రౌడీలని అనొద్దు. రాహుల్ గాంధీ, ఆయన పార్టీ చేస్తున్న రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారు. ప్రజల మనోభావాలను గౌరవించాలి.”



■ బిజెపి అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా

ప్రజావాక్కు



ఆధార్‌కు ప్రత్యేక యాప్ అవసరం

ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డు లేనిదే ఏ పనీ జరిగే పరిస్థితి లేదు. అందువల్ల ఆధార్ కార్డును ఎల్లప్పుడూ జేబులో ఉంచుకుని తిరగాల్సి వస్తోంది. దీనిని నివారిస్తూ ఒక యాప్ వచ్చేసింది. స్మార్ట్‌ఫోన్ ఉన్నవాళ్లు ఎం-ఆధార్ ఆప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్ వివరాలు ప్రదర్శించవచ్చు. ఇప్పటికే రవాణాశాఖ వారి ఆప్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్, బండి రిజిస్ట్రేషన్, బండి బీమా తదితర సమాచారం మొబైల్‌ఫోన్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. వీటిని పోలీసులకు, రవాణా శాఖ అధికారులకు ప్రయాణాల్లో అడిగినప్పుడు చూపించి తమను తాము నిరూపించుకోవచ్చు. వీటి దారిలోనే పాన్‌కార్డు,ఎంప్లాయిస్ ఐడికార్డు,ఓటరు గుర్తింపు కార్డులు కూడా స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే యాప్‌లు తయారు కావాలి. ఇలాంటి కార్డులన్నీ వెంట ఉంచుకుని ఇబ్బందులు పడేకన్నా మన వెంట ఉండే స్మార్ట్‌ఫోన్‌లో అన్ని కార్డులనూ భద్రపరుచుకుని, అవసరమైనప్పుడు వాటిని ప్రదర్శించుకునే వెసులుబాటు ఉండాలి. ఇప్పటికే రైల్వే, ఆర్టీసీ టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేయించుకున్నవారికి పేపర్‌లెస్ టికెట్లను మన స్మార్ట్‌ఫోన్‌కి సందేశాల రూపంలో పంపిస్తున్నారు. ప్రయాణాలలో వాటిని మొబైల్ ఫోన్‌లో సిబ్బందికి చూపిస్తే సరిపోతుంది. కనుక కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల కార్డుల కోసం బ్యాంకు ఖాతాల కోసం ప్రత్యేక యాప్‌లను ఆవిష్కరించాలి.

● జి.అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

విజృంభిస్తున్న సైకోలు

పారిశ్రామికంగా, నాగరికంగా ఎంతో వేగంతో అభివృద్ధిచెందుతున్న విశాఖనగరంలో సైకోల విజృంభణ రోజురోజుకూ ఎక్కువ అవుతుండడంతో ప్రజలు ముఖ్యంగా యువతులు భయాందోళనలకు గురవుతున్నారు.తెలిసీ తెలియని వయస్సులో యువతీయువకుల అతి పరిచయాలు, వారి ప్రవర్తనను అదుపులో పెట్టాల్సిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల బాధ్యతారాహిత్యం, కాలేజీ యాజమాన్యం,పోలీసులు పట్టించుకోకపోవడం ఈ సమస్యకు ముఖ్యకారణాలు. వెంటబడిన అమ్మాయి ప్రేమించలేదనో లేక సినిమాల ప్రభావమో యువతను సైకోలుగా మారుస్తున్నాయి. ప్రేమోన్మాదుల దాడులు, వేధింపులను అరికట్టడమే కాకుండా రోడ్లపై మతిస్థిమితం సరిగ్గాలేని వారు చేసే దాడులను కూడా నిరోధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

● సి.ప్రతాప్, శ్రీకాకుళం

రోగనిర్ధారణ పరీక్షలు ఆపండి

మన రాష్ట్రంలో ప్రైవేట్ డాక్టర్లు చాలా అన్యాయంగా అనవసరంగా రోగనిర్ధారణ పరీక్షలు జరిపి రోగుల జేబులు కొడుతున్నారు. జ్వరం వచ్చిన వ్యక్తి డాక్టర్ దగ్గరు వెళ్లితే ఆ వ్యక్తికి రక్తపరీక్ష, మూత్ర పరీక్ష, మలేరియా పరీక్ష, టైఫాయిడ్ పరీక్ష, ఎయిడ్స్ పరీక్ష,ఎక్సరేలు ఇలా రోగినుంచి వందలు వేలు గుంజుతున్నారు.డాక్టర్లు ఈవిధంగా రోగులకష్టార్జితమైనధనాన్ని దాచుకొని రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలనుకోవడం ఘోరం. ప్రభుత్వం అటువంటి డాక్టర్లను కనిపెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి.

● గోపాలుని శ్రీరామమూర్తి, గుంటూరుజిల్లా

రామజన్మభూమి సమస్య రావణకాష్ఠం

దశాబ్దాలుగా రాజకీయలబ్ధి కోసం వికృత రాజకీయ క్రీడలు ఆడే రాజకీయ పార్టీల కారణంగా రామజన్మభూమి సమస్య రావణ కాష్ఠంలా రగులుతూనే ఉంది. ముఖ్యంగా ప్రతి ఎన్నికల ముందు ఈ సమస్యను లేవనెత్తడం, తర్వాత మరిచిపోవడం జరుగుతోంది. తాజాగా అయోధ్యలో రామజన్మభూమి నిర్మాణ కమిటి శిలాన్యాస్ కార్యక్రమం ప్రారంభించడం, వైరిపక్షాలు వ్యతిరేకించడం, శాంతి భద్రతల సమస్యలు తలెత్తి కర్ఫ్యూ విధించేవరకు పరిస్థితి క్షీణించడం చూస్తుంటే ఈ సమస్య కావాలని పరిష్కరించకుండా లైవ్‌గా ఉంచుతున్నారన్న అనుమానం కలుగుతోంది. నిజానికి రామమందిరం సమస్య అక్కడి ప్రజలదే తప్ప కోర్టులదికాదు. ఈ విషయంలో రాజకీయపార్టీలకు ఎటువంటి సంబంధంలేదు. మధ్యవర్తిత్వం ద్వారా ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అది ఆచరణ సాధ్యంకాదు.

● ఎం.కనకదుర్గ,తెనాలి, గుంటూరుజిల్లా

టీవీ సీరియల్స్ తెస్తున్న చేటు

ప్రతి ఇంట్లోనూ కలర్‌టి.వి, అందులో స్టార్ కనెక్షన్ తీసుకోవడం సర్వసాధారణమైపోయింది. టీ.వీల్లో ప్రైవేట్ ఛానల్స్ పుణ్యమా అంటూ ఇంట్లో పెద్దవాళ్లకు విసుగు విరామం లేకుండా రోజూ అయిదారుసినిమాలు రకరకాల సీరియల్స్ వంటలు, ఫ్యాషన్లు వాటితో పాటు రకరకాల ప్రకటనలను చూస్తున్నారు. పెద్దలతో పాటు పిల్లలకూ అదే అలవాటైపోతోంది. అందువల్ల పిల్లల చదువులు దెబ్బతింటున్నాయి. సోమరితనం పెరిగిపోతోంది. ప్రకటనలకు ఆకర్షితులై కొత్తగా వచ్చిన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఆరోగ్యాలు చెడగొట్టుకుంటున్నారు.

● వులాపు బాలకేశవులు, గిద్దలూరు,ప్రకాశంజిల్లా

ఆనాటి స్నేహమాధుర్యాలు ఏవి?

సృష్టిలో తీయనిది, అమృత తుల్యమైనది శాశ్వతమైనది స్నేహబంధం. కష్టాల్లో సుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటారు. అయితే ఆనాటి స్నేహపరిమళాలు ఈనాడు లేవు. ఆనాడు చిన్ననాటి నుండే రకరకాల బాల్యక్రీడలతో ఆనందిస్తూ సంఘీభావంతో, ఐక్యమత్యంతో ఉండేవారు. నేడు చిన్నవయసు నుండే మొబైల్ గేమ్స్, ఇంటర్నెట్, సోషల్ మీడియాకు బానిసలు అవుతూ తోటివారితో సంబంధం లేకుండా ఒంటరిగానే వినోదిస్తున్నారు. కృత్రిమమైన సోషల్ మీడియా స్నేహంతప్ప నిజమైన స్నేహబంధపు రుచులను చవిచూడటంలేదు.ఈపద్ధతిమారాలి.తిరిగి ఆనాటిరోజులు రావాలి.

● సరికొండ శ్రీనివాసరాజు, వనస్థలిపురం

వికలాంగులకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వికలాంగులకు ప్రతి వంద ఇళ్లల్లో తప్పక మూడు ఇళ్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వికలాంగులకు ఇవ్వాలి. సొంత ఇళ్లు కట్టుకోలేని వికలాంగులకు రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ద్వారా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలి. ఇళ్ల దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా చూడాలి.

● ఆర్. రవీందర్, జనగాం

ఎడిట్ పేజీకి... ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

పడకేసిన ప్రధాని పదిహేను సూత్రాల పథకం

జలీల్‌ఖాన్

విద్యావకాశాలను పెంపొందించడం, ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగాలలో మైనారిటీలకు సమాన వాటా కల్పించేందుకు కొత్త పథకాలు, ప్రస్తుత పథకాల ద్వారా కృషి చేయడం, స్వయంఉపాధికి అవసరమైన రుణ సదుపాయాలను మరింత పెంపొందించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలు పెంపొందించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకాలలో మైనారిటీలకు తగిన వాటా కల్పించడం ద్వారా వారి జీవన స్థితిగతులను మెరుగుపరచడం, మతసామరస్యం దెబ్బతినేందుకు దారితీసే సంఘటనలను నియంత్రించేందుకు, నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ప్రధాన మంత్రి 15 సూత్రాల కార్యక్రమ లక్ష్యాలు. 2005 ఫిబ్రవరి 25న పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ఈ ప్రకటన చేశారు. మైనారిటీల సంక్షేమం కోసం15సూత్రాల కార్యక్రమాన్ని సవరించి అమలు చేస్తామనిఆనాటి ప్రధాన మంత్రి 2005లో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పేర్కొన్నారు. సవరించిన 15 సూత్రాల కార్యక్రమంలో కచ్చితమైన లక్ష్యాలను నిర్దేశించామని,నిర్దిష్ట కాలపరిమితిలోగా వాటిని సాధించ వలసి ఉంటుందని కూడా అప్పటి ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. అలాగే సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని అందుబాటులో ఉంచడం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మైనారిటీలకు అనుబంధ పోషకాహారం, వ్యాధి నిరోధక సేవలు,ఆరోగ్యపరీక్షలు, అనియత విద్య, రెఫరల్ సేవలు, తదితర సదుపాయాలను అందించడం ఈ పథకం ఉద్దేశం. మైనారిటీ ప్రజలు నివసించే గ్రామాలు, మండలాల్లో ఐసిడిఎస్ సేవలను, కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. మైనారిటీ ప్రజల అవసరాలకు తగినట్టుగా ఆయా వర్గాల ప్రజలుండే గ్రామాలు, ప్రాంతాల్లోనే సర్వశిక్షా అభియాన్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పథకాల కింద, ఇతర ప్రభుత్వ పథకాల కింద పాఠశాలలు ఏర్పాటు చేస్తారు. జనాభాలో కనీసం నాలుగోవంతు ఉర్దూ భాష మాట్లాడేవారుంటే ఆ ప్రాంతంలోని ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయులను నియమించేందుకు కేంద్రం సహాయం అందిస్తుంది. మదర్సాలలో విద్యాబోధనను ఆధునీకరించేందుకు కేంద్రం మదర్సాల ఆధునీకరణ పథకాన్ని రూపొందించింది. విద్యాపరంగా వెనుకబడిన మైనారిటీ ప్రజలుఎక్కువగా నివసించే ప్రాంతాల్లో మౌలిక విద్యావసతులను కల్పించేందుకు, మదర్సాలలో విద్యాబోధనను ఆధునీకరించేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. పదో తరగతి వరకు ఆ తర్వాత విద్యాభ్యాసం చేసే మైనారిటీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (ఎంఎఐఎఫ్)ఆధ్వర్యంలో మౌలిక విద్యాసదుపాయాల విస్తృతికి, పటిష్టతకు అన్నివిధాలా ప్రభుత్వం సహాయం అందిస్తుంది. గ్రామీణ పేద కుటుంబాలకు సహాయం అందించే లక్ష్యంతో స్వర్ణజయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన రూపొందించారు. గ్రామీణ పేదకుటుంబాలకు ఆదాయ వనరులను కల్పించేందుకుగాను వారికి బ్యాంకు రుణం, ప్రభుత్వ సబ్సిడీ అందించడం ఈ పథకం ఉద్దేశం. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువన జీవించేమైనారిటీ లబ్ధిదారుల ప్రయోజనాల కోసం ఈ పథకం కింద కొన్ని లక్ష్యాలను నిర్దేశిస్తారు. మైనారిటీల్లో ఎక్కువ భాగం సాంకేతికంగాచాలా తక్కువస్థాయి పనులలో ఉపాధి పొందుతున్నారు. ఎక్కువగా చేతివృత్తుల మీదనేవారు జీవనం గడు పుతున్నారు. సాంకేతికపరమైన శిక్షణ ద్వారా వారి నైపుణ్యాన్ని పెంపొందించడమే గాక సంపాదన సామర్థ్యం పెంచవచ్చు. అందుకోసం కొత్తగా కొన్ని పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటిఐ) మైనారిటీల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో నెలకొల్పుతారు. ప్రస్తుతం ఉన్న ఐటిఐలలో కొన్నింటిని ప్రతిభా కేంద్రాలుగా రూపొందిస్తారు. జనాభా ప్రాతిపదికన ప్రతిభ కేంద్రాలుగా రూపొందించే ఐటిఐలను ఎంపిక చేస్తారు. మైనారిటీ ప్రజల ఆర్థికాభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఆర్థిక సహాయ సంస్థ 1994లో ఏరాంది. పూర్తిస్థాయిలో లక్ష్యాలను సాధించే విధంగా మరింత వాటా ధనాన్ని సమకూర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

అన్ని కేటగిరిలలో ప్రాధాన్యతా రంగాలకిచ్చే రుణాల్లో తగిన శాతాన్ని మైనారిటీలకు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అలాగే పోలీసు సిబ్బంది నియామకాల్లో మైనారిటీలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. కేంద్ర పోలీసు బలగాల నియామకాలు జరిపేటప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే విధమైన చర్యలు తీసుకుంటుంది. రైల్వేలు,జాతీయ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల నియామకాల్లో కూడా మైనారిటీ అభ్యర్థులను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకునేలా సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకుంటున్నాయి. మైనారిటీ అభ్యర్థులకు ప్రభుత్వ ప్రయివేటు సంస్థల్లో శిక్షణ ఇప్పించేందుకు ఒక ప్రత్యేక పథకం ప్రారంభం కాబోతోంది. మైనారిటీల ప్రస్తుత స్థితిగతులను మెరుగుపరచడం, గ్రామీణ గృహనిర్మాణ పథకంలో సమాన స్థాయి వాటా కల్పించేందుకు ఇందిరా ఆవాస్ యోజన పథకం ఆర్థిక సహాయం అందించాలి. మైనారిటీ ప్రజలు నివసించే మురికివాడల పరిస్థితులు మెరుగుపరచడం, పట్టణాల్లోని మురికివాడల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సహాయం అందించాలి. ఈ పథకాల ప్రయోజనాలు మైనారిటీలకు, వారి ప్రాబల్యం ఉన్న నగరాలకు, మురికివాడలకు సమాన స్థాయిలో అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. మత అల్లర్లు తలెత్తడానికి ఆస్కారమున్న ప్రాంతాలుగా గుర్తించిన చోట్ల నిష్పాక్షికతకు, లౌకికత్వానికి కట్టుబడి సమర్థతతో పనిచేసేలా జిల్లా అధికారులను,పోలీసు అధికారులను నియమించాలి. అలాంటి ప్రాంతాల్లోనూ ఇతరచోట్ల మతపరమైన ఉద్రిక్తతలుతలెత్తకుండా నిరోధించడం జిల్లా మెజిస్ట్రేట్ పోలీసు సూపరింటెండెంట్ల ప్రధాన కర్తవ్యం కావాలి. హింసాకాండలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై వెంటనే చట్టపర మైన చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక కోర్టును కేటాయిం చాలి. మత కల్లోలాల బాధితులకు వెంటనే తగిన సహాయం అందేలా చర్యలుతీసుకోవడం అవసరం.వారిపునరావాసానికి తగిన ఆర్థికసహాయాన్ని కూడా వెంటనే అందించాలి. ప్రధాన మంత్రి 15 సూత్రాల కార్యక్రమంలో ప్రస్తావించినతగినంత మైనారిటీజనాభాఏదైనా జిల్లాలోని ఒక యూనిట్ ప్రాంతం పరిధిలో 15 శాతం మంది ఉండటం అని అర్థం. 1992వ సంవత్సరంపు జాతీయ మైనారిటీల కమిషన్ చట్టంలోని 2(ఓ) సెక్షన్‌ను గుర్తించిన ప్రకారం ఈ కార్యక్రమాల లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఈ సెక్షన్ ప్రకారం ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జొరాస్ట్రియన్లు(పార్శీలు) తదితరులను మైనారిటీలుగా గుర్తిస్తారు. అలా గుర్తించిన టార్గెట్ గ్రూపులకే ప్రయోజనాలు అందేలా లక్ష్యాలు నిర్దేశిస్తారు. జాతీయ మైనారిటీ కమిషన్ చట్టంలోని 2(ఓ) సెక్షన్ ప్రకారం మైనారిటీగా గుర్తింపు పొందిన ప్రజలు మరో రాష్ట్రంలో మెజారిటీపరమైనప్పుడు వివిధ పథకాల ప్రయోజనాలు మైనారిటీలుగా నోటిఫై చేసిన ఇతర గ్రూపులకు మాత్రమే వర్తిస్తాయి.జమ్మూకాశ్మీర్, పంజాబ్, మేఘాలయ, సిక్కిం, మిజోరం, నాగాలాండ్ ఈ కేటగిరీ కిందకు వస్తాయి. అలాగే కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్ కూడా ఇదే కేటగిరి కిందకు వస్తుంది. మైనారిటీల బతుకులు మార్చేందుకు నిర్దేశించిన ప్రధాన మంత్రి 15 సూత్రాల పథకం జిల్లాల క్షేత్రస్థాయిలో పడకేసిందని ఒక సర్వే వెల్లడించింది. ప్రతి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా 15 సూత్రాల పథకం అమల య్యేందుకు తగిన ఆదేశాలు ఆయా జిల్లాల కలెక్టర్లకు జారీ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనాఉంది. ❐

(రచయిత: వాయిస్ ఆఫ్ మైనారిటీ సంపాదకులు)

చేనేతకు చేటు తెచ్చిన జిఎస్‌టి

మోహన్‌రావు

జూలై ఒకటి నుండి అమలులోనికి వచ్చిన వస్తు సేవల పన్ను (జి.యస్.టి) నుండి చేనేత రంగాన్ని మినహాయించడం ఎంతోఅవసరం. నిర్వీర్యమ వుతున్న చేనేతరంగాన్ని ఆదుకునేందుకు ఈ చర్య ఎంతో తోడ్పడుతుందని చెప్పవచ్చు.భారత్‌లో వ్యవసాయం తర్వాత చేనేత రంగంపైనే అధికులు ఆధార పడుతున్నారు. ఈ రంగం ద్వారా ప్రత్యక్షంగా నాలుగున్నర కోట్లు, పరోక్షంగా ఆరుకోట్ల మంది ఉపాధి పొందుతున్నట్లు భారత వాణిజ్య సమాఖ్య తన వార్షిక నివేదికలో తెలిపింది. జి.యస్.టి వలన వస్త్రదుకాణాలను మూసివేసే పరిస్థితి వస్తుందని మేధావులుహెచ్చరిస్తున్నారు. పెరిగిన రసాయనాలు, నూలు ధరలతో ఇప్పటికే కొనఊపిరితో ఉన్న చేనేతరంగం జి.యస్.టి పన్ను తో పూర్తిగా కనుమరుగు అవుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉత్పత్తులు పెంచేందుకు, కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరి చేందుకు తక్షణం వస్తు సేవల పన్ను నుండి మినహా యింపు ఇచ్చే విధంగా ప్రభుత్వం జి.వో విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

ప్రపంచీకరణ ఉధృతిలో నేడు కుదేలైపోతున్న తొలి రంగం ఏదంటే అదిచేనేత రంగమే. తాము నేసిన వస్త్రాలకు తగిన మార్కెట్, గిట్టుబాటు ధరలు లేక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఎంతోమంది ఈ వృత్తికి దూరమై వలస బాటపడుతున్నారు. మరి కొందరు విరక్తితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నేతన్నల ఆకలికేకలకు పాలకులు స్పందించి సరైన దిశలో ఆలోచించి తగిన సాయం అందించకుంటే ఈవృత్తి కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. అగ్గిపెట్టెలో ఉంచేలా చీరను నేసే నైపుణ్యా న్ని కలిగి ఉన్న నేతన్నలకు జానెడు పొట్ట నింపుకోవడమెలాగో తెలియని పరిస్థితి నెలకొన్నది. దేశస్థూల జాతీయోత్పత్తిలో రెండు శాతం వాటాను, ఎగుమతుల్లో 13 శాతం వాటాతో తనకంటూ ప్రత్యేకత కలిగి ఉన్న రంగం చేనేతనే. కేంద్రంలో కొలువుదీరిన నరేంద్రమోడీ సర్కారు గత ఏడాది ఆగస్టు 7ను జాతీయ చేనేత దినంగా ప్రకటించింది.ఆదిశగా కొన్ని పథకాలను విధి,విధానాలను చేపడుతున్నట్లు ప్రకటించింది.ఇందులో భాగంగానే మోడీ భారతీయ చేనేత బ్రాండ్‌ను ప్రారంభించారు. క్షేత్రస్థాయిలోని నేతకార్మికు లకు నాణ్యమైన ముడిసరుకు, ప్రాసెసింగ్, నేత,ఆకర్షణీయత ఉన్న డిజైన్లపై ప్రత్యేక శ్రద్ధను చూపించాలని, పర్యావరణహితంగా ఉంటూ ప్రమాణాలు పాటిస్తూ వస్త్ర ఉత్పత్తి చేయాలని నిర్ణయిం చారు. కొత్త డిజైన్లతో నాణ్యమైన ఉత్పత్తులు సాధించడం వల్ల వినియోగదారుల ఆదరణను చూరగొ నేలా చేయడం, చేతితో నేసిన వస్త్రం ఎలాంటి లోపాలు లేని ఉత్పత్తి తయారీని లక్షించారు. మరోవైపు పర్యావరణానికి హాని జరగకుండా రసాయనాలు, రంగులు వాడుతూ వస్త్ర తయారీ జరగాలని ఆశిస్తున్నారు. ఇవన్నీ చేనేతరంగంలో నాణ్యతా ప్రమాణాలకు ఒకవైపు చేసే ప్రయత్నా లు. మరోవైపు నేతకారులు ఉపాధి కరువై వలసబాట పడుతున్న వైనంపై సర్కారు సామాజిక బాధ్యతగా వారికి సాయం అందిం చాల్సి ఉందన్న విషయాన్ని విస్మరించడం విచారకరం.గ్రామాల్లో చిన్నచిన్న పట్టణాల్లో దుర్భర పేదరికం లో ఉన్న నేతకారులకు వివిధ ప్రభుత్వ పథకాల నుంచి గృహ వసతి వారి పిల్లల చదువు లకు తగిన సాయం అందించాల్సి ఉంది.నెలవారీగా కొంతమొత్తం ఫించనుగా ఇస్తే తప్ప నేతకారుల కుటుంబాలు బతికిబట్టకట్టే పరిస్థితి లేదు. దేశంలో 43,31,876 మంది చేనేత కార్మికులుంటే తెలంగాణాలో 1,16,174 మంది దీనిపై ఆధారపడ్డారు. ప్రస్తుతం తెలంగాణాలో 336 చేనేత సహకార సంఘాలున్నాయి. వీటిలో కేవలం 50 శాతం మంది మాత్రమే చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 3,55,838 మంది ఉన్నారు. జాతీయ వారసత్వ కళగా, పర్యావరణ హితమైన వస్త్రంగా ప్రసిద్ధిగాంచిన చేనేత నేడు దయనీయస్థితికి చేరింది. దేశంలో 23,77,331 చేనేత మగ్గాలు ఉంటే 21,46,432 పనిచేస్తుండగా 2,30,899 మూతపడ్డాయి. రోజురోజుకూ చేనేతకార్మికులు గిట్టుబాటు ధరలేక పొట్టచేతపట్టుకుని నగరాలు, పట్టణాల్లో చిన్నచిన్న ఉద్యోగాలు, కూలీ పనులకు సైతం వెళ్తున్నారు.విదేశాల్లో మన చేనేత వస్త్రానికి మంచి డిమాండ్ ఉంది.దీనికి ప్రభుత్వంనుంచి సరైన కార్యాచరణ లేకపోవడం చేనేత బతుకుల్ని వీధిన పడేస్తున్నది.



నేడు జాతీయ చేనేత దినోత్సవం

దేశంలో 43,31,876 మంది చేనేత కార్మికులుంటే తెలంగాణాలో 1,16,174 మంది దీనిపై ఆధారపడ్డారు. ప్రస్తుతం తెలంగాణాలో 336 చేనేత సహకార సంఘాలున్నాయి. వీటిలో కేవలం 50 శాతం మంది మాత్రమే చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 3,55,838 మంది ఉన్నారు. జాతీయ వారసత్వ కళగా, పర్యావరణ హితమైన వస్త్రంగా ప్రసిద్ధిగాంచిన చేనేత నేడు దయనీయస్థితికి చేరింది. దేశంలో 23,77,331 చేనేత మగ్గాలు ఉంటే 21,46,432 పనిచేస్తుండగా 2,30,899 మూతపడ్డాయి. రోజురోజుకూ చేనేతకార్మికులు గిట్టుబాటు ధరలేక పొట్టచేతపట్టుకుని నగరాలు, పట్టణాల్లో చిన్నచిన్న ఉద్యోగాలు, కూలీ పనులకు సైతం వెళ్తున్నారు.విదేశాల్లో మన చేనేత వస్త్రానికి మంచి డిమాండ్ ఉంది.దీనికి ప్రభుత్వంనుంచి సరైన కార్యాచరణ లేకపోవడం చేనేత బతుకుల్ని వీధిన పడేస్తున్నది.

2014-15లో 7203 మిలియన్ చదరపు మీటర్ల వస్త్రం ఉత్పత్తి అయింది. ఇక రూ.2246 కోట్ల వస్త్రాల ఎగుమతి జరిగింది. మనదేశంలో వ్యవసాయం తరువాత అత్యధికంగా 45 మిలియన్ల ప్రజలు చేనేత రంగంలో ఉపాధిని కలిగి ఉన్నారు. నేసిన పనికి తగిన ఆదాయం లేక1997నుంచి తెలంగాణలో చేనేత కార్మికులు ఇప్పటి వరకు 635 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. వీటిలో 604 కేసులపై పరిశీలన జరిపిన ప్రభుత్వం కేవలం 310 కేసుల్లో మాత్రమే ఎక్స్‌గ్రేషియా కింద రూ.4.49 కోట్లు చెల్లించింది. 272కేసుల్ని తిరస్కరించింది.మరో29కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. చేనేత రంగంపై ఏ ఒక్కకులమో ఆధారపడలేదు. దేశంలో 11.39 లక్షలమంది ఓబిసిలు ఈ వృత్తినిచేపట్టారు.ఇతర కులాలు,ముస్లింలు 7.56లక్షలు, ఎస్టీలు 6.15 లక్షల మంది చేనేతను వృత్తిగా స్వీకరించి పని చేస్తున్నారని వివిధ అధ్యయనాలు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పోచంపల్లి తేలియా రుమాల్ టై అండ్ డైకి, కరీంనగర్ జిల్లాలో బెడ్‌షీట్లు, సిద్ధిపేటలో గొల్లభామ చీరలు, వరంగల్‌లో కార్పెట్ల తయారీ ప్రసిద్ధిగాంచాయి. ఇకపోతే భౌగోళిక గుర్తింపు వచ్చినవాటిలో నారాయణపేట చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, పోచం పల్లి తేలియా రుమాల్ టై అండ్ డై ఇక్కత్ లున్నాయి.గద్వాల చీరల్లో కోటకొమ్మలు, మామిడి పిందెలు,లతలు,హంసలతోకూడినవి ప్రసిద్ధిచెందాయి.నేతకారుల్లో అద్భుత మైన కళాసంపన్నులు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం నేతబజార్లను ఏర్పాటుచేసింది.వీటిలో తెలంగాణలో ప్రస్తుతం కేవలం నాలుగే నేతబజార్లు ఉన్నాయి. ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లా సిరిసిల్లల్లో ఇవి ఏర్పాటయ్యాయి. ప్రతి జిల్లాలో మండల కేంద్రాల్లో కనీసం ఒకటి చొప్పున నేత బజార్లను ఏర్పాటు చేయడంద్వారా కార్మికులకుఉపాధి కల్పించడానికి వీలవుతుంది. అయితే వీటిలో పవర్‌లూమ్స్‌లో తయారైన వస్త్రాలు ఎక్కువగా విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా చేనేత కోసమే చేనేత బజార్లను నిర్వహించాల్సిన అవసరం ఉంది. చేనేత కార్మికులు నేసిన వస్త్రాలకు తగిన అమ్మకాలు సాగేలాచర్యలు తీసుకుంటేనే వీటికి సార్థకత లభిస్తుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. త్వరలో తెలంగాణలో ఆరుటెక్స్‌టైల్ పార్కులను ఏర్పాటు చేయనున్నామని ఔళిశాఖ మంత్రి ప్రకటించారు. సిరిసిల్ల (కరీంనగర్ జిల్లా) పాశమైలారం (మెదక్), మల్కాపూర్ (నల్గొండ) అప్పరెల్ ఎక్స్‌పోర్ట్‌పార్కు గుండ్లపోచంపల్లి (రంగారెడ్డి) మినీ టెక్స్‌టైల్‌పార్కు వరంగల్, హాండ్లూమ్‌పార్కు గద్వాల (మహబూబ్‌నగర్) ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటిలో చేనేత కార్మికుల ఉత్పత్తుల విక్రయమే లక్ష్యంగా ప్రారంభించాలి.

నేతన్నలకు ప్రభుత్వం అండగా ఉంటూ ఎప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించేలా అధికారయంత్రాంగాన్ని పురమాయించాల్సి ఉంది. అంతేకాకుండా చేనేత రంగాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాల్సిన రంగంగా గుర్తించాలి. నేతకార్మికులకు అవసరమైన సిల్కు, డైయార్న్ కొనుగోలుపై సబ్సిడీ ఇవ్వాలి. ఉపాధి భద్రతలో భాగంగా అన్ని రోజులూ పని కల్పించాలి. వీరికి వడ్డీలేని రుణాలు అందించడంతోపాటు ప్రభుత్వమే నేరుగా ఉత్పత్తులు కొనేలా చర్యలు తీసుకోవాలి. దారిద్ర్యంలో మగ్గుతున్న తమకు అంత్యోదయ కార్డులపై నెలకు 35కిలోల బియ్యం, ఆరోగ్య బీమా సదు పాయం కల్పించాలి. చేనేతకార్మికులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలి. తమిళనాడులో మాదిరిగా ప్రభుత్వ కార్యాలయాలకు చేనేత ఉత్పత్తులను సరఫరా చేయాలి. ప్రతి నేత కార్మికుని కుటుంబానికి డబుల్‌బెడ్‌రూం ఇల్లుఇస్తే శాశ్వత వసతికి భరోసాగా నిలుస్తుంది. ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేనేత వస్త్రాలను యూని ఫారాలుగా సరఫరాచేస్తే సింహభాగం మార్కెట్ ఏర్పడుతుంది. కార్మికుల పిల్లలకు ఒకటో తరగతి నుంచే ఉపకారవేతనాలు ఇస్తే విద్యాసుమాలు విరిసే అవకాశం ఉంది. ప్రభుత్వ సాయం లేనిదే మనుగడ సాగించలేని స్థితిలో ఉన్నది మన చేనేత రంగం. ❐



వార్తల్లోని వ్యక్తి

తెలుగు మహిళకు జాతీయ గౌరవం

డాక్టర్ తుర్లపాటి కుటుంబరావు
("పద్మశ్రీ" అవార్డు గ్రహీత)

దేశ రాజధాని ఢిల్లీలోని ఆకాశవాణి కేంద్రం అత్యంత కీలకమైనది, అక్కడి నుంచి వార్తలుకాని, వ్యాఖ్యలు కాని, ప్రసంగాలుకాని విదేశాలకు కూడా ప్రసారమౌతాయి. అది ప్రతిష్టాత్మకమైన ఆకాశవాణి కేంద్రం. ఆ కేంద్రానికి డైరెక్టర్ కావడమే గౌరవం, ఘనత. ఆ కేంద్రానికి ఇంతవరకు తెలుగు మహిళెవ్వరూ డైరెక్టర్‌కాలేదు. ఆ గౌరవం ఇప్పుడు తొలిసారిగా ఒక తెలుగు మహిళామణికి దక్కింది. ఆమె పేరు శైలజా సుమన్! అమె చాలాకాలం హైదరాబాద్ దూరదర్శన్ కేం ద్రానికి డైరెక్టర్‌గా వున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత విజయవాడలోని దూరదర్శన్ సప్తగరి కేంద్రానికి కొంత కాలం డైరెక్టర్‌గా పనిచేశారు. మల్లాది శైలజా సుమన్ ఆమె పుట్టినిల్లు గుంటూరు జిల్లా కాగా, మెట్టినిలు కృష్ణాజిల్లా.ఆమె తండ్రి జంధ్యాల రాధాకృష్ణ మచిలీపట్నంలోని జాతీయ కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అప్పటిలో ఆమె బాల్యం మచిలీపట్నంలో గడిచింది. మద్రాసు యూనివర్శిటీలో ఎమ్ఎస్సీ చదువు తుండగానే ప్రముఖ తెలుగు, సంస్కృతి భాషా పండితుడు, కొన్ని చలన చిత్రాలకు కూడా రచనలు చేసిన మల్లాది రామకృష్ణ శాస్త్రి కుమారుడు సుమన్‌ను ఆమెవివాహం చేసుకున్నారు. శైలజ విదుషీమణి. ఎమ్ఎస్సీ పరీక్ష రాసిన వారం రోజులకే పూనాలోని ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో ప్రోగ్రాం ఎక్జిక్యూటి వ్‌గా 1982లో ఉద్యోగం వచ్చింది. మాస్ కమ్యూనికేషన్ జర్నలి జాలలో పిజి డిప్లొమె కూడా చేశారు.

అవార్డుల పంట

ఇలాంటి విదుసీమణికి ఉద్యోగంలోనేమి, వృత్తిలోనేమి అవార్డులు, రివార్డుల పంట లభించడంలో ఆశ్చర్యమేమున్నది? అటు దూదర్శన్‌లోను, ఇటు ఆకాశవాణిలోను వివిధ హోదాలలో విభిన్న బాధ్యతలు నిర్వహించినప్పుడు మహిళామణి ఎన్నో విజయాలు సాధించారు. విద్య ఆవశ్యకతపై ఆమె రూపొందించిన డాక్యుమెంటరీకి 'స్వర్ణనంది' లభించింది. బతుకమ్మ బోనాల వంటి పండుగలపైన, రిపబ్లిక్ డే వంటి జాతీయ ఉత్సవాలపై ఆమె చేసిన కవరేజీలకు ప్రశంసలు లభించాయి. 'ముహూర్తబలం' పేరుతో ఆమె దూరదర్శన్‌లో ప్రసారం చేయించిన 153ఎపిసోడ్లకు ప్రేక్షకుల ప్రశంసలు లభించాయి. శైలజాను ఏడెనిమిది సార్లు నంది అవార్డులు వరించడంలో ఆశ్చర్యంలేదు. 'యూనిసెఫ్' అంతర్జాతీయ సంస్థ కూడా శైలజాను గుర్తించింది.

మనలో మాట

అందువల్లనే, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఆమెకు మరో ఘనత లభించింది. ప్రధాని నరేంద్రమోడీ నెలనెలా చేసే 'మన్ కీ బాత్' (మనలో మాట) ప్రసార కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యత లభించింది. ఇది జాతీయస్థాయిలో గొప్ప గుర్తింపు. దూరదర్శన్‌లో ఆమె పని చేసినప్పుడు ఆ సంస్థకు 'పట్టిందల్లా బంగారమే' ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం విజయవాడలో 'సప్తగిరి దూరదర్శన్'ను కేవలం పదిరోజులలో సమాయత్తం చేశారు. అంతేకాదు కేవలం ఆరునెలల వ్యవధిలో ఆ సంస్థకు రూ.75లక్షల ఆదాయం రావడా నికి ఆమె కృషేకారణం. గోదావరి పుష్కరాలలో రెండు రాష్ట్రాలలో కోటి 20లక్షల ఆదాయం ఆ సంస్థలకు చేకూరింది. హైదరాబాద్ దూదర్శన్‌లో పనిచేసినప్పుడు ప్రసార భారతికి ఏకంగా రూ.25కోట్లు ఆదాయం లభించింది. విజయవాడ దూదర్శన్ నుంచి ముంబాయి ఆకాశవాణిలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసి, ఇప్పుడు ఢిల్లీ ఆకాశవాణి డైరెక్టర్‌గా వెళ్లిన మల్లాది శైలజా సుమన్ 'ముదితల్ నేర్వగరాని విద్యకలదే ముద్దార నేర్పించినన్' అన్న చేమకూర వెంకట కవి వాక్కును మరోసారి, మరో రూపంలో వాస్తవం చేయలేదా? ❐

నేడు పోలవరం పనులను పర్యవేక్షించనున్న సిఎం

ఏలూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి: దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాకరంగా సాగుతున్న పోలవరం పనులు వరదలు వరదల కారణంగా ప్రస్తుతానికి నెమ్మదించినా నవంబర్ నెల నుండి వేగంగా సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రాజెక్టులో ప్రస్తుతం స్పిల్‌వే పనులు సాగుతున్నాయి. కాఫర్‌డామ్ పనులను నవంబర్ నుండి వేగవంతం చేస్తారు. సోమవారం రాష్ట్రముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు పనులను పరిశీలించి అధికారులతో సమీక్షించేందుకు వస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు ప్రాజెక్టు విషయమై అత్యంత శ్రద్ధ తీసుకుని ప్రతి అంశాన్ని ఆరాతీస్తున్నారు. 2018 కల్లా ప్రాజెక్టును పూర్తిచేయాలని ప్రభుత్వం తపనపడుతోంది. అయితే ప్రాజెక్టుయొక్క ఖర్చులు కూడా ప్రారంభం నుండి ఇప్పటికే చాలా మార్పులు చెందాయి. 2010–2011లో వేసిన అంచనా ప్రకారం రూ. 16,010 కోట్లు ఖర్చుకాగలవని అంచనా వేసారు. 2013–2014లో వేసిన అంచనాలో ఇది రూ. 60,431 కోట్లకు పెరిగింది. పోలవరం ప్రాజెక్టుకు జిఎస్‌టి నుండి మినహాయింపు లభించకపోవడం తో మరో రూ.,4,256 కోట్లు అదనంగా ఖర్చయ్యే అవకాశంవుంది. హెడ్‌వర్క్స్ పనులు ఎడమ కాలువ, కుడి కాలువ పనులకు పెరిగిన అంచనాల ప్రకారం రూ.48,231 కోట్లు ఖర్చుకాగలవని తాజాగా అంచనా వేసారు. అధి కారులు చెప్పిన ప్రకారం ఇప్పటికి ఈ ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్ల రూపాయలు ఖర్చయింది. ప్రస్తుతం స్పిల్‌వే కాంక్రీట్ వర్కుకు గేట్లు ఫ్యాబ్రికేషన్ పనులు మరకుగా సాగుతున్నాయి. ఇప్పటికి 40 శాతం పూర్తయినందున మిగతా 60 శాతం పనులకు ఏడాది కాలం సరిపోతుందనేది అనుమానమే. అయితే ప్రభుత్వం మాత్రం ఎంతో పట్టుదలగా కృతనిశ్చయంతో వుంది. ప్రాజెక్టు పనుల్లో అత్యధిక భాగం భూసేకరణకు నిర్వా సితుల పునరావాసానికి వెచ్చించాల్సివచ్చింది. ఇందుకోసం ప్రారంభంలో రూ.6 వేల కోట్లు సరిపోతాయని అనుకున్న సవరించిన అంచనాల మేరకు రూ. 32.529 కోట్ల రూపాయలు ఖర్చు కాగలవని భావిస్తున్నారు. ఇంత పెద్దఎత్తున నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుండి ఎప్పటి కప్పుడు తీసుకొని పోలవరం ప్రాజెక్టు ఓ సంవత్సరం ఆటా ఇటుగా పూర్తి కాగలదని ఇంజనీర్లు భావిస్తున్నారు.



పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత నిర్మాణదశ దృశ్యం

తెలుగుప్రజలకు మంచి జరగాలి

శ్రీవారిని దర్శించుకున్న సిఎస్ దినేశ్‌కుమార్



ఆదివారం తిరుమలేశుని ధ్వజస్థంభం వద్ద మొక్కుతున్న సిఎస్ దినేష్‌కుమార్

తిరుమల,ఆగస్టు 6 ప్రభాతవార్త: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆశీస్సులతో తెలుగురాష్ట్రాల ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఏపిప్రభుత్వ ప్రధానకార్యదర్శి దినేష్ కుమార్ ఆకాంక్షించారు. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం ఆదివారం ఉదయం ఆలయం వద్దకు విచ్చేసిన దినేశ్ కుమార్‌కు టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో సిఎస్ శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇవో అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుమల జెఇవో కెఎస్ శ్రీనివాస రాజు,ఆలయ డిప్యూటీ ఇఒ. కోదండరామారావు శేషవస్త్రంతో సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు. స్వామి దర్శనం తనకెంతో సంతోషాన్ని కలిగించిందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం తిరుపతికి చేరుకుని తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శిం చుకున్నారు. అమ్మవారి కుంకుమార్చనసేవలో పాల్గొన్నారు. తిరుపతి జెఇవో పోలాభాస్కర్, ఆలయ డిప్యూటీ ఇఒ మునిరత్నం రెడ్డి సిఎస్ దినేశ్‌కుమార్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆయేషా మీరా హత్య కేసుపై టిడిపిలో ముసలం చెలరేగుతోందా?

-సిట్‌కు గౌతం సవాంగ్ పర్యవేక్షణ వద్దన్న నన్నపనేని రాజకుమారి

రాష్ట్రంలోనే సంచలనం కలిగించిన ఆయేషామీరా హత్య కేసు పునర్విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసి ఈ సిట్‌కు పర్యవేక్షకుడిగా నగర పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రక్క ఆదేశాలు జారీ చేసింది. అదే ప్రభుత్వంలో మహిళా కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వ హిస్తున్న నన్నపనేని రాజకుమారి గౌతం సవాంగ్ పర్యవేక్షణ వద్దని, ఒక మహిళా అధికారిని పర్య వేక్షణాధికారిగా నియమించాలని, ఈ విషయమై సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళ నున్నట్లు బాహాటంగా మీడియా వద్ద పేర్కొనటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఆయేషా హత్య కేసు పునర్విచారణపై సిట్ దర్యాప్తుపై నీలినీడలు కమ్ముకునే అవకాశం కనబడుతోంది. ఆయేషా తల్లిదండ్రులు డిమాండ్ చేసినట్లుగా ఈ కేసును రాష్ట్రప్రభుత్వం సిబిఐకి అప్పగిస్తే ఎటువంటి విమర్శలు రావని పలు వ్యాఖ్యలు వినవస్తున్నాయి. మరి ఆయేషా కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంటుందో లేదోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

పునర్విచారణపై హర్షం మహిళా కమిషన్ అండగాఉంటుందని సత్యంబాబుకు భరోసా

ప్రభాత వార్త - విజయవాడ క్రైం

ఆయేషామీరా హత్యకేసు పునర్విచారణ చేసే సిట్‌కు నగర సిపి గౌతం సవాంగ్ పర్యవేక్షణ వద్దని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ ఈ విషయమై తాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, డిజిపి సాంబశివరావును కలిసి గౌతం సవాంగ్ స్థానంలో ఒక మహిళా అధికారిని పర్యవేక్షకురాలిగా నియమించాలని కోరతామన్నారు. ఆయేషా మీరా హత్యకేసు పునర్విచారణకు ప్రభుత్వం ఆదేశించడం తమకు ఊరట కలిగించిందని, అసలైన దోషులను పట్టుకోవడానికి మంచి అవకాశం లభించిందని అన్నారు. కానీ కోర్టు నిర్దోషిగా ప్రకటించి బయటకు వచ్చిన అనంతరం సత్యంబాబును విజయవాడ సిపి ప్రధాన నిందితుడని ఎలా అంటారని ఆమె ప్రశ్నించారు. సిపి గౌతంసవాంగ్ వ్యాఖ్యలపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. హత్య జరిగినప్పుడు గౌతం సవాంగ్ అక్కడలేరని, వాస్తవాలు తెలుసుకోకుండా ఆయన ఎలా మాట్లాడతారని ఆమె ప్రశ్నించారు. ఈ కేసువిషయంలో మొదటినుండి గౌతం సవాంగ్ మొదటినుండి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని, 2007 సంవత్సరం ఇబ్రహీంపట్నంలో ఒక హాస్టల్లో ఆయేషా మీరా హత్య కేసులో అసలైన నిందితులను వదిలేసి పిడతల సత్యంబాబును నిందితుడిగా పేర్కొంటూ పోలీసులు అరెస్టు చేశారని, ఒక అమాయకుడి జీవితాన్ని నాశనం చేశారని నన్నపనేని విమర్శించారు. ఆ రోజు ఈ కేసును విచారించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమ కుమార్తె హత్య కేసును సిబిఐతో విచారణ చేయించాలని ఈ నెల 8న ఆయేషా తల్లిదండ్రులు కోర్టుకు విన్నవించనున్నారని ఆమె తెలిపారు. ఆయేషా తల్లిదండ్రులు మానసిక క్షోభను అనుభవిస్తున్నారని, వారికి న్యాయం జరిగేవరకు కోర్టుకేసుల విషయంలో మహిళా కమీషన్ ద్వారా సహాయం చేస్తామని తెలిపారు. మహిళలు అనాలోచితంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇటీవల జరిగిన శిరీష, డాక్టర్ సూర్యకుమారిలు అర్ధాంతరంగా మంచి జీవితాలను ముగించుకున్న ఘటనలు బాధాకరమన్నారు. మహిళల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు, నిర్వహించేందుకు తమ కమిషన్ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు.

దోషులు తప్పించుకోలేరు: డిజిపి సాంబశివరావు

ఆయేషా మీరా హత్యకేసులో పునర్విచారణ చేస్తున్నట్లు డిజిపి నండూరి సాంబశివరావు తెలిపారు. ఈ కేసులో సత్యంబాబు నిర్దోషిగా విడుదల కావడంతో రాష్ట్రప్రభుత్వం తిరిగి విచారణ చేసేందుకు సిట్‌కు ఈకేసును అప్పగించిందని, పునర్విచారణలో కొత్తసాక్ష్యాలు సేకరించేందుకు కొంత సమయంపడుతుందని, ఈ కేసులో ఎవరు తప్పు చేసినా తప్పించుకోలేరని డిజిపి స్పష్టం చేశారు.

గృహ నిర్మాణంలో రాష్ట్రం అగ్రగామి

హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: గ్రామీణ పట్టణ పేద కుటుంబాలకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం, ప్రధానమంత్రి ఆవాస యోజన పట్టణ గృహ నిర్మాణ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. నివాస గృహవసతి లేని గ్రామీణ, పట్టణ, పేద, బడుగు, అల్పాదాయ వర్గాల కుటుంబాలవారికి శాశ్వత గృహాల నిర్మాణ సదుపాయాన్ని కల్పించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటివరకూ 4.20 లక్షల గృహాల నిర్మాణాన్ని చేపట్టి దేశంలో తొలి స్థానంలో ఉండగా, 3.34 లక్షల గృహాల నిర్మాణంతో తమిళనాడు, 2.86 లక్షల గృహాల నిర్మాణంతో మధ్యప్రదేశ్, 2 లక్షల గృహాలతో కర్నాటక, 1.54 లక్షల గృహాల నిర్మాణంతో గుజరాత్ తరువాత స్థానంలో నిలిచాయి. కాగా ఆంధ్రప్రదేశ్‌లో పేద వర్గాల వారికి ఇప్పటికి 4.20లక్షల గృహాల నిర్మాణాన్ని చేపట్టగా, మరో 2లక్షల గృహాలు కలిపి మొత్తం 6.20లక్షల గృహాల నిర్మాణానికిగాను కేంద్రనిధులను కోరుతూ ప్రతిపాదనలను సమర్పించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత రెండుసంవత్సరాల్లో రాష్ట్రంలో 119 లక్షల గృహాలను నిర్మించేందుకుగాను 902 కోట్లరూపాయలను కేంద్రప్రభుత్వం నుండి గ్రాంట్ రూపంలో పొందింది. ప్రధానమంత్రి ఆవాస యోజన పట్టణ గృహ నిర్మాణ పథకం కింద ఒక్కొక్క ఇంటికి 5.3లక్షల రూపాయలు, 6.7లక్షలు, 7లక్షల రూపాయల విలువతో మూడువిభాగాలుగా నిర్మించే ఈ గృహాలకు ఒక్కొక్క దానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీరూపంలో 15లక్షల రూపాయలను సమకూర్చుతుండగా, లబ్దిదారుడు 50 వేల రూపాయలను భరిస్తున్నారు.మిగిలిన మొత్తాన్ని6.5శాతం స్వల్పవడ్డీతో బ్యాంకు రుణాన్ని సమకూర్చుతోంది.

నేడు చంద్రగ్రహణంతో సాయంత్రం నుంచి శ్రీవారి ఆలయం మూసివేత



తిరుమల,ఆగస్టు 6 ప్రభాతవార్త: చంద్రగ్రహణం కారణంగా సోమవారం తిరుమల శ్రీవారి ఆలయం తలుపులు దాదాపు 10గంటలు మూతబడనున్నాయి. గ్రహణంతో నేటి సాయంత్రం 4.30గంటల నుంచి రేపు తెల్లవారుజామున 2గంటలవరకు దేవదేవుడు తిరుమల శ్రీవారి ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తున్నారు. సోమవారం రాత్రి10.52గంటల నుంచి అర్ధరాత్రి 12.50గంటలవరకు చంద్రగ్రహణం సంభవించనుండటంతో ఆలయసాంప్రదాయ ప్రకారం ఆరుగంటలముందే మూసివేస్తారు.తిరిగి ఆలయశుద్ధి, సంప్రో క్షణ, పుణ్యాహవచనం నిర్వహించిన అనంతరం తెల్లవారుజామున 2.30గంటలకు ఆలయ ద్వారాలను తిరిగి తెరవనున్నారు. మంగళవారం తెల్లవారుజామున 3గంటలనుంచి ఆలయంలో స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన, కొలువు, అష్టదళపాదపద్మారాధనసేవలు నిర్వహిస్తారు. అనం తరం ఉదయం 7గంటలకు భక్తులను స్వామివారి సర్వదర్శనానికి అనుమతినిస్తారు.

నేడు ఆర్జితసేవలు రద్దు: సోమవారం చంద్రగ్రహణం కారణంగా తిరుమలలో శ్రీవారి ఆలయం మూసివేస్తుండటంతో ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు విశేషపూజ,కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం,సహస్రదీపాలంకారసేవలను రద్దుచేశారు. తోమాల,అర్చన ఏకాంతంగా నిర్వహిస్తారు.అలాగే సోమవారం చంద్రగ్రహణం కారణంగా తిరుచానూరులోని శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయాన్ని అదేరోజు సాయంత్రం 4.30గంటలనుంచి మరుసటిరోజు 8వతేదీ తెల్లవారుజామున 4గంటలవరకు ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తున్నారు.

నేటి సాయంత్రం నుంచి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి భక్తులకు అనుమతి లేదు

12నుంచి 15వరకు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు: తిరుమల జెఇఒ కెఎస్ శ్రీనివాసరాజు



తిరుమల,ఆగస్టు 6 ప్రభాతవార్త: సోమవారం రాత్రి చంద్రగ్రహణం కారణంగా నేటి సాయంత్రం 4.30గంటలనుంచి శ్రీవారిఆలయాన్ని మూసివేస్తున్నారు. దీంతో దాదాపు10గంటలు స్వామివారి దర్శనం కూడా వుండదని తిరుమల జెఇవో కెఎస్ శ్రీనివాసరాజు తెలిపారు. గ్రహణంతో మధ్యాహ్నా ంనుంచి భక్తులను కూడా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోనికి అనుమతించబోమని ,అన్నప్రసాదభవనం కూడా మూసి వేస్తున్నట్లు చెప్పారు. కాలినడకన వచ్చే భక్తులకు దివ్యదర్శనం టోకెన్లుకూడా 6వేలుమాత్రమే జారీచేస్తారని తెలిపారు. ఆగస్టు 12వతేదీ నుంచి 15వతేదీ వరకు వరుసగా నాలుగురోజులు సెలవులు రావడంతో భక్తుల తాకిడి ఎక్కువగా వుంటుందన్న నేపథ్యంలో విఐపి బ్రేక్‌దర్శనాలను రద్దుచేసినట్లు జెఇవో ప్రకటించారు. ఈ రోజుల్లో కేవలం ప్రొటోకాల్ విఐపిలకు మాత్రమే బ్రేక్‌దర్శనం వుంటుందని తెలిపారు.ఎటువంటి సిఫార్సు లేఖలు కూడా స్వీకరించబోమని తెలిపారు.

పేదలలో మార్పుకోరకే ప్రభుత్వ పథకాలు

-చిత్తూరు జిల్లాలో ఇసుక, బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపండి -ఫారంపాండ్లకు ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లు, ఆయిల్ ఇంజన్లు: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్



ఆదివారం తిరుపతిలో సంక్షేమపథకాల అమలు తీరుపై అధికారులతో సమీక్షిస్తున్న దినేష్‌కుమార్

తిరుపతిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంత నిరుపేద ప్రజల జీవన విధానంలో మార్పుకోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యధర్శి దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సద్మావతి అతిథి గృహంలో జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై జిల్లా కలెక్టర్ పిఎస్. ప్రద్యుమ్న, జెసి.గిరిషా, ఇతర అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాల లక్ష్యసాధనలపై జిల్లా కలెక్టర్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా ప్రధాన కార్యధర్శికి వివరించారు. ఈ సమావేశంలో దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కలెక్టర్ ప్రద్యుమ్న నేతృత్వంలో ప్రభుత్వ పథకాలు, ఇతర కార్యక్రమాలు భేషుగ్గా జరుగుతున్నాయని కొనియాడారు.

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 2కోట్లు వేతన పని దినాలను లక్ష్యంగా నిర్ధేసించుకొని పని చేస్తున్నట్లు తెలిపారు. వంటకుంటలు, నీరు–ప్రగతి, చెక్ డ్యాంలు, సిసి రోడ్లు, వ్యక్తిగత మరుడుదొడ్లు, వర్మికంపోస్టు, అంగన్‌వాడీ, పంచాయితీ భవనాల నిర్మాణం, పండ్ల తోటలు తదితర ప్రజోపకరమైన పనులు ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా వేగవంతం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. సగటు ఉపాధి కూలీ రూ170 ఉండేలా చూడాలని, త్వరితగతిన కూలీ చెల్లించాలని తెలిపారు. హార్టికల్చర్, డ్వామా, డిఆర్‌డిఎ శాఖల ద్వారా అదనంగా 40 వేల ఎకరాలలో పండ్ల తోటలు పెంపకాన్ని, లక్ష ఫారంపండ్ల నిర్మాణం, వెయ్యి కిలోమీటర్లు సిసి రోడ్లు నిర్మాణం చేపట్టామని కలెక్టర్ వివరించారు. రైతులతో ప్రభుత్వ అది. కారులు మమేకమై చెక్ డ్యాం, ఫారంపండ్ల నిర్మాణంలో భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సిసి రోడ్లు, డ్రెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. సాలీడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం సక్రమంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. ఐఎవై పథకం కింద జిల్లాలో పెండింగ్‌లో వున్న ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత మరుగు దొడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని పంచాయితీలను ఓడిఎఫ్ పంచాయితీలుగా తీర్చిదిద్దాలన్నారు. భూగర్భ జలాలు పెంపుకు కొండ ప్రాంతాలలో చెక్ డ్యాంలు, మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. నీరు–ప్రగతి కింద కుంటలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 1365 పంచాయితీలకు గాను 149 పంచాయితీలకు అన్‌లైన్ సదుపాయం ఉందని తెలిపారు. పంచాయితీరాజ్, గృహ నిర్మాణం, నీటి పారుదల శాఖలు పనులలో జాప్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్మశానాలు, అం గన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయితీ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు.

రాష్ట్రంలో బెల్ట్‌షాపులు ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యమని, ఉచిత ఇసుకను ప్రజలకు తక్కువ ధరలకు రవాణా జరిగేలా చూడాలన్నారు. బెల్ట్ షాపులు, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు తిరుపతిలో జరపడం అదృష్టమని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తిరుపతి కీర్తిని ఇమడింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి–2చంద్రమౌళి, సబ్ కలెక్టర్ నిషాంత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుబాబుల్ రైతులకు బకాయిలు చెల్లించకుంటే ఆమరణ నిరాహారదీక్ష

వైఎస్సార్సీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సామినేని ఉదయభాను



ఆదివారం నం2గామలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

నందిగామ,ఆగస్టు5,ప్రభాతవార్త: కాగితపు మిల్లులు సుబాబుల్ రైతాంగానికి చెల్లించాల్సి న రూ.కోట్లాది బకాయిలకు నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత వ్వమే వహించాలని వైఎస్సార్సీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సామినేని ఉదయభాను డిమాండ్ చేసారు. 20 రోజుల్లో ప్రభుత్వం చొరవ తీసుకుని బకాయిలు చెల్లించకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తా మని, అవసరమయితే ఆమరణ నిరాహారదీక్షకు సిద్దమని హెచ్చరించారు.ఆదివారం మధ్యాహ్నం నందిగామలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉద్వేగంగా మాట్లాడుతూ కబుర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.సుబాబుల్ రైతుల సమస్యలపై ఎటువంటి స్పందనలేని స్దితిలో వ్యవహరిస్తున్నారన్నారు.గతంలో రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయంలో సుబాబుల్‌కు టన్నుకు రూ.4500 లవరకు ధరను అందచేసిందన్నారు.చంద్రబాబు ప్రభుత్వం ఎస్‌పిఎం కంపెనీ రైతులకు ఇవ్వాల్సి న బకాయిలను ఇప్పించటంలో ఏళ్ళ తరబడి జాప్యం చేస్తుందన్నారు.వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మధ్య వర్తిత్వంలో జరిగిన సుబాబుల్ కొనుగోళ్ళకు ప్రభుత్వం బాధ్యత వహించి తీరాల్సి ందేనన్నారు.కాగితపు మిల్లుల యాజమాన్యాలతో కుమ్మక్కయి సుబాబుల్‌కు జిల్లాకో ధరంటూ ప్రభుత్వం కొత్త జివో తెచ్చి రైతుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు.చంద్రబాబు వెయ్యి హామీలిచ్చి ఒక్క వాగ్దానాన్ని నేరవేర్చలేక చేతులు ఎత్తేసిందన్నారు.ప్రజల ఆక్రోశాన్ని నంద్యాల సభలో జగన్మోహనరెడ్డి వెల్లడిస్తే అధికారపార్టీ కుళ్ళు రాజకీయం చేస్తుందన్నారు.జగన్‌ను అధికారంలోకి వస్తే అమలులోకి తెస్తానన్న నవరత్నాలతో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు.జగన్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందునే సంక్షేమ పథకాలను అందరికి వర్తించేందుకు ప్రభుత్వం సిద్దపడిందన్నారు. జన్మభూమి కమిటీల రద్దు జగన్ ఆందోళనల తరువాత ప్రభుత్వం చేసిందన్నారు. కెడిసిసిబ్యాంకు సంచాలకులు కొమ్మినేని రవిశంకర్, వైఎస్సార్సీ జిల్లా కార్యదర్శి చిరు మామిళ్ళ చైతన్యకుమార్,మున్సిపల్ కౌన్సిలరు కత్రోజు శ్రీనివాసాచారి, బొగ్గవరపు రవీంద్ర, బొల్లినేని శ్రీనివాసరావు,పాములపాటి రమణ,షేక్ ఖాలిక్, ఎసఎం రబ్బాని, సూరె రాంబాబు, ఆవు లవిజయ్ తదితరలు సమావేశంలో పాల్గొన్నారు.

ఈఏడాది హెచ్‌ఎల్‌సి ఆయకట్టుకు నీరు లేనట్లేనా?

అనంతపురం, ఆగస్టు6 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్ర, కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయంలో ఈఏడాది నీరు అంతంత మాత్రంగానే వుంది. పైభాగంలో ఎక్కువ వర్షాలు పడకపోవడం, ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో తుంగభద్ర జలా శయంలోకి నీరు అంతంత మాత్రంగానే వస్తోంది. దీంతో హెచ్ ఎల్‌సి, ఎల్‌ఎల్‌సి ఆయకట్టు పరిస్థితి అగమ్యగోచరంగా తయారు అయ్యింది. వరినారు పోసుకున్న రైతులు నీళ్లు వస్తాయో రావో అని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వలు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో వుంచుకుని ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో హెచ్‌ఎల్‌సి ఆయకట్టుకు నీళ్లిచ్చే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. ఆరుతడి పంటలు వేసుకుంటే మేలని, వరినాట్లు వేసుకుంటే కష్టంగా వుంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలోని నీటి నిలువ అనంతపురం జిల్లాలో మంచినీటి పథకాలకే నీరు సరిపోయే అవకాశం కనిపి స్తోంది. జిల్లాలో శ్రీరామిరెడ్డి మంచినీటి పథకం, సత్యసాయి మం చినీటి పథకం తదితర వాటికి మాత్రమే దాదాపు 9 టిఎంసిల నీరుఅవసరం అవుతాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 41.312 టిఎంసిల నీరు నిలువ వుంది. ఇన్‌ఫ్లో 4545 క్యూసెక్కులు మాత్రమే వుంది. అవుట్ ఫ్లో 120 క్యూసెక్కుల నీరు వెళ్తోంది. తుంగభద్ర జలాశయానికి ప్రధానంగా తుంగ, భద్ర నదులు వున్నాయి. భద్ర నుండి నీరు ఏమి రావడం లేదు. తుంగభద్ర జలాశయంలో గత పదేళ్ల నీటి నిల్వలను పరిశీలిస్తే ఈసమయానికి దాదాపు 75 టిఎంసిల నీరు వుండేది. అయితే గత ఏడాది 40.156 టిఎంసిలు నీరు ఈసమయానికి వుంది. ప్రస్తుత ఏడాది కూడా అంతేవుంది. ఆగస్టు 15కు ముందు, ఆతరువాత భారీ వర్షాలు వస్తే తప్పా హెచ్‌ఎల్‌సి, ఎల్‌ఎల్‌సి ఆయకట్టుకు నీరు వదిలే అవకాశంలేదు. అయితే నీటి పారుదల నిపుణుల అంచనా ప్రకారం ప్రస్తుతం అనం తపురం జిల్లా వాటా 6 టిఎంసిలు వచ్చే అవకాశం వుందని, భారీ వర్షాలు వస్తే 12 టిఎంసిల నీటి కంటే ఎక్కువ వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. ఇదిలా వుండగా జిల్లాలోని బొమ్మనహాల్, కనేకల్లు, డిహీరేహాల్ తదితర మండలాల్లో నారుమడులు వేసుకున్న రైతులు నీటి కోసం వేచి చూస్తున్నారు. జిల్లాలో దాదాపు లక్షా 50వేల ఎకరాల ఆయకట్టువుంది. ఎంపి నార్త్ కెనాల్ క్రింద 13,174, ఎంపిసౌత్ కెనాల్ క్రింద 36650 ఎకరాలు, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ క్రింద 28150ఎకరాలు, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ క్రింద16వేల ఎకరాలు, గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్ క్రింద 16300 ఎకరాలు,హెచ్‌ఎల్‌సి మెయిన్ కెనాల్ క్రింద 35600 ఎకరాలు ఆయకట్టు వుంది. అదేవిధంగా కడప, కర్నూలు జిల్లాల్లో కూడా ఆయకట్టు ఉంది.

బ్రహ్మోత్సవాల్లో స్వయంగావస్తేనే దాతలకు గదులు

-26,27 తేదీల్లో దాతలకు గదులుండవు



తిరుమల,ఆగస్టు 6 ప్రభాతవార్త: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విశేషంగా భక్తులు విచ్చేసే అవకాశం వున్నందున భక్తులకు వసతిసౌకర్యం కోసం అవస్థలు కలగకుండా టిటిడి రిసెప్షన్ విభాగం కసరత్తు చేపట్టింది. టిటిడి ఇవో అనిల్‌కుమార్‌సింఘాల్,తిరుమల జెఇవో కెఎస్ శ్రీనివాసరాజు ఆదేశాలతో రిసెప్షన్ విభాగం డిప్యూటీ ఇవో పి.హరీంద్రనాథ్ రిసెప్షన్ విభాగం సిబ్బందిని అప్రమత్తంచేస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరిగే సెప్టెంబర్ 23నుంచి అక్టోబర్ 1వతేదీవరకు ఆయారోజుల్లో దాతలు స్వయంగా వస్తేనే గదులు కేటాయించేలా టిటిడి చర్యలు తీసుకుంటోంది. సెప్టెంబర్ 27వతేదీ గరుడసేవ సందర్భంగా 26,27తేదీల్లో కాటేజీదాతలకు ఎలాంటి గదులకేటాయింపు వుండదని టిటిడి ప్రకటించింది. ఈ విషయాన్ని కాటేజీ దాతలు గమనించాలని విజ్ఞప్తిచేసింది. ఒకేకాటేజీలో రెండుగదులకంటే ఎక్కువగా విరాళాలు ఇచ్చిన దాతలకు రెండుగదులను రెండురోజులపాటు కేటాయిస్తారు. ఒకేకాటేజీలో ఒకగదిని విరాళంగా ఇచ్చిన దాతలకు ఒకగదిని రెండురోజులపాటు కేటాయించడం జరుగుతుంది. గదులు కావలసిన కాటేజీ దాతలు 4రోజులు ముందుగా సిడిఎంఎస్. టిటిడిసేవఆన్‌లైన్.కామ్ వెబ్‌సైట్‌లో గదులను రిజర్వుచేసుకోవాల్సి వుంటుందని పేర్కొంది.

ఎస్ఆర్ఎస్పీ నీటి నిలువతో తెలంగాణ సస్యశ్యామలం



ఆదివారం జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపిలు కవిత. వినోద్ తదితరులు

- ❖ రాష్ట్రంలో సాగు, తాగు నీరుకు తొలగనున్న ఇబ్బందులు
- ❖ గత పాలకుల నిర్లక్ష్యంతో 30 ఏళ్ల నుండి మరమ్మతుకు నోచుకోని వైనం
- ❖ కెనాల్‌ద్వారా కొన్ని ప్రాంతాలకు నీరు వెళ్లడం లేదు
- ❖ చేవెళ్ల, కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టులోకి నీరు
- ❖ 10న పోచంపాడువద్ద శంకుస్థాపన: ఎంపి కవిత

ప్రభాతవార్త ప్రతినిధి / జగిత్యాల

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి నీరు నింపడంతో రాష్ట్రంలో సాగు, తాగునీరుకు ఇబ్బందులు తొలగడంతోపాటు తెలంగాణ సస్యశ్యామలం కాబోతుం దని నిజామాబాద్ ఎంపి కవిత పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలోని ఎంపి కవిత నివాసంలో ఆదివారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంప కవిత మాట్లాడుతూ శ్రీరాంసాగర్‌లోకి నీరు నింపడం ద్వారా 14 లక్షల పైన ఎకరాలకు నీరు అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నీరు, నిధులు, ఉద్యోగాలు స్వంతం చేసుకోవడానికే తెలంగాణ సాధించుకున్నామని ఆదిశలోనే తీవ్ర ప్రయత్నాలు చేయడం జరుగుతుం దన్నారు. ఎస్ఆర్ఎస్పి ప్రాజెక్టు నింపడానికై మహారాష్ట్ర సిఎంతో మన ముఖ్యమంత్రి పలుసార్లు మాట్లాడి ఒప్పందం చేసుకున్నాకే ప్రాజెక్టులోకి కొంతవరకు నీరు వచ్చి చేరుతుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో మహారాష్ట్ర ప్రాంతంలో ప్రాజెక్టులు కట్టడంతో మన ఎస్ఆర్ఎస్పికి నీరు రాలేదని దీనితో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్రంలో నీటి సమస్య తీర్చడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాణహితచేవెల్ల, కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల ద్వారా వరద కాలువల నుండి నీటిని తరలించి ఎస్ఆర్ఎస్పి నింపడానికి ప్రయత్నాలు చేస్తున్నామని ప్రాజెక్టుతో పాటు వరద కాలువ సంవత్సరకాలం నిండు కుండలా నీరుతో ఉంటుందన్నారు. జగిత్యాల జిల్లా రూపు రేఖలు మార్చడానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీలో ప్రధాన మంత్రిని, మంత్రులను కలిసి పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని, జగిత్యాలను అమృత్ సిటిగా మార్చాలని జగిత్యాల చుట్టు 3 రింగ్‌రోడ్లు ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని అధిక నిధులు విడుదల చేయాలని సంబందిత మంత్రులను కలిసి విన్నవించడం జరిగిందన్నారు. దీనితో ఆయా మంత్రులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అలాగే ఈనెల 10న బాల్కొండ నియోజకవర్గం లోని పోచంపాడ్‌వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ వేయి కోట్లతో శంఖుస్థాపన చేస్తున్నారన్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని ఈ సభకు జిల్లా లోని ప్రతి గ్రామం నుండి లక్షలాది మంది తరలి రావాలని పేర్కొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్పి ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకు ఎంతో ఆధారమని ఈ ప్రాజెక్టును ప్రత్యేక కార్యాచరణతో రైతులకు సంవత్సరం పొడువూత నీరందించ డానికి ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నామన్నారు. 1978లో జగిత్యాల, సిరిసిల్ల తాలుకలుగా ఉండే వని నక్సలైట్ ఉద్యమం తీవ్రంగా ఉండడంతో వీటిని కల్లోలిత ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించాం న్నారు. అదే సమయంలో ఎస్ఆర్ఎస్పీ కాలువలు తవ్వకాలు చేపట్టి నీటివసతి ఉండడంతో ఉద్యమం తగ్గడానికి కారణ అయిందన్నారు. 1964లో ఎస్ఆర్ఎస్పీ కాలు ప్రారంభించగా 1984తో పూర్తికాగా 20 సంవత్సరాల పాటు గత పాలకులు తవ్వారని ఎస్ఆర్ఎస్పీ నుండి మొదలుకొని సూర్యపేట వరకు తీసుకెల్లాలని కాని ఎక్కడ రిజర్వాయర్‌ను కట్టకపోవడం విద్దూరం అన్నారు. ఒక ఎల్ఎండిలో మాత్రమే నీటిని నింపడం జరుగుతుందన్నారు. ఎస్ఆర్ఎస్పీ కాలువలు తవ్వారు కాని 30 సంవత్సరాల నుండి ఒక్కసారి కూడా వాటి మరమ్మత్తులు చేయలేదని పెద్దపెల్లి, సారంగాపూర్, వరంగల్ తదితర ప్రాంతాలకు 5 నుండి 10 కిలోమీటర్ల వరకు నీరు రావడంలేదని పేర్కొన్నారు. రెండున్నర సంవత్సరాలు ప్రాణ హితచేవెల్ల, కాళేశ్వరం ఎత్తి పోతలద్వారా నీల్లు పంపిస్తున్నామని మొట్ట మొదటగా జగిత్యాల జిల్లా లబ్దిపొందుతుం దన్నారు. వరుద కాలువల ద్వారా ఎదురు ప్రాంతానికి నీరు తరలించి ఎస్ఆర్ఎస్పీ నింపి బంగారు తెలంగాణ సాధించడానికి సిఎం కెసిఆర్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ వరద కాలువ ద్వారా వెళ్తున్న నీరు గతంలో గ్రామాల ప్రజలు దొంగతనానా చెరువులు నింపుకునేవారని అలా కాకుండా ప్రభుత్వమే నేరుగా వరద కాలువ ద్వారా వెళ్లే నీరును గ్రామాల్లో ఉన్న చెరువులకు మల్లించి చెరువులను నింపే కార్యక్రమం చేస్తున్నామన్నారు. పోచంపాడ్ వద్ద నిర్వహించే బహిరంగ సభకు గ్రామంలోని ప్రతి ఇంటి నుండి ప్రజలు తరలివచ్చి సభను విజయ వంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్, ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, జెడ్‌పి చైర్మన్ తుల ఉమ, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే రమష్‌బాబు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, టిఆర్ఎస్ నియోజక వర్గ ఇంచార్జ్ డా. సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, ధర్మపురి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, దర్మపురి పిఎసిఎస్ చైర్మన్ బాదినేని రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం జగిత్యాలలో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపి కవిత, వినోద్

జయశంకర్ స్ఫూర్తే తెలంగాణ ఉద్యమం

- ♦ విద్యార్థి దశ నుండే తెలంగాణ ఏర్పడాలని ఆకాంక్ష
- ♦ ఉద్యమ నాయకుడు కెసిఆర్‌తోనే తెలంగాణ సాధ్యం: కరీంనగర్ ఎంపి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వినోద్‌కుమార్

ప్రభాతవార్త ప్రతినిధి / జగిత్యాల

తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి దాత జయశంకర్‌అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని కరీంనగర్ ఎంపి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాలలోని కరీంనగర్ రోడ్డులో గల ఐఎంఎ బిల్డింగ్ సమీపంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జయశంకర్ విగ్రహాన్ని ఆదివారం నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవితతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కరీంనగర్ ఎంపి వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రొ. జయశంకర్ 1952 సంవత్సరం విద్యార్థి దశ నుండే తెలంగాణ ఏర్పాటుకై ఉద్యమం చేసేవాడన్నారు. హన్మకొండలో తెలంగాణ ఏర్పాటుకై సమావేశం ఏర్పాటు చేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ అన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రాలో కలిపినప్పుడు దానికి వ్యతిరేకంగా ఉద్యమం చేసాడని, ఉపాధ్యాయ వృత్తి నుండి మొదలుకొని లెక్చరర్, ప్రొఫెసర్, వైస్ ఛాన్సలర్ వరకు మేధావిగా ఉండి అన్యాయాన్ని ఎండగట్టారన్నారు. 1996-97లో అనేక సమావేశాలు పెట్టి 30 మందితో బహిరంగ సభలు ఏర్పాటు చేసి 30 లక్షల మంది ఆక్రోశంతో సభలకు వచ్చేలా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎప్పటికప్పుడు పుస్తక రూపంలో రాసేవాడన్నారు. ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారడానికి తీవ్రంగా కృషిచేసాడని ఉద్యమ నాయకుడు దొరకాలని అనేకసార్లు అనేక సమావేశాల్లో పేర్కొన్నాడన్నారు. 2001లో టిఆర్ఎస్ పార్టీ రాకముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో విద్యుత్ విషయం వెతిరేకించడంతో ఆ విషయం పేపర్‌లో రావడం జయశంకర్ తెలంగాణకు ఉద్యమనాయకుడు దొరికాడని కెసిఆర్‌ను ఉద్యమ నాయకుడిగా ఉండి ప్రజా ఉద్యమాన్ని నడిపించాలని అనేక మార్లు పేర్కొన్నాడని అన్నారు. 2001లో టిఆర్ఎస్ పార్టీని స్థాపించి కెసిఆర్ జయశంకర్ కొన్ని వేల గంటలు తెలంగాణకు జరుగుతున్న అన్యాయం నీరు, నిధులు, ఉద్యోగాలే కాకుండా ఇంకా నేటికినా అన్యాయం జరుగుతుందంటూ అనేకంగా చర్చించి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగానే 32 రాజకీయ పార్టీలను తెలంగాణ రావడానికి ఒప్పించి ప్రజా ఉద్యమాలు నిరసన దీక్షలు సకలజనుల సమ్మెలతో తెలంగాణ సాధించుకున్నామన్నారు. జయశంకర్ ఆశయ సాధన కోసం ఎంపి కవిత తెలంగాణ జాగృతి ద్వారా దేశ తెలంగాణ యాస, భాష, సంస్కృతిని పెంపొందించడానికి కృషిచేయడం అభినందనీయం అన్నారు. అంతేకాకుండా తెలంగాణ సాంప్రదాయ పండుగ అయిన బతుకమ్మను ప్రపంచంలో అన్నివైపుల 24 గంటలు ఖండదేశం ఇంగ్లాండ్, అమెరికా, స్విట్జర్లాండ్ తదితర దేశాలలో ఆడేలా రూపకల్పన చేయడం అభినందనీయం అన్నారు. అంతే కాకుండా ఎంపి కవిత ఆధ్వర్యంలో జగిత్యాలలో పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఎంపి కవిత ఆధ్వర్యంలో ప్రొ. జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అన్నారు. ఎంపి కవిత మాట్లాడుతూ జయశంకర్ ఆశయ సాధన ప్రతి ఒక్కరు కృషిచేయాలని తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత అని అతని విగ్రహం ఏర్పాటుతోనైనా ప్రతి ఒక్కరు ఆయనను మరువకుండా ఉంటారన్నారు. నూతనంగా ఏర్పడ్డ జిల్లా జగిత్యాలలో జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేసామని రాష్ట్రం అన్ని జిల్లాలో ప్రొ. జయశంకర్ విగ్రహాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జయశంకర్ స్ఫూర్తితో రాష్ట్రం సాధించుకున్నామని అదే స్ఫూర్తితో బంగారు తెలంగాణ సాధించుకోవాలని ప్రతి ఒక్కరు కంకణ బద్ధులు కావాలన్నారు. తెలంగాణ జాగృతి బాధ్యతాయుతంగా పనిచేస్తూ రాష్ట్రంలో అభివృద్ధి కి జయశంకర్ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడానికి తీవ్రం కృషిచేస్తుందన్నారు. అనంతరం సిస్టర్ ఫర్ చేంజ్ కార్యక్రమంలో భాగంగా రాఖీ కట్టి హెల్మెట్ పంపిణీచేసారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్, ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, జెడ్‌పి చైర్మన్ తుల ఉమ, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే రమేష్‌బాబు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, టిఆర్ఎస్ నియోజక వర్గ ఇంచార్జ్ డా. సంజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, ధర్మపురి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, దర్మపురి పిఏసిఎస్ చైర్మన్ బాదినేని రాజేందర్, జాగృతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి

హైదరాబాద్,ఆగస్టు6: రాష్ట్రవ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడకలు ఆదివారంనాడు ఘనంగా జరిగాయి. స్వరాష్ట్ర సాధన ఉద్యమం కోసం తన జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సర్‌ను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సర్ జయంతి సందర్బంగా ముఖ్యమంత్రి ఆయనను గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన నాటి నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం రగిలే వరకు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించుకుంటూ వచ్చి,భావజాల వ్యాప్తికి జీవితాన్ని ధారపోశారని సిఎం కొనియాడారు. జయశంకర్ సర్ తెలంగాణ సమాజానికి ఎన్నటికీ స్ఫూర్తి ప్రధాతగానే నిలుస్తా రన్నారు. తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడకలు ఘనంగా జరిగాయి. హోమ్ మంత్రి నాయిని నర్సింహారెడ్డి జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, బీబీ పాటిల్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో సిఎం కెసిఆర్ నాయక త్వంలో బంగారు తెలంగాణ కోసం కృషి చేస్తున్నామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. జయశంకర్ జీవితమంతా తెలంగాణ కోసమే అంకితం చేశారని చెప్పారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన జయశంకర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన జీవితం మొత్తం తెలంగాణ సాధన కోసం అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. మూడు తరాల ఉద్యమంలో పాల్గొని అందరికీ మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. హన్మకొండ ఏకశిలా పార్క్‌లో జరిగిన జయశంకర్ జయంతి వేడుకల్లో ఈటెల పాల్గొన్నారు. ఎంపీలు సీతారాం నాయక్, దయాకర్, మేయర్ నరేందర్, పలువురు ఎమ్మెల్యేలు,అధికారులు నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రి జోగురామన్న జయశంకర్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నిర్మల్‌లో జరిగిన జయశంకర్ జయంతి వేడుకల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయశంకర్ విగ్రహాన్ని ఎంపీలు కవిత, వినోద్‌కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. కరీంనగర్‌లోనూ ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు జరిగాయి. నిజామాబాద్, సంగారెడ్డి, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నల్లగొండ తదితర ప్రాంతాల్లో జయశంకర్ జయంతి వేడుకల్లో ఘనంగా జరిగాయి. పలు చోట్ల పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

తెలంగాణకోసం జీవితం త్యాగం చేసిన మహనీయుడు ప్రొ.జయశంకర్: మంత్రి జూపల్లి



ఆదివారం ప్రొ. జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులు ఆర్పిస్తున్న మంత్రి జూపల్లి తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: తెలంగాణ ఏర్పాటు కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్‌సార్ అని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. ఓల్డ్ ఎంఎల్ఏ క్వాటర్ట్స్‌లో జయశంకర్‌సార్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ఏర్పాటు, అభివృదేధ ధ్యేయంగా నిరంతరం శ్రమించిన జయశంకర్‌సార్‌ను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరిచిపోదన్నారు. తెలంగాణ సాధన కెసిఆర్ వల్లే సాధ్యమని నమ్మి, చివరి శ్వాస వరకు కెసిఆర్‌ను ముందుండి నడిపిని ఆయన చరిత్రలో నిలిచిపోతారన్నారు. సమైక్య పాలనలో తెలంగాణాకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటిన మహనీయుడు జయశంకర్‌సారని, ఆయన ఆశయాల సాధన కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

జయశంకర్ పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సిద్ధించింది

మండలి చైర్మన్ స్వామిగౌడ్

హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కోసం అహర్నిషలు కష్టపడిన మొదటి వ్యక్తి ప్రొ.జయశంకర్ అని తెలంగాణ శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సిద్ధించిందని పేర్కొన్నారు. ఆదివారం ప్రొ.జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి జీవితకాలం పోరాడిన ధీరోదాత్తుడని కొనియడారు. మన నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజలకే చెందాలనీ, ఆయన ఆకాంక్షించారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటికీ ఆయన చూడలేక పోవడం బాధాకరమన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చే విధంగా కృషి చేసినప్పుడే ఆయన ఆత్మకు శాంతి చేకూర్చినట్లవుతుందని స్వామిగౌడ్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఏకపక్ష కుటుంబ పాలన: తమ్మినేని



హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఏకపక్ష కుటుంబ పాలన సాగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని పక్కనపెట్టి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సమీక్షలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహక కేంద్రమైన సచివాలయానికి రావడాన్ని సీఎం కేసీఆర్ పూర్తిగా మానేశారని తెలిపారు. శాసనసభ్యులను కలవడానికే సమయాన్ని కేటాయించని సీఎం ప్రజలను కలిసేందుకు సవయ ం ఎక్కడిదని ఎద్దేవా చేశారు. సీఎం అపాయింట్‌మెంట్ దొరకకపోవడంలో బాధిత ప్రగతి భవన్ ముందు ఆత్మహత్య యత్నానికి పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోవడానికి సీఎం నిరంకుశ పోకడలకు నిదర్శమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడాన్ని కూడా ప్రభుత్వం సహించే పరిస్థితి లేదన్నారు. దీంతో తెలంగాణలో సైనిక పాలనను తలపిస్తుందని మండిపడ్డారు. ప్ర జాస్వామ్యంలో ప్రభుత్వాలకు ఇటువంటి దోరణి మంచిది కాదని సూచిం చారు. తెలంగాణ సమాజానికి అసలుకే మంచిది కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలె తమ్మినేని మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలన దొరతనానికి చిహ్నంగా మా రిందన్నారు. ఇటీవల జరిగిన పలు రకాల ఘటలనే ఇందుకు నిదర్శ మన్నారు. నిజాంకు గోరికట్టిన చరిత్ర తెలంగాణకుందన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ తన వైఖరిని మార్చుకోకపోతే నిజాంకు పట్టిన గతే పడుతుందని హె చ్చరించారు. భూ సేకరణ విషయంలో రైతుల తో పాటు విపక్షాలను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. రైతులకు అన్యాయం చేసేలా ఉత్తర్వులను సవరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రధానమోడీ ఎదురుచే ప్పే సాహసం సీఎంకు లేదన్నారు. మోడీని విమర్శించే దమ్ము ధైర్యం లేకనే గుడ్డిగా జీఎస్టీకి మద్దతు పలికారని ఆరోపించారు. జీఎస్టీ వల్ల 19 కోట్ల నష్టమని మాట్లాడడం ఆయన చేతగానితనానికి నిదర్శమన్నారు. కోర్టులు కొట్టి వేసే విధంగా ఉద్యోగ ప్రకనటలుంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో భారీగా సాగుతున్న భూ కుంభకోణాలను దారిమళ్లించడానికి డ్రగ్స్ కేసును తెరపైకి తెచ్చారని ఆరోపించారు. నయీం కేసులోనూ ఇదే అర్భాటం చేశారని చెప్పారు. కానీ చివరకు చేసిందేమి లేదని ఈ కుంభకోణాల ద్వారా సీఎం కేసీఆర్ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేశారని ఆరోపించారు. ఇక ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పథకాలతో పాటు గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోతుకూచి సాంబశివరావు ఇకలేరు



పోతుకూచి సాంబశివరావు (ఫైల్)


హైదరాబాద్ (కవాడిగూడ), అగస్టు 6, ప్రభాతవార్త: ప్రముఖ రచయిత పోతుకూచి సాంబశివరావు(92) ఆదివారం ఉదయం 11గంటలకు కవాడిగూడలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు గ్రామంలో సూరమ్మ, నరసింహమూర్తి దంపతులకు 1925లో పోతుకూచి సాంబశివరావు జన్మించారు. బిఎ, ఎల్ఎల్‌బి చదువుకున్న ఆయన 1950లో హైదరాబాద్ నగరానికి వచ్చారు. కొద్దిరోజులు బోయిగూడలో అద్దెఇంట్లో ఉన్న ఆయన తర్వాత కవాడిగూడలో సొంత ఇంటిని నిర్మించుకున్నారు. న్యాయవాదిగా కొంతకాలం పనిచేశారు. హైదరాబాద్‌రాష్ట్రంలో కార్మికమంత్రి వద్ద స్టెనోగా పనిచేసి, అనంతరం ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహిం చారు. సాహితీ అభిమాని అయిన ఆయన రచనలు చేయడం కూడా ప్రారంభిం చారు. శష్టిపూర్తి, చలమయ్య, ఏడురోజుల మజిలి, అన్వేషణ, ఉదయ కిరణాలు, జీవనాదం తదితర రచనలు చేశారు. మూడువందలకు పైగా కథలు ఆయన రాశారు వాటిలో చాలా వరకు రష్యన్, జర్మన్, ఇంగ్లీష్, తమిళ, కన్నడ భాషల్లోకి అనువదించబడ్డాయి. ఇదీ తంతు, ఏడు సున్నాలు, దొంగదొర అనే నాటకాలు ఆకాశవాణికోసం రచించారు. అదే విధంగా దామోదరం సంజీవయ్య చరిత్ర, షిర్డీసాయిబాబా చరిత్రలు రాశారు. విశ్వసాహితి, అఖిల భాష సాహిత్య పరిషత్‌లను స్థాపించిన ఆయన సాంస్కృతిక రంగానికి విశేషసేవలు అందించారు. అఖిల భారత తెలుగు రచయతల మహాసభలు, ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడంలో ఆయన కీలక భూమికను పోషించారు. పోతుకూచి ఇకలేరన్న వార్త తెలుసుకున్న పలువురు సాహితీ ప్రముఖులు కవాడిగూడలోని ఆయన నివాసానికి వచ్చి నివాళులర్పించారు. సోమవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్‌లోని హిందూ శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరుగుతాయి.

ఎత్తిపోతలు - అటవీ భూములు

- అనుమతుల కోసం అటవీశాఖ కసరత్తులు
- 20న ఢిల్లీలో అటవీశాఖ సలహాకమిటీ సమావేశం

హైదరాబాద్ ఆగస్టు 6, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త ఎత్తిపోతల పథకాల నిర్మాణాల కోసం అటవీభూముల అవసరం ఉంది. ఈ పథకాలకు సంబంధించి పంప్‌హౌజ్‌లతో పాటు కాలువల నిర్మాణాలను అటవీభూముల్లో చేపట్టాల్సి ఉంది. వీటికి అటవీ అనుమతులు వస్తే కాని పనులు ముందుకు సాగవు. దీంతో రాష్ట్ర అటవీశాఖ ఈ పనుల కోసం సంబంధిత అటవీఅనుమతులు సాధించేందుకు కసరత్తులు మొదలుపెట్టింది. ఇప్పటికే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మొదటిదశ పనులు మొదలయ్యాయి. ఈ పనులకు ఆదిలోనే అటవీ అనుమతుల వ్యవహారం బెడిసి కొట్టింది. అటవీ అనుమతులు లేకుండానే పనులు చేపడుతున్నారని పిటిషన్లు గ్రీన్ ట్రిబ్యునల్‌తో పాటు సుప్రీంలోనూ పడ్డాయి. ఈ పథకం కింద 509 ఎకరాల అటవీభూమి పోతోంది. ఈ భూమికి సరిపడా అంటే ప్రత్యామ్నాయంగా అంతే భూమిని మరో చోట ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్‌కు చెందిన బృందం ఇటీవలే వచ్చి సదరు భూమిని పరిశీలించి వెల్లింది. ఎత్తిపోతల మొదటి దశ పనుల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో భూగర్భసొరంగం, అంజనిగిరి ప్రాజెక్టు పరిధిలో 204హెక్టార్లు, లింగాల మండలంలో అంజనగిరి - వీరాంజనేయ ప్రాజెక్టుల మధ్య సొరంగమార్గం తదితర పనుల్లో కొంత మేర అటవీభూమి పోతోంది. ఈ అటవీభూములకు అనుమతులు లేక పనులు నిలిచిపోయాయి. వీటి అనుమతి కోసం ప్రత్యామ్నాయంగా బల్మూర్, అచ్చంపేట, ఉప్పునుంతల మండలాల్లోని భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వం చూపింది. వీటికి అనుమతి ఇంకా లభించలేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన మరో ప్రధాన ఎత్తిపోతల కల్వకుర్తిలోనూ 150హెక్టార్ల అటవీభూమిలో పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి అటవీ అనుమతులు ఇంకా రాలేదు. మొదటి దశలో రేగుమానుగడ్డ ఎత్తిపోతల కింద మాత్రం 27హెక్టార్ల అటవీభూమికి అనుమతులు వచ్చాయి. రెండోదశ పనుల్లోని జొన్నలబొగడ ఎత్తిపోతలలో 114హెక్టార్లు, మూడో దశ పనుల్లోని గుడిపల్లిగట్టు పరిధిలో 8హెక్టార్ల అటవీ భూమి అవసరం. వీటికి ఇప్పటికి అనుమతులు లభించలేదు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మాత్రం గతనెలలో ఊరట లభించింది. ఈ ఎత్తిపోతలకు అవసరమైన 3168హెక్టార్ల అటవీభూమిలో పనులకు అటవీశాఖ సలహా కమిటి గత నెలలోనే ఢిల్లీలో సమావేశమయినప్పుడు అంగీకరించింది. అయితే కాళేశ్వరంలోని కొన్ని పనులకు పర్యావరణశాఖ కొన్ని అభ్యంతరాలను లేవనెత్తగా వీటిపై కూడా సానుకూలంగానే స్పందించింది. దీంతో కాళేశ్వరానికి కాస్త ఊరట లభించింది. మిగిలిన అటవీ భూముల అనుమతులపై ఈ నెల 20న ఢిల్లీలో అటవీశాఖ సలహా కమిటీ సమావేశం నిర్వహిస్తోంది. ఈ సమావేశంలో రాష్ట్రంలో ప్రాజెక్టులకు అవసరమైన అటవీభూముల గూర్చే ప్రధానంగా చర్చించనున్నారు. ఈమేరకు ఇప్పటికే రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులు, ఆయా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లు సమావేశమై ఇప్పటి వరకు అనుమతులు ఇచ్చిన తీరు, అభ్యంతరాలపై చర్చించారు. వీటి ప్రకారం అటవీశాఖ సలహా కమిటీ సమావేశంలో అభ్యంతరాలు అటవీ అనుమతులపై అభ్యంతరాలు తెలుపకుండా ఉండేలా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వ్యభిచార గృహం గుట్టురట్టు, దళారి అరెస్టు



పట్టుబడ్డ వ్యవభిచార గృహం నిర్వాహకుడు

హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని గాంధీనగర్‌లో ఓ వ్యభిచార ముఠా గుట్టు రట్టయింది. ఈ సందర్భంగా దళారిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక మహిళను రక్షించారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ లింబారెడ్డి దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. గుంటూరు జిల్లా బ్రాడిపేటకు చెందిన తనుగుంట్ల మల్లిఖార్జున్‌రావు (50) కొంతకాలంగా హైదరాబాద్‌లోని గాంధీనగర్ కేంద్రంగా వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నాడు. కోల్‌కతా, ముంబాయి తదితర నగరాల నుంచి సెక్స్ వర్కర్లను రప్పించి వ్యభిచార గృహాన్ని ఇతను నిర్వహిస్తున్నాడు. తనకు తెలిసిన వ్యక్తులను రప్పించి తన వద్ద వున్న సెక్స్ వర్కర్ల చేత వ్యభిచారాన్ని నిర్వహించసాగాడు. ఇందుకుగానూ ఒక్కో వ్యక్తి నుంచి వెయ్యి నుంచి 1500 రూపాయలు వసూలు చేసే ఇతను ఇందులో కొంత సెక్స్ వర్కర్లకు ఇచ్చేవాడు. కాగా దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి దాడిచేశారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ మహిళ అక్కడ వుండగా ఆమెను పోలీసులు రక్షించి రెస్క్యూ హోంకు తరలించారు. పట్టుబడ్డ మల్లిఖార్జున్‌రావును తదుపరి విచారణ నిమిత్తం గాంధీనగర్ పోలీసులకు అప్పగించారు.

పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టేంతవరకు ఉద్యమం ఆగదు

జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 6, ప్రభాతవార్త: పార్లమెంట్‌లో బిసి బిల్లును ప్రవేశపెట్టి చట్ట సభలలో (అసెంబ్లీ-పార్లమెంట్)బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది బిసిలు ఆదివారం పార్లమెంట్ ఎదుట భారీ ప్రదర్శన నిర్వహించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది బిసిలు ఈ ప్రదర్శనలో పాల్గొని నినాదాలతో హోరెత్తించారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్‌లు కల్పించాలని, చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 12 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, 1470 ఐఎఎస్, 1059 ఐపిఎస్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, రిజర్వేషన్‌లు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిసి బిల్లును ప్రవేశపెట్టి అసెంబ్లీ-పార్లమెంట్‌లో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ భారీ ప్రదర్శనలో సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రా ష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వరప్రసాద్‌యాదవ్, నాయకులు గుజ్జ కృష్ణమాదిగ, ఆర్.సత్యనారాయణ, కోలా జనార్ధన్, గోరిగే మల్లేష్‌యాదవ్, గుజ్జ రమేష్, కర్రి వేణుమాధవ్, శారదగౌడ్, కృష్ణుడు, సాధం వెంకట్, నీల వెంకటేశ్, బర్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ జాతి గౌరవానికి రక్షా బంధనాలు



పరమాత్ముని ప్రేమయే ఆత్మకు రక్షణ
పవిత్ర వరదానమే సత్య రాఖీ
శ్రేష్ఠాచారమునకు ఆధారము రాఖీ.

భారతదేశము పండుగల దేశము. ఇందులో అనేక ధర్మాల వారు ఉండుటచే ప్రతిరోజు ఏదో ఒక ఉత్సవం జరుగుతూ నిత్యకళ్యాణం పచ్చతోరణముగా విలసిల్లుచుండును. పండుగలలోకెల్లా రక్షాబంధన్ చాలా పవిత్రమైనదిగా పేర్కొన బడినది. ప్రతి సంవత్సరం శ్రావణమాస పౌర్ణమి రోజున శుభదినముగా భావించి ఆరోజు పవిత్రంగా స్నానాలు చేసి ప్రత్యేక పూజలు చేసి పరస్పరము పవిత్రమైన రాఖీలు కట్టుట ఆచారం కలదు. కొందరు ఈమాసాంతం వరకు మాంసాహారము, మద్యపానంలాంటి తామసిక ఆహారం మొదలగునవి నిషేధిస్తారు.

ఈ పండుగ విశ్వాత్మలందరికి సంబంధించినది. ఎందుకనగా గీతలో పేర్కొనబడిన ప్రకారం "యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత" అనగా ప్రస్తుతం ధర్మగ్లాని అయిన కలియుగాంతంలో విశ్వకళ్యాణకారియైన నిరాకార శివ పరమాత్ముడు అవతరించి ప్రజాపిత బ్రహ్మ ద్వారా సంపూర్ణ సుఖశాంతితో కూడిన సత్యయుగ ధర్మస్థాపన దివ్య కర్తవ్యమును మొదట రక్షాబంధన్ కార్యక్రమముతో బ్రహ్మకుమారీల ద్వారా ప్రారంభించెను.

ప్రియమైన ఆత్మలారా! మీరు శరీరములో భ్రుకుటి యందు నక్షత్రము వలె ప్రకాశించుచున్నారు అని తెలియజేసి నుదుట తిలకం పెట్టి 'ఓం శాంతి' యని ప్రబోధించెను. ఓం శాంతి అనగా శాంతి స్వరూప ఆత్మయని అర్థం. తర్వాత పవిత్రమైన రాఖీ ధరింపజేసి పవిత్రభవ-యోగీభవయని ఆశీర్వదించెను. పవిత్రభవ యోగీభవ అనగా పవిత్రంగా జీవిస్తూ ఆత్మనిశ్చయ ముతో పరంధామములో ఉన్న శివపరమాత్మున్ని స్మరించుటయని అర్థం. తర్వాత మధురముగా భాసించుటకై ప్రసాదమొసంగెను.

నాటి నుండి నేటి వరకు పరమాత్ముని ఆదేశానుసారం సుమారు 10లక్షల మంది ప్రజాపిత బ్రహ్మకుమారీ, కుమారులు విశ్వమంతట జాతి, కుల, మత, భేదము లేకుండా అందరికి పరమాత్ముని సందేశమిస్తూ "పవిత్ర రక్షాబంధన్" సందర్భములో ప్రతి ఒకరికి పవిత్రమైన రాఖీని కట్టి వారి నుండి కానుకలకు బదులుగా శ్రేష్ఠ సమాజ నిర్మాణమునకై వారిలో ఉండే కామ, క్రోధ, లోభ, స్వార్థ, ఈర్ష్య మొదలగు దుర్గుణాలు మద్యపానం, ధూమపానము మొదలగు దురలవాట్లు త్యాగము చేయించి వాటినే దాన పూర్వకముగా స్వీకరిస్తూ వస్తున్నారు.

మొత్తము కల్పములోనే శివపరమాత్ముడవతరించిన ఈ సమయమును పురుషోత్తమ సంగమయుగమందురు. ఈ యుగములో పరమాత్ముని జ్ఞానం పొంది ముక్తి, జీవనముక్తి లభించును. ముక్తి అనగా ఆత్మ పరమాత్ముని సన్నిధి చేరుట. జీవనముక్తి యనగా సంపూర్ణ సుఖశాంతిలో కూడిన స్వర్గ ప్రాప్తి పొందుట. ప్రస్తుత సంగమ యుగములో రాజయోగం, గీతాజ్ఞానం ద్వారా నరుడు నారాయణగాను, నారి లక్ష్మిగాను పరివర్తన చెందే వజ్రతుల్య సమయము. చాలామంది ఈ సమయమున అశాంతికి లోనౌతున్నారు. అందుకే బలహీనమైన ఆత్మను శక్తివంతం చేసుకొనుటకు మనస్సుకు శాంతి లభించినప్పుడే ఆనందమైన జీవితము గడపవచ్చును.

నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు మానవ జీవితంలో మానవత్వం కన్నా ధనమే ప్రాముఖ్యతగా భావించి మళ్లీ తానే దానికి దాసుడై ధన సంపాదనలో పడి మానవ మర్యాదలు కూడా లెక్కచేయకుండా కనీసం స్వంత పిల్లల పాలన కుటుంబపోషణ, బంధుమిత్రుల ప్రేమ, స్నేహ సంబంధాలు తెంచుకొని ఆరోగ్య నియమాలు సైతం పాటించకుండా అనేక వ్యాధులతో బాధపడుచున్నారు.

ఆధునిక యుగములో ఈ రాఖీ మహత్యం తెలుసుకోలేక రాఖీ కట్టి డబ్బులు తీసుకొనుటకు అలవాటు అయినది. కొందరు కేవలం సొంత సోదరీమణి, తమ సోదరునికి రాఖీ కట్టి, రక్షణ, ప్రేమానురాగము పొందాలని భావించారు. అయినా ప్రతి సోదరుడు తన విద్యుక్త ధర్మం ప్రకారం సోదరీమణికి తప్పక రక్షణ కల్పించాల్సి ఉన్నది. కేవలం రాఖీ కట్టినప్పుడే సోదరిని ప్రేమ చేయాలని కాదు. ప్రతి ఒక్కరు స్త్రీలను గౌరవించుట భారతీయ సంస్కృతి కలదు. కాని నేడు మన స్వాతంత్ర భారతదేశములో స్త్రీలకు గౌరవము లేకున్న కనీస రక్షణ కూడా లేకుండా పోయినది. **"యత్ర పూజ్యంతే నార్యస్తు రమంతే దేవత"** అనగా ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలుందురని అనగా సంపూర్ణ సుఖశాంతిగా ఉండునని అర్థం. కాని నేడు స్త్రీలు వరకట్నం, గృహహింస, హత్యాచారం మొద లగు దురాచారాల వలన ఆత్మహత్యలకు గురియైనారు. తద్వారా మానవజాతి యావత్తు కారణమైనది.

విశ్వంలోని సర్వాత్మలకు పరమాత్ములకు పరమాత్ముడు ఒక్కరే అయినప్పుడు మనమంతా సోదరీ సోదరులౌతాము. ఈ సృష్టియనే నాటకరంగంలో ఎవరి పాత్ర వారు నిర్వహించుచున్నారు. మనకు లభించిన పాత్రను మనము సక్రమముగా నిర్వహించుతూ పరదూషణ చేయరాదు. అది పతనానికి



నేడు రాఖీపౌర్ణమి

కారణమగును ఏ విధముగా గులాబి చెట్టును చూసినప్పుడు సాధారణంగా గులాబీ పూలనే చూస్తాము కాని దాని ముళ్లను లెక్కించము అలాగే మనము ఇతరుల సుగుణాలే చూడాలి. కాని దుర్గుణాలు పేర్కొనరాదు.

జరిగిపోయిన సంఘటనలు మరచి వైరభావాలు, ప్రతీకార బుద్ధి మనసులో పెట్టుకొనకుండా ఇతరుల పొరపాట్లను క్షమించి పరస్పరం ఆత్మిక స్నేహం, పవిత్ర ప్రేమతో కలసి మెలిసి జీవిస్తూ వసుధైక కుటుంబముగా మెలగుటకు దృఢ సంకల్పం చేయుటయే ఈ పవిత్ర రక్షాబంధన్ ప్రత్యేకత.

వర్తమాన సమయంలో మానవత భయం నీడలో జీవిస్తుంది. తనువు, ధనము, సంబంధాల రక్షణ ప్రశ్న సర్వుల మనస్సును వేధిస్తుంది. ఇటువంటి సమయంలో పరమపిత పరమాత్మ శివుని వైపు నుండి రక్షణ కవచ రూపంలో ఈ రక్షణ సూత్రము ఒక ఈశ్వరీయ వరదానంగా అందరికీ లభిస్తుంది. పరమపిత పరమాత్మ సర్వాత్మలకు పిత వారికి స్త్రీ దేహము లేక పురుష దేహము బేధముతో సంబంధము లేదు. కావున నర-నారి ఇరువురు ఈ సూత్రమును స్నేహంతో స్వీకరించగలరు. మనము మన మనస్సును జ్ఞానం, పవిత్రత, శాంతి, ప్రేమ, సంతోషం, ఆనందం, శక్తి మొదలగు సప్తరంగులతో నింపుకొని తద్వారా విశ్వాన్ని సుశోభితం చేయాలని ఈ పర్వదినము మనందరికి ప్రేరణనిస్తుంది. నేటి ప్రపంచంలో ప్రతి మానవుడిని భ్రష్టాచారమనే ఉగ్రజ్వాల దహించివేస్తుంది. ఇదే సమయంలో పరమాత్మ పిత గుప్తరూపంలో శ్రేష్ఠాచార ప్రపంచం స్థాపన కర్తవ్యమును చేస్తున్నారు. అతి శీఘ్రముగా దైవీగుణాలతో సంపన్నులైన దేవీదేవ తల ప్రపంచము భారతదేశంలో సాకారం కానున్నది. కావున శివ భగవంతుని సందేశము-"పవిత్రులు కండి-యోగులు కండి" అనగా సర్వుల పట్ల సోదర భావంతో పవిత్ర దృష్టిని కలిగి పరమాత్మనైన నా ప్రేమ పూర్వక స్మృతిలో ఉండండి.

ఇటువంటి అమూల్య వరదాన్ని, అలౌకిక సూత్రమును చేతికి కట్టుకుని, ఆత్మస్మృతి తిలకాన్ని దిద్దుకుని మధురమైన మాటలనే అవినాశి మిఠాయి అందరికి పంచుదాము. ఈ పర్వదినము మీ జీవితంలో సంపూర్ణ సుఖశాంతులను నింపుగాక.

- చందు



పిల్లల్లో మీజిల్స్



డా॥కె. ఉమాదేవి, తిరుపతి

చిన్నపిల్లల్లో సర్వసాధారణంగా వచ్చే వ్యాధి మీజిల్స్. ఇది వైరస్ ఇన్ఫెక్షన్ ముఖ్యంగా పారామిక్సో వైరస్ వల్ల వస్తుంది. మీజిల్స్‌ని రూబియెలా, మార్బిలే అని అంటారు. తెలుగులో తట్టు, పొంగు వ్యాధి, తడపర అనీ, చిన్నమ్మవారు, దద్దుర్లు అనీ అంటారు. సాధారణంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో ఎక్కువగా మీజిల్స్ వస్తుంది. ఇది పదిహేను సంవత్సరాల లోపల ఎప్పుడైనా, ఎవ్వరికైనా వచ్చే అవకాశముంది. ఇది పారామిక్సో గ్రూపుకు చెందిన ఆర్ఎన్ఎ వైరస్ క్రిముల ఇన్ఫెక్షన్ వల్ల వస్తుంది. దీన్ని 500 ఎడిలో మొదట గమనించారు. 869-932లో పర్షియన్ ఫిజిషియన్ రేజస్ దీన్ని గురించి పుస్తకరూపంలో అందరికి తెలియచేశాడు. ఇది ఎండబుక్‌గా అంటే కంటిన్యుగా ప్రపంచంలో ఏదో ఒక చోట వస్తుంటుంది. 1529లో క్యూబాలో ఎపిడమిక్‌గా వచ్చింది. 1855 నుంచి 2005 వరకు 200 మిలియన్ పిల్లలు మీజిల్స్‌తో బాధపడ్డారు. అందులో 6-8 మిలియన్ పిల్లలు చనిపోయారు. 1960లో అరమిలియన్ పిల్లలు పొంగుతో బాధపడితే ఇప్పుడు పదులు, వందల సంఖ్యలో మాత్రమే బాధపడుతున్నారు. దీనికి కారణం హౌరిస్ హిల్‌మాన్ అనే శాస్త్రవేత్త మీజిల్స్‌కు వాక్సిన్ కనుగొనడమే. అమెరికా, యుఎస్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మీజిల్స్ వ్యాధి లేదనే చెప్పాలి. ఆఫ్రికా, ఆసియా వంటి దేశాల్లో మీజిల్స్ వ్యాధితో చాలామంది బాధపడుతున్నారు. 1954లో జాన్ ఫెండర్స్, థామస్ పిబుల్స్ మార్బిలివైరస్ గురించి సంపూర్ణంగా తెలుసుకోవడంతో ఎమ్ఎమ్ఆర్ వాక్సిన్ (మీజిల్స్ మంప్స్, రుబెల్లా) మూడు వ్యాధులకు కలిపి ఒకే వ్యాక్సిన్‌ని రూపొందించారు. దీన్ని 9వ నెలలో, 1 1/2 సంవత్సరం, 3 సంవత్సరాలకు 3 విడతలుగా పిల్లలకు వేయడం జరుగుతుంది. ఇది పోషకాహారలోపం, తరుచుగా అనారోగ్యంతో బాధపడే పిల్లల్లో, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో, కేన్సర్, ల్యూకేమియా, క్షయ, హెచ్.ఐ.వి. గర్భధారణలో ఎక్కువగా వస్తుంది.

వ్యాప్తి: ఇది ఒక రకంగా అంటువ్యాధి అనే చెప్పవచ్చు. తుమ్మినా, దగ్గినా వెలువడే తుంపరుల ద్వారా ఈ వైరస గాలిలో కలిసి ఇతరులకు సులభంగా సోకుతుంది. రోగులు వాడుకునే వస్తువులు, రుమాళ్లు, టవల్స్, ఎంగిలి చేసిన ఆహారపానీయాలు తీసుకున్న వాటి ద్వారా కూడా ఇతరులకు అంటుకుంటుంది. ఇంట్లో ఒకరికి పొంగు వచ్చినట్లయితే ఇతరులకు అది సులభంగా వస్తుంది. మీజిల్స్ సామాన్యంగా చలికాలంలో, వసంత రుతువులో వస్తుంది. జీవితంలో ఒకసారి పొంగువస్తే ఆ వ్యక్తికి మళ్లీ అరుదుగా వస్తుంది. ఎందుకంటే పొంగు వచ్చిన వ్యక్తిలో శరీరం వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకుంటుంది. అందువల్ల మరోసారి ఈ వైరస్ ప్రభావాన్ని లెక్క చేయదు. కాని చిన్నమ్మవారు వచ్చినప్పుడు మందులు వాడకూడదన్న మూఢనమ్మకంతో ఈ వ్యాధికి సరైన చికిత్స తీసుకోరు. అందువల్ల కలిగే దుష్ఫలితాలు ఎక్కువనే చెప్పవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ఇది మెదడును కూడా దెబ్బకొట్టగల ప్రమాదకరమైన వ్యాధిగా పరిణమిస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తులు, లింఫాటిక్ సిస్టమ్‌లో వృద్ధి చెంది యూరినరీ ట్రాక్ట్, కళ్లు, రక్తనాళాలు, కేంద్ర నాడీమండలాన్ని ఎఫెక్ట్ చేస్తుంది.

వ్యాధి లక్షణాలు: వైరస్ క్రిములు శరీరంలో ప్రవేశించిన 10-14 రోజుల తర్వాత కాని వ్యాధి లక్షణాలు బైటకు కన్పించవు. వ్యాధి లక్షణాలు కనబడడానికి నాల్గు రోజుల ముందు, శరీరం మీద దద్దుర్లు లేదా రాష్ ఉన్నన్ని రోజులు ఇన్ఫెక్షన్ రోగి ద్వారా ఇతరులకు సంక్రమిస్తుంది.

మొదటి దశ: మైల్డ్ రకం: రోగికి చలిచలిగా ఉండడం, తలభారం, ఒళ్లునొప్పులు, నిస్త్రాణ, నీరసం, ఆకలి లేకపోవడం, ముక్కు కారడం, కళ్ల ఎర్రగా వుండడం వుంటుంది.

రెండవదశలో: సివియర్ రకం: రోగికి జలుబు, ముక్కు నుండి, కళ్ల నుండి కారడం,కళ్ల ఎర్రబడడం, వెలుతురుని చూడలేకపోవడం, కంటిరెప్పలు ఉబ్బడం, కండ్లకలక వంటి లక్షణాలుంటాయి. తలనొప్పి, తుమ్ములు, ముఖం కందినట్లుండడం, విపరీతమైన కళ్ల నొప్పులు, దగ్గు, గొంతు బొంగురుపోవడం ఉండి జ్వరం 103-104 ఫారన్‌హీట్ వరకు వుంటుంది. తర్వాత శరీరంపై రాష్ కనపడుతుంది. మొదటి రెండు, మూడురోజుల్లో నాలుక, నోటిలోని దౌడల దగ్గర చిన్నచిన్న తెల్లని మచ్చలు (చిన) ఉప్పుకణాలు చల్లినట్లు) గుంపులు గుంపులుగా ఉంటాయి. దీన్నే 'క్లోపిక్స్ స్పాట్స్' అంటారు. ఇది జలుబు నుంచి మీజిల్స్‌ని మొదటగా నిర్ధారించే గుర్తు. నాల్గవ రోజున చెవుల వెనుక భాగంలో, తల, మెడ వెనుక భాగంలో గల వెంట్రుకల అంచులలో ముఖంపై రాష్ కన్పిస్తుంది. ఐదవ రోజున చేతుల లోపలి భాగాల్లో పొంగు వస్తుంది. ఈ విధంగా రోజురోజుకీ శరీరమంతటా వ్యాపిస్తుంది. దద్దులు మొదట ఎర్రగా చుక్కల వలె పల్చగా ఉండి క్రమేణా మందంగా, పెద్దవిగా అర్ధచంద్రాకారంలో ఉంటాయి. ఈ తట్టును నొక్కినప్పుడు ఎర్రదనం తగ్గినట్లు కనపడి తిరిగి కొన్ని క్షణాల్లో ఎర్రబడతాయి. దీన్నే 'రెడ్‌మీజిల్స్' అంటారు. తట్టు తట్టుకు మధ్య చర్మం మామూలుగానే ఉంటుంది. పొంగు బైట పడుతున్నకొద్దీ జ్వరం కొద్ది కొద్దిగా తగ్గుతూ 7-8 రోజులకు పూర్తిగా తగ్గిపోతుంది. తగ్గేముందు శరీరమంతట దురదలు, మంటలుంటాయి. దద్దు పూర్తిగా కన్పించినా రెండు రోజుల తర్వాత జ్వరం తగ్గిపోతుంది. శరీరమంతా డ్రైగా అయి బ్రేన్ మచ్చలుగా ఉండి, ఆరిన తర్వాత పొట్టు పొట్టుగా రాలిపోతుంది. దీన్నే 'బ్లాక్ మీజిల్స్' అంటారు. అలా కాకుండా దద్దుర్లు పొక్కులుగా వరి రక్తస్రావంతో వుంటే దాన్ని జర్మన్ మీజిల్స్ అంటారు. ❐



అటుకుల పూర్ణాలు

కావలసినవి

అటుకులు-కప్పు
బెల్లంతురుము-కప్పు
పచ్చికొబ్బరితురుము-కప్పు
క్యారెట్ తురుము-కప్పు
యాలకులపొడి-రెండు చెంచాలు
మంచినూనె-వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

ఓ పాత్రలో గ్లాసు నీళ్లు తీసుకుని అందులో బెల్లం తురుము చేర్చి పొయ్యిమీద పెట్టి కరిగించాలి. ఆ తరువాత అటకుల్ని బెల్లం నీటిలో వేసి ఐదునిమిషాలు నాననిచ్చి తరువాత తీసేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఇప్పుడు కొబ్బరి, క్యారెట్ తురుము, యాలకులపొడిని మెత్తగా రుబ్బుకొని, దాంతోపాటు అటుకుల మిశ్రమాన్ని కూడా బెల్లం నీటిలో వేయాలి. బాణలిలో నూనె వేడిచేయాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండల్లా చేసుకుని కాగుతున్న నూనెలో వేయాలి. బంగారువర్ణంలోకి వచ్చాక తీసేస్తే సరిపోతుంది. కరకరలాడుతూ, మెత్తగా ఉండే పూర్ణాలు నోరూరిస్తాయి. ❐

ఏ గిన్నెలో ఏముంది...

మనం రకరకాల పాత్రల్లో వంటలు చేసుకుంటాం. ఆహారపదార్థాలు వగైరా నిల్వ చేసుకుంటాం. ఈ పాత్రలు వాటి తయారీకి వాడే లోహ లక్షణాలు, ఉపయోగాలు ఏమిటో చూద్దామా...

- రాగి చాలా అందంగా కనిపించే లోహం, త్వరగా వేడెక్కే ఉష్ణవాహకం. అయితే కాస్త ఖరీదెక్కువ. తరచూ కళాయి పెట్టించుకోవాలి. లేకపోతే కిలుంపడుతుంది. రాగిపాత్రల్లో పదార్థాలు తింటే చాలా ఆరోగ్యకరం.
- అల్యూమినియం ఉష్ణవాహకంగా బాగా పనిచేస్తుంది. కానీ ఇందులో వంటకం రంగు మారిపోయే అవకాశం ఉంది. మన్నిక తక్కువ. ఉప్పు వంటి క్షారగుణాలున్న పదార్థాలను నేరుగా ఇందులో నిల్వ చేయడం మంచిది కాదు.
- స్టీలైతే మన్నిక ఎక్కువ. ఎన్నాళ్లున్నా ఇబ్బంది ఉండదు. అయితే ఇవి అతి వేడిని తట్టుకోవు.
- ఇక ఈ మధ్యకాలంలో వస్తున్న అల్యూమినియం, రాగిపై స్టీలు కోటింగ్‌తో తయారైన పాత్రలకు మన్నిక ఎక్కువ. వేడిని బాగా తట్టుకొంటాయి.
- సిరామిక్ పాత్రలైతే శుభ్రం చేయడం తేలిక. టేబుల్‌మీద పెట్టినా ఎంతో అందంగా రంగుమయంగా ఆహ్లాదకరంగా కనిపిస్తాయి. అయితే చేజారితే ముక్కలు చెక్కలే.
- ఇత్తడి కంచు పాత్రలు ఈనాటికి కాదు. వీటికి అత్యధిక ఉష్ణోగ్రతను తట్టుకునే శక్తి ఉంటుంది. అప్పుడప్పుడూ చక్కగా ఇత్తడి పాత్రలకు కళాయిపెట్టించుకోవడం మాత్రం మరచిపోవద్దు.
- గాజు చూడడానికి వడ్డించడానికి బాగుంటుంది. లోపల పదార్థాలూ ఆకర్షణీయంగా కనబడతాయి. అయితే అతి వేడి తట్టుకోలేవు. చెయ్యిజారితే ఎందుకూ పనికిరావు. వాటర్‌లెస్ (పైన స్టీల్ అడుగున అల్యూమినియం) పాత్ర సామగ్రికి ఇంధనం ఖర్చు తక్కువ. వంటకాలలో విటమిన్లు వృథాపోవు. తేలికగా శుభ్రం చేసుకోవచ్చు.
- నాన్‌స్టిక్ పాత్రలైతే వంటకం పాత్రలకు అంటుకోదు. నూనె ఖర్చూ తక్కువే. కానీ నాన్‌స్టిక్ మెల్లమెల్లగా పోతుంటుంది. దాని రేణువులు వంటకంలో కలిసే అవకాశం ఉంది. దోసెల పెనం వంటి వాటిని తరచూ మార్చేస్తుండాలి. ❐



ముందుచూపు

ఆధ్యాత్మికం

"వర్షఋతువులో ఇబ్బందిపడకుండా ఉండటం కోసం ముందు నెలల్లోనే ప్రయత్నించాలి. రాత్రికోసం పగటిపూట ప్రయత్నించాలి. ముసలితనం కోసం యౌవనంలో ప్రయత్నించాలి. పరలోకం కోసం ఈ జన్మలోనే ప్రయత్నించాలి" అనే మంచి సందేశాన్నిస్తుంది ఒక సంస్కృతశ్లోకం. ఆ సందేశం అనుసరణీయం.

వానాకాలంలో చటుక్కున ఎక్కడికి వెళ్లి ఏ వస్తువు తెచ్చుకోవాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. పూర్వకాలంలో కట్టెలమంటతోనే వంట చేసుకొనేవారు. ప్రయాణసాధనాలూ అంతంత మాత్రమే. పెద్ద సంసారాలు. దేవ, పితృ, అతిథిపూజలు సాగవలసిందే. శ్రమపడి పెద్ద ఎత్తున సంబరాలు సమకూర్చుకుంటేనేగానీ బండి నడవదు. హోరున కురిసేవానల్లో సమీకరించుకోవటం ఎంతో కష్టం. అందువల్ల ఏడాదిలో కొన్ని నెలలు వర్షఋతువును దృష్టిలో ఉంచుకొని గట్టి ప్రయత్నం చేస్తే ఆ సమయం ఏ శ్రమా, ఇబ్బందీ లేకుండా గడిపివేయవచ్చు.

రాత్రికోసం పగటిపూట ప్రయత్నించాలనటంలో కూడా ఎన్నో విశేషాలున్నాయి. పగలు శ్రమకు, రాత్రి సుఖనిద్రకు కల్పింపబడ్డాయి. నిశ్చింతగా గాఢనిద్రపడితే ఆరోగ్యం బాగుంటుంది. అంతటి గాఢనిద్ర- పనిచేసి అలసిపోయిన వాడికే వస్తుంది. నిర్వ్యాపారంగా కూర్చున్నవాడికి రాదు. పదిమందితో తగవుపడేవాడు, అధర్మకార్యాలు చేసేవాడు సుఖంగా నిద్రపోలేడు. తాను చేసిన చెడుపనికి ఫలితంగా ఏ ప్రమాదం, ఏ క్షణాన ఏ రూపంలో ముంచుకు వస్తుందో అని భయం భయంగా బ్రతికేవాడికి నిద్ర ఆమడదూరంలో ఉంటుంది. వ్యసనాలకు బానిస అయినవాడికి, ఎదుటివాడు పచ్చగా ఉంటే చూచి ఓర్వలేనివాడికి కూడా నిద్రపట్టదు. ఒక్కొక్కసారి కొన్ని రోగాల వల్ల కూడా నిద్రరాదు. ఆరోగ్యానికి ఎంతో అవసరమైన నిద్రను సహజంగా పొందాలంటే ఆరోగ్యకరమైన ఆహారం, ధర్మసమ్మతమైన వ్యవహారం అలవరచుకోవాలి.

వార్ధక్యం ఏ అలజడీ లేకుండా ప్రశాంతంగా గడిచిపోవాలంటే శక్తి ఉన్నప్పుడు యౌవనంలోనే దానికి తగిన కృషి చేయాలి. యౌవనంలో ఉండే శక్తి ఉత్సాహం, సాహసం వార్ధక్యంలో ఉండవు. శక్తి ఉడిగిన ఆ వేళ దురదృష్టవశాత్తూ తమకెవరూ సహకరించకపోతే ఎన్నో ఇబ్బందులు పడాలి. అందుకే ముసలితనంలో ఆత్మాభిమానంతో జీవించగలిగే ప్రణాళికలు ముందుగానే వేసుకోవాలి. గ్రాస, వాసాలకు లోటురాకుండా ఉండేటట్లు పొదుపు చేసుకోవాలి. కుటుంబ సభ్యుల పట్ల తాము నిర్వహించవలసిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి. తమ పెద్దరికానికి పరిమితులను అవగతం చేసుకుని జీవించేందుకు మానసికంగా సిద్ధపడాలి.

"మానవుడు మరణించిన తరువాత, ఎంతో శ్రమపడి అతడు సంపాదించిన ధనం భూలోకంలోనే ఉండిపోతుంది. వాని పశుసంపద గోష్ఠంలో మిగిలిపోతుంది. వాని అర్థాంగి ద్వారా పర్యంతమే అనుసరిస్తుంది. బంధుమిత్రులు శ్మశానావధిగా వెంట నడుస్తారు. చివరికి అతని దేహం కూడా చితిలో రూపుమాసిపోతుంది. ఇక తన ధర్మమే తనకు తోడుగా జీవి పరలోక యానం చేస్తాడు" అనే వాస్తవాన్ని మన పెద్దలు మనకు చెప్తూనే ఉన్నారు. మరణానంతరం మనం మన ధర్మాధర్మాలతో వెళ్లవలసిన పరలోకం ఒకటి ఉంది. మన సమస్త చర్యలకూ అక్కడ తీర్పులు చెప్పబడతాయి. ఈ స్పృహతో పరలోకంలో నిర్దోషులుగా నిలబడగలగటానికి ఇహలోకంలోనే ప్రయత్నించాలి. ఈ ప్రయత్నం బాల్యా దిగా, నిత్యవ్రతంగా జరగాలి. భగవదారాధన, సన్మార్గ చింతన-వయస్సు మళ్లిన తరువాత నిర్వహించు కోవచ్చు అనే ఆలోచన కొందరికి ఉంటుంది. కానీ చరమాంకంలో నోరెత్తి దైవస్మరణ చేయలేని, కాళ్లూ, చేతులూ కదలని దయనీయస్థితి సంభవిస్తే ఏం చేయగలుగుతాం? అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్నట్టు, సకాలంలో సజ్జన సమ్మతంగా స్పందించినవారు భద్రంగా ఉంటారు. జీవితంలో ఏ సన్నివేశమూ వారిని ఆందోళనకు గురిచెయ్యదు.

- కొంపెల్ల రామకృష్ణా మూర్తి

వార్తాఫలం

మేషం: ప్రమోషన్స్, కొన్నిచోట్ల ధన హానికి అవకాశం. ప్రమాదాలు. సంతాన విషయ చర్చలు చేస్తారు. సంతృప్తికరంగా కాలాన్ని గడపగలుగుతారు. కుటుంబంలోని పెద్దలతో కలిసి స్థిరాస్తులు వృద్ధిలోకి తీసుకొచ్చే విషయమై సమాలోచనలు సాగిస్తారు.

వృషభం: ధనవృద్ధి, కార్యసిద్ధి యోగ్యతలు, వ్యతిరేకతలు. భాగస్వాములతో ఏర్పడిన అభిప్రాయభేదాలను పరిష్కరించుకోవడానికిగాను చిన్నపాటి చర్చలను సాగిస్తారు. శ్రమకు తగిన ప్రతిఫలం కనబడుతుంది. ఆర్థిక విషయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

మిథునం: వృత్తియందు సామాన్య విజయావకాశాలు. తలచిన పనులను పూర్తి చేస్తారు. ఉద్యోగస్తులకు అనుకూలంగా ఉంటుంది. బ్యాంకింగ్ వ్యవహారాలు లాభసాటిగా ఉంటాయి. చేయవలసిన పనులను సక్రమంగా పూర్తిచేయగలుగుతారు.

కర్కాటకం: ధనప్రాప్తి, కార్య సాధన, మనోల్లాసములు. సుఖము, విద్యార్థులకు అధిక శ్రమకు అవకాశం. స్వల్పమైన ఆరోగ్య ఇబ్బందులు ఎదురైనా అధిగమించగలుగుతారు. మీరు చేసే కార్యక్రమాలకు ఇతరుల మద్దతు కూడా లభిస్తుంది.

సింహం: కుటుంబ సౌఖ్యములు, వ్యాపారంలో అనుకూలం. ఆర్థిక లావాదేవీలు కరస్పాండెన్స్‌లలో సాంకేతిక లోపాలు ఏర్పడకుండా జాగ్రత్తలు వహించడం మంచిది. మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుంటారు.

కన్య: (ఆగస్టు యత్న కార్యసిద్ధి, వాహనయోగం, లాభాలు. ఉద్యోగరీత్యా విదేశాలకు వెళ్లాలనుకునే మీ ఆలోచనలకు బాటలు వేస్తారు. స్వల్పమైన ఆరోగ్య ఇబ్బందులను ఎదుర్కోనవలసి వస్తుంది. మిత్రులతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు సమసిపోతాయి.

తుల: దూర ప్రయాణాలు చేస్తారు. కార్యద్రవ్య భంగం. కనుమరుగయ్యాయి అనుకున్న వస్తువులు తిరిగి మీ దరికి చేరతాయి. ఆర్థిక చిక్కుల నుండి బయటపడలేకపోయినా వత్తిడి నుండి బయటపడతారు.

వృశ్చికం: నీచులతో, దుర్మార్గులతో కలహాలకు అవకాశం, నష్టం. శత్రువుపై విజయాన్ని పొందుతారు. గతంలో విభేదించిన వారు కొన్ని ప్రయోజనాలను ఆశించి మీతో తాత్కాలిక మిత్రత్వానికి శ్రీకారం చుడతారు. ఏకపక్ష నిర్ణయాలను తీసుకోరు.

ధనుస్సు: విద్యార్థులకు అధిక శ్రమ, శుభప్రాప్తి కలుగును. బంధుమిత్రుల నుండి అందిన ఒక సమాచారం మీకు ఎంతో ఉపకరిస్తుంది. ఉద్యోగస్తులకు అధికారుల నుండి గుర్తింపు లభిస్తుంది. గతంలోని లిటిగేషన్ వ్యవహారం అనుకూలంగా పరిణమిస్తుంది.

మకరం: వ్యాపారంలో తగ్గుదలకు అవకాశం. అధికార సందర్శనం, శుభ కార్యప్రాప్తి, ప్రమోషన్స్‌కు అవకాశం. తెలివితేటలు ఆలోచనలు కలిసి వస్తాయి. నేర్పుగా చేసే నిర్ణయాల వలన లాభపడతారు.

కుంభం: ఆరోగ్య లోపం, దూరదేశ ప్రయాణాలు చేస్తారు. బంధుప్రీతి. ప్రముఖులతో సాన్నిహిత్యాన్ని మరింత బలపరచుకోగలుగుతారు. గత కొంతకాలంగా వాయిదాపడుతూ వస్తున్న పనులను పూర్తి చేయగలుగుతారు.

మీనం: కొన్ని సాహసోపేతమైన కార్యాలు చేస్తారు. అధికారుల ఒత్తిడి మీపై ఉంటుంది. ఏజెన్సీలు, కాంట్రాక్టులకు సంబంధించిన విషయాలలో జాగ్రత్త వహించండి. నిరుద్యోగులు ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్



లై సినిమాతో భారీ హిట్ కొట్టటానికి నితిన్, హను రాఘవ పూడితో కలిసి పక్కా ప్లాన్ చేశారు. సినిమా మీద నమ్మ కంతోనే రెండు భారీ సినిమా లు ఆగస్టు 11న రేసులో ఉన్నా కూడ తెగించి థియేటర్స్‌లోకి రావటానికి సిద్ధమయ్యారు.. ఇకపోతే సినిమాకు ఫస్ట్‌లుక్ విడుదలైనప్పటి నుంచి అంచనాలు పెరిగాయి.. ఆ అంచనాలు లై టీజర్‌తో



హీరో హీరోయిన్ల అబద్ధాలు

మరింత ఎక్కువయ్యాయి.. టీజర్‌తోలో స్టైలిష్ లుక్‌తో అదరగొట్టిన నితిన్ ఇపుడు తాజాగా థియేట్రికల్ ట్రైలర్‌తో సందడి చేస్తున్నారు.. శనివారం రాత్రి ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు.. ఈ ఈవెంట్‌లోనే ట్రైలర్‌ను కూడ లాంచ్ చేశారు. ట్రైలర్‌ని చూస్తున్నంత సేపు ఆసక్తిగా అన్పిస్తుంది.. లై సినిమాలో అన్ని అబాద్ధాలే.. హీరో హీరోయిన్లు ఇద్దరూ అబద్దాలు మాట్లాడతారు.. అబద్ధాలు మాట్లాడతున్నంతసేపు మామూలుగా ఉన్నా ఆ తర్వా త మాత్రం లవ్‌లో పడతారు.. అసలు అబద్ధాలకే అమ్మాయిలు తొందరగా పడతారని, సత్యం (నితిన్) చెప్పటం చూస్తుంటే మాత్రం సినిమాపై తెగ ఇంట్రెస్ట్ పుట్టేస్తోంది.. ఇక విలన్‌గా అర్జున్ ఇరగ దీశాడని అంటున్నారు.. స్టైలిష్ విలన్‌గా అర్జున్ విశ్వరూపం చూపె ట్టాడని మాత్రం అర్ధమ వుతుంది. లై సినిమా ఆసాంతం అలరిం చిం దటంతో సందేహం లేదు. ఈ సినిమాను ట్రైలర్‌లో మరో బీభత్స మణిశర్మ సంగీతం.. చాలా రోజుల తర్వాత మణి మ్యూజిక్ అదర గొట్టే శారు.. యువరాజ్ ఫొటోగ్రఫీ ఈసినిమాకు మెయిన్ హైలెట్స్ .. కొత్తగా ఒక లవ్‌స్టోరీని చెబుతూ..అందులో మాఫియా టచ్..బాగానే ఇచ్చారు..



బాలయ్య తనకు చాలా లక్కీ

నందమూరి బాలకృష్ణ చేస్తున్న 101 వచిత్రం పైసా వసూల్‌లో స్టార్‌హీరోయిన్ శ్రియ శరన్ ఆయనకు జోడీగా నటిస్తున్న సంగతి తెలిసిందే.. గతంలో వీరిద్దరూ కలిసిన నటించిన 'చెన్నకేశరెడ్డి', 'గౌతమీపుత్ర శాతకర్ణి' వంటి చిత్రాలు మంచి విజయాన్ని సాధించటంతో ఈచిత్రం కూడ హిట్టవుతుందని అందరూ భావిస్తున్నారు.. అంతేకాక శ్రియ బాలకృష్ణకు లక్కీ హారోయిన్ అని ఆమెను పొగిడేస్తున్నారు కూడ.తాజాగా ఒక మీడియా ఇంటర్వ్యూలో 'మీరు బాలకృష్ణకు లక్కీ హీరోయిన్ కదా ? అనే అంశం రాగానే స్పందించిన శ్రియ,100 సినిమాలు చేసిన హీరోకి నేను లక్కీ హీరోయిన్ అనటం భావ్యం కాదు.. ఒక రకంగా చెప్పాలంటే ఆయనే నాకు లక్కీ హీరో అందామె.. ఇకపోతే పూరి జగన్నాధ్ డైరెక్టు చేసిన 'పైసా వసూల్' చిత్రం సెప్టెంబర్ 1న రిలీజ్ కాబోతోంది.



తమిళభాష నేర్చుకుంటోంది

తనతోపాటు వచ్చిన చాలా మంది అమ్మాయిలు హ్యాపెనింగ్ స్టార్లు అయిపోయారు కానీ.. తొలిసినిమాతో పెద్ద హిట్‌ను సొంతం చేసుకున్న రాశిఖన్నా మాత్రం ఎందుకో రేసులో కాస్తంత వెనుకగా నే ఉంది.. స్టైలిష్ పాత్రలో అల్ట్రా మోడరన్ లుక్కులో బాగానే హంగామా చేసినా.. ఇపుడు ఈమె చేతిలో పెద్ద సినిమాలంటే కేవలం ఎన్టీఆర్ జై లవకుశ ఒక్కటే ఉంది.. అయితే రాశి ప్లాన్స్ వేరేలా ఉన్నాయంట మరి.. తెలుగులోనే కాకుండా ఒక సిమ్రాన్, ఒక నయనతార తరహాలో తమిళంలో కూడ పాతుకుపోవాలని చూస్తోందట.. ఇపుడు తెలుగు బాగానే మాట్లాడేస్తోంది.. హైదరాబాద్‌లో ఉంటూ తెలుగును అలా వంటబట్టించుకుంది.. కట్‌చేస్తే ఇపుడు తమిళంలో ఇమైక్క నోడిగల్, సైతాన్ కా బచ్చా అంటూ రెండు సినిమాల్లో చేస్తోంది. వీటికోసం అమ్మడు ఒక తమిళ టీచర్‌ను పెట్టుకుని మరీ తమిళం నేర్చేసుకుంటోందట.. అల్‌రెడీ బాగానే మాట్లాడేస్తోందని అంటున్నారు.. కాస్త తమిళం మాట్లాడి సిమ్రాన్ నమిత, హన్సిక తరహాలో అక్కడివారికి దగ్గరైతే ..ఇక తమిళంలో భారీ బ్రేక్ కొట్టేసినట్టే అంటున్నారు..

కొన్ని విషయాల్లో సర్దుకుపోవాలి

తెలుగులో ప్రస్తుతం ఉన్న స్టార్ హీోయిన్లలో రకుల్‌ప్రీత్‌సింగ్ ఒకరు.. ప్రస్తుతం ఆమె తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న మహేష్‌బాబు -మురుగదాస్‌ల కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ 'స్పైడర్'లో నటిస్తోంది.. ఈచిత్రం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అదేసమయంలో ఆమె బోయపాటి దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్‌తో నటిస్తున్న జయజానకి నాయకా. చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ రెండు చిత్రాలు అతి తక్కువ గ్యాప్‌లోనే విడుదల కానుండటం విశేషం.. ఇక సాయిపల్లవి, కీర్తి సురేష్‌వంటివారు తనకు తాను వారిని పోటీగా భావించనని, తానే నెంబర్‌వన్ అని అంటోంది.. తెలుగులో మొటి చిత్రం చేసే రోజున నాకు తెలుగు అసలు తెలియదు.. భాష రాక, తెలుగు అర్ధం కాక ఏడ్చేశాను.. ఇపుడు నేనున్న స్థితి గాలివాలుగా రాలేదు.. దీని వెనుక కఠోరమైన కృషి ఉంది.. అని పేర్కొంది.. పెద్దలు చూసిన పెళ్లి చేసుకోను.. ఖచ్చితంగా ప్రేమ వివాహమే చేసుకుంటాను.. నన్ను చేసుకునేవాడకిఇ సినిమాలంటే ఇష్టం ఉండాలి.పొడవుగా ఉండి, మంచి భోజన ప్రియుడు అయి ఉండాలి.. నీలో నాకిది నచ్చలేదు.. అది నచ్చలేదు అంటే ఒప్పుకోను.. ఒక మహిళల సమాజంలో ఉన్న పురుషాధిక్యం వల్ల కొన్ని విషయాల్లో సర్దుకు పోవాలి.. కానీ నాజీవితాన్ని శాసించాలని, ఎవరైనా చూస్తేచెప్పు తీసుకొని కొడతా..అంటూ అమ్మడు పెద్దపెద్ద మాటలే వల్లిస్తోంది. అందండీ సంగతి.

నేటి ఆకలిరాజ్యం -త్వరలో స్టార్ట్

భాగ్యలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ పతాకంపై శ్రీభాగ్యదర్శకత్వంలో మంజులా భాగ్యలక్ష్మి, యం.శ్యామల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం నేటి ఆకలిరాజ్యం. ఆనంద, కావ్యశ్రీ, అంజలి, జబర్దస్త్ ఆది, షేకింగ్ శేషు, మొదలగు వారితో తమ బ్యానర్‌లో మొదటి చిత్రంగా ఈ నెల చివరి వారం నుంచి షూటింగ్ జరుగుతుందని తెలిపారు. కృషి, పట్టుదల, ఏకాగ్రతతో యువత తాము అనుకున్నది ఓలా సాధించగలరు, స్నేహసంబంధాలు మరిచిపోయి డబ్బేప్రధానం అనుకుని బ్రతికే యువత నిజమైన స్నేహం విలువ ఏమిటో ఈ చిత్రంలో రూపించడం జరుగుతుంది. అంతేకాకుండా 20మందకిపైగా సీనియర్ నటీనటులు, సీనియర్ సాంకేతిక నిపుణులతో నిర్మిస్తున్నామని దర్శకుడు తెలిపారు. కెమెరా: రామ్ పినిశెట్టి, మాటలు: రైటర్ మోహన్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీభాగ్య.

రానాకు సూట్ అవుతుందనే: సురేష్‌బాబు



సురేష్ ప్రొడక్షన్స్ , బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం. నేనే రాజు నేనే మంత్రి.. డాక్టర్ డి.రామా నాయుడు సమర్పిస్తున్నారు.. తేజ దర్శకత్వం వహిస్తున్నారు.. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు.. డి. సురేష్‌బాబు, ఎంవి కిరణ్‌రెడ్డి, సి.భరత్‌చౌదరి నిర్మాతలు. ఈనెల 11న ఈసినిమా విడుదల కానుంది.. ఈసందర్భంగా ఆదివారం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఏర్పాటుచేసిన మీడియా సమా వేశంలో డి.సురేష్‌బాబు మాట్లాడారు.. నేనే రాజు నేనే మంత్రి కథను ముందు వినగానే రానాకు ఈ కథ సూట్ అవుతుందని అన్పించిందన్నారు.. ఇందులో రానా నటన చూశానని, మూడు నాలుగు సన్నివేశాల్లో తనను ఏడ్పించేశాడని అన్నారు.. తప నటన పట్ల సంతృప్తి చెందినట్టు పేర్కొన్నారు.. కారూకూడి, కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాల్లో సినిమా పూర్తిచేశామని, సినిమా కొత్త అన్పిస్తుంది. అన్నారు. సినిమా ఆగస్టు 11న విడుదల అవుతుందని అన్నారు.. కార్యక్రమంలో నిర్మాత కిరణ్‌రెడ్డి, భరత్‌చౌదరి తదితరులు మాట్లాడారు.

రామ్ మూవీ టైటిల్
'ఉన్నది ఒక్కటే జిందగీ'

ఎనర్జిటిక్‌స్టార్ రామ్‌ను సరికొత్తగా ఆవిష్కరించిన చిత్రం 'నేను శైలజ' . కిశోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈచిత్రం ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ హిట్ కాంబినేషన్‌లో మరో సినిమా నిర్మాణంలో ఉంది.. స్రవంతి రవికిషోర్ పి.ఆర్ సినిమాస్ సమర్పణలో స్రవంతి సినిమాటిక్స్ పతాకంపై ఈచిత్రాన్ని కృష్ణచైతన్య నిర్మిస్తున్నారు.. ఇందులో అనుపమా పరమేశ్వరన్, లావణ్య త్రిపాఠి కథానాయికలు ఈచిత్రానికి 'ఉన్నది ఒకటే జిందగీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు.. ఇప్పటివరకూ జరిపిన షెడ్యూల్స్‌లో 50శాతం పైగా సినిమా పూర్తయింది.. కాగా సోమవారం ఊటీలో షెడ్యూల్ ప్రారంభించనున్నారు.. స్రవంతి రవికిషోర్ మాట్లాడుతూ, స్నేహం, ప్రేమ నేపథ్యంలో ఈసినిమా ఉంటుందన్నారు. ఫ్రెండ్‌షిప్‌డే సందర్భంగా ఈచిత్రంలో ఉన్న ట్రెండ్ మారినా..ఫ్రెండ్ మారడు.. అనే పాటను సంబంధించిన 'లిరికల్ వీడియో'ను విడుదల చేయబో తున్నాం... దేవిశ్రీ ప్రసాద్ స్వర పరచిన ఈ పాటను చంద్రబోస్ రాశారు.. భారీ షెడ్యూల్‌తో ఒక పాట మినహా సినిమా పూర్తవుతుందన్నారు.. ఆ పాటను వచ్చే నెల ఇటలీలో చిత్రీకరి స్తామన్నారు.. దసరాకు సినిమాను విడుదల చేయనున్నామని తెలిపారు.



అర్జున్‌రెడ్డి.. ట్రైలర్ విడుదల

టీజర్‌తో అందరిలోనూ భారీ అంచనాలను రేకెత్తించిన అర్జున్‌రెడ్డి సినిమా ట్రైలర్ విడుదలైంది.. పెళ్లిచూపులు తర్వాత విజయ్ దేవరకొండ ఈసినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.. మూడు నిముషాల నిడివి ఉన్న ట్రైలర్ ద్వారా విజయ్‌లోని కొత్త కోణాన్ని దర్శకుడు సందీప్ వంగ ఆవిష్కరిం చినట్టుగా తెలు స్తోంది..



కోపాన్ని నియంత్రిం చుకోలేని ఓ మెడికల్ స్టూడెం ట్ కథతో ఈసినిమా తెర కెక్కింది.. విజయ్ సరసన షాలిని పాండే హీరోయిన్‌గా నటిస్తోంది.. కమల్ కామ రాజ్ ఓ ప్రత్యేకపాత్రలో కన్పించనున్నా రు.. ఈ చిత్రానికి రాధన్ స్వరాలు సమకూర్చారు.. ఆగస్టు 25న చిత్రం విడుదల కానుంది.

సాంగ్స్ రికార్డింగ్‌లో 'లోక రక్షకుడు'



చంద్రాస్ ఆర్ట్‌మూవీస్ పతాకంపై చంద్ర పర్వ తమ్మ సమర్పణలో చంద్రశేఖర్ చంద్ర నిర్మిస్తున్న చిత్రం 'లోకరక్షకుడు'.. చిత్రం మార్చిలో లండన్‌లో ప్రారంభమైన విషయం తెలిసిందే.. బ్రహ్మం సిహెచ్ . ఈ చిత్రానికి దర్శకుడు. పలు భాషల్లోనూ, పలు దేశాల నటీనటులతో తెరకెక్కుతున్న ఈచిత్రం లోగో ని లండన్ పార్లమెంట్ ఎంపి బాబ్ బ్లాక్‌మెన్ ఆవిష్క రించారు.. ఈచిత్రం చెన్నైలో సాంగ్స్ రికార్డింగ్ జరుపుకుంటోంది. నిర్మాత చంద్రశేఖర్ చంద్ర మాట్లాడారు.. క్రీస్తు జీవితచరిత్రను అత్యద్భుతంగా, కొత్త అంశాలతో తెరకెక్కిస్తున్నామని తెలిపారు.. ప్రపంచ పటంలో అనాదిగా భారతదేశం శాంతి చిహ్నాం.. గౌతమ బుద్ధుడు, మహాత్మాగాంధీ తదితన మహానుభావులు ప్రపంచశాంతికి మార్గ దిశను చూపారు.. అలాగే క్రీస్తు జీవితం, మార్గం, సందేశం పలు వర్గాల్లో , ప్రదేశాల్లో శాంతి నింపే విధంగా ఈచిత్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈచిత్రంలో పాటలు ప్రస్తుతం చెన్నై దేవా గారి అమ్మ టాకీస్ స్టూడియోలో రికార్డింగ్ జరుపుకుంటున్నాయని తెలిపారు.. 3వ షెడ్యూల్‌ని ఆగస్టు 3వ వారం నుంచి ఫారిన్ నటీనటులతో కర్ణాటకలో షూటింగ్ జరగనుందని పేర్కొన్నారు..

డార్జిలింగ్ తేయాకుతోటల్లో ఉత్పత్తి మాంద్యం!

గూర్ఖాలాండ్ ఉద్యమంతో స్తంభించిన తేయాకుతీత



కోల్‌కతా, ఆగస్టు 6: గూర్ఖాలాండ్ ఉద్యమం ఫలితంగా డార్జిలింగ్ టీ ఎస్టేట్లలు మొత్తం ఆర్థికమాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గడచిన జూన్ 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకారణంగా టీ తోటల్లో పనులులేవు. డార్జిలింగ్ టీ సముదాయాలు కూడా ఈ సమ్మెకారణంగా మూతపడ్డాయి. తేయాకు తోటల చరిత్రలో మొదటిసారిగా డార్జిలింగ్ టీ ఎస్టేట్లు రెండునెలల పాటు మూత పడటం విస్మయం కలిగిస్తోంది. ఉత్పత్తి నిలిచిపోవడంతో మార్కెట్లో డార్జిలింగ్ తేయాకు లేకుండాపోయింది. మూసివేతకు ముందు టీఎస్టేట్లు 30శాతం ఉత్పత్తినిసాధించేవి. డార్జిలింగ్ టీ అసోసియేషన్ ముఖ్యసలహాదారు సందీప్‌ముఖర్జీ అంచనాలప్రకారం మొత్తం ఈ రెండునెలల్లోను వార్షిక ఉత్పత్తిలో 30శాతం దెబ్బ తిన్నట్లు అంచనావేసారు. గత ఏడాది డార్జిలింగ్ టీ 8.45 మిలియన్ కిలోలను ఉత్పత్తిచేసింది. డార్జిలింగ్ తేయాకు ఏడాదికి నాలుగుసీజన్లు ఉంటాయి. మొదటిది, రెండోది, రుతుపవనాలు, వేసవి సీజన్లుగా ఉంటాయి. మొదటిసీజన్ ఫిబ్రవరి మధ్యస్తం నుంచి ఏప్రిల్ చివరివరకూ ఉంటుంది. రెండోసీజన్ మేమధ్యస్తం నుంచి జూన్ చివరివరకూ ఉంటుంది. ఈ రెండుసీజన్ల తేయాకునే ఎక్కువగా ఎగుమతిచేస్తారు. డార్జిలింగ్ టీకి ఈరాబడులు ఏడాది కాలం అక్కరకు వస్తాయి. తేయాకుతోటలపరంగా రెండోప్రీమియం తేయాకును ఉత్పత్తి తీయలేవు. రెండోసారి వచ్చేతేయాకును పూర్తిగా ధ్వంసంచేస్తారు. ప్రస్తుతంప్రపంచం మొత్తం డార్జిలింగ్ టీ మార్కెట్ పడిపోయింది. ఉత్పత్తిలో కోత ఇందుకు ప్రధాన కారణం. వేలం సంస్థల వద్ద కూడా నిల్వలు కరిగిపోవడంతో ధరలు ప్రీమియంకు వెళ్లాయి. పరిశ్రమవర్గాల ఇప్పటివరకు రూ.250 కోట్ల నష్టం చవిచూసినట్లు సలహాదారు వెల్లడించారు. డార్జిలింగ్‌టీకి గతంలో రూ.500 కిలోకు ధరలున్నాయి. కిలోకు ఇప్పుడు రూ.1000గా విక్రయిస్తున్నారు. మొదటిగ్రేడ్ తేయాకు డార్జిలింగ్‌టీ గత ఏడాది కిలో ఒక్కటి రూ.1000గా ధర పలికింది. ప్రస్తుతం కిలోకు రూ.2వేలు ధర పలుకుతోంది. నాసిరకం తేయాకు కూడా కిలో ఒక్కటికి రూ.500 నుంచి రూ.800కి పెరిగిందని కోల్‌కతా టీట్రేడర్స్ అసోసియేషన్ ఛైర్మన్ అన్షుమన్ కనోరియా వెల్లడించారు. డార్జిలింగ్ టీ ఎస్టేట్స్ మూసివేత వల్ల ఎగుమతి ఆర్డర్లు నష్టపోతున్నామని అన్నారు. దీనివల్ల ఈ లోటును కొనుగోలుదారులు నేపాల్, చైనా, శ్రీలంకల నుంచి కొనుగోలుచేసి భర్తీ చేస్తున్నారు. డార్జిలింగ్ టీకి ఉన్న ప్రతిష్ట మొత్తం అడుగంటిపోతోందని కనోరియా వెల్లడించారు. డార్జిలింగ్ కొండకోనల్లో మొత్తం 87 తేయాకుతోటలు పెరుగుతున్నాయి. డార్జిలింగ్ తేయాకును 50 దేశాలు కొనుగోలు చేస్తున్నాయి వాటిలో యూరోపియన్ యూనియన్‌కూడా ఉంది. మూసివేత కారణంగా ఈ ఆర్డర్లు నష్ట పోతున్నట్లు ముఖర్జీ వెల్లడించారు. మూసివేత కారణంగా కార్మికులు సైతం ఉపాధి కోల్పోతున్నారు. 60వేలమందికి పైగా శాశ్వత కార్మికులు, 40వేలమందికి పైగా సీజనల్ కార్మికులు పనిచేస్తున్నారు. మొత్తం 87కుపైగా ఉన్న టీ ప్లాంటేషన్లలో నాలుగులక్షలమంది ఆధారపడి నివసిస్తున్నట్లు అంచనా. డార్జిలింగ్ ఫరిసరాల్లో 17,500 హెక్టార్ల ఆయకట్టులో తేయాకు సాగవుతోంది. సమ్మెలు, సమస్యల కారణంగా ఈ ఏడాది కనీసం పదిశాతం ఉత్పత్తిని కూడా రాబట్టలేమని డార్జిలింగ్‌లో 13 తోటల అధినేత చమన్‌గ్రూప్ ఛైర్మన్ అశోక్ లోహియా వెల్లడించారు. మొత్తం మీద డార్జిలింగ్‌లో గూర్ఖాల్యాండ్ ఉద్యమం వల్ల తేయాకు తోటల్లో పనులు స్తంభించిపోయాయి. ఫలితంగా ఉత్పత్తి మందగించింది.

గుడ్ల ధరలు

Ph:040-23234068

వందకు, రూ.లలో	Rs.per 100 eggs	
హైదరాబాద్	310	Hyderabad
నెక్ రేట్లు (7-8-2017)		NECC RATES
(రిటైల్ ధర రూ.3.70)		(Retail Price Rs.3.70)
విజయవాడ	308	Vijayawada
గోదావరి	308	Godavari
విశాఖపట్నం	318	Visakha
వరంగల్	312	Warangal
చిత్తూరు	365	Chittoor
చెన్నై	372	Chennai
ముంబయి	360	Mumbai
న్యూఢిల్లీ	297	New Delhi
కోల్‌కతా	338	Kolkata
బెంగళూరు	360	Bangalore
నమక్కల్	360	Namakkal

చికాబ్

Mobile No.9849219870

(రూ. కిలోకు)		(RS.PER Kg)
ఫామ్‌గేట్	(Farmgate)	71
డ్రెస్డ్	(Dressed)	85
విత్ స్కిన్	(with skin)	119
స్కిన్‌లెస్	(Skinless)	140

నైరుతి, బ్లూచిప్ ఫలితాలే కీలకం

ఈ వారం మార్కెట్ మంత్రాంగం



ముంబయి, ఆగస్టు 6: నైరుతిరుతుపవనాల కదలికలు, బ్లూచిప్‌కంపెనీల త్రైమాసిక ఫలితాలు వచ్చేవారం దేశీస్టాక్‌మార్కెట్లలో ధోరణులను నిర్దేశించనున్నాయి. ఈ నెల రెండుకల్లా దేశవ్యాప్తంగా సాధారణ సగటు వర్షపాతం నమోదయినట్లు తాజాగా వాతావరణశాఖ పేర్కొన్నది. దేశ ఆర్థికవ్యవస్థకు నైరుతి రుతుపవనాలు కీలకమన్న సంగతి తెలిసిందే. ప్రస్తుత ఖరీఫ్‌సీజన్‌కు నైరుతివర్షాలే ఆధారం కావడంతో ఇకపై వర్షపాత విస్తరణపైఇన్వెస్టర్లు దృష్టిసారించే అవకాశాలున్నాయి. దేశంలో అత్యధికశాతం వ్యవసాయం నైరుతిపైనే ఆధారపడి ఉంది. సగటు వర్షపాతం ఆర్థిక వ్యవస్థకు మేలుచేకూర్చుతుందని ఇన్వెస్టర్ల అంచనా. గ్రామీణ ఆర్థికవ్యవస్థ మెరుగుపడితే స్టాక్ మార్కెట్లకు పెట్టుబడులరూపంలో ఎక్కువ నిధులు అందుతాయన్నది అంచనా. ఇప్పటికే పలు దిగ్గజాలు ఈ ఆర్థిక సంవత్సరం తొలిత్రైమాసిక ఫలితాలు ప్రకటించగా వచ్చేవారం మరికొన్ని బ్లూచిప్ పనితీరు వెల్లడిచేస్తాయి. సోమవారం బ్రిటానియా, టాటాస్టీల్, ఎనిమిదవ తేదీ థెర్మాక్స్, తొమ్మిదన టాటామోటార్స్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, అరవబిందోఫార్మా, ఐషర్ మోటార్స్, ఎన్ఎండిసి, ఎన్‌హెచ్‌పిసి, పదిన భెల్, ఎంఒఐఎల్,(మోయిల్), 11న బ్యాంక్ ఆఫ్ బరోడా, బిపిసిఎల్, సిప్లా, హిందాల్కో, తొలిత్రైమాసిక ఫలితాలు వెల్లడిస్తాయి. వీటితోపాటే అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు యూరోప్, ఆసియా మార్కెట్లు ప్రధానంగా జపాన్, అమెరికా, యూరోప్ స్టాక్‌ఎక్చేంజిల ధోరణలే ఎక్కువ కీలకం అవుతాయి. మార్కెట్లు ముగిసిన తర్వాత జూన్‌నెల పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు వస్తాయి. అంతర్జాతీయంగా చూస్తే చైనా, జపాన్ వాణాజ్య గణాంకాలు సోమ,మంగళవారాల్లో విడుదలవుతాయి. ఇవికాకుండా విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, డాలరుతో రూపాయి మారకం విలువలు, అంతర్జాతీయంగా భౌగోళిక స్థితిగతులు, ఆయా దేశాల కరెన్సీల చెలామణివంటివి దేశీయమార్కెట్లను ప్రభావితం చేస్తాయని అంచనా.

సిండికేట్ బ్యాంకు నికరనష్టం రూ.263.19కోట్లు

ముంబయి,ఆగస్టు 6: ప్రభుత్వరంగంలోని సిండికేట్ బ్యాంకు జూన్‌త్రైమాసికంలో 263.19 కోట్ల రూపాయలు నష్టాలపాలయింది. కేటాయింపుల్లోను, రానిబాకీలపరంగా భారీ పెరుగుదలతో నికర లాభాల నుంచి నష్టాల్లోకి మళ్లింది. క్షీణించాయి. గత ఏడాది బ్యాంకు రూ.79.13 కోటలాభం ఆర్జించింది. మొత్తం ఆదాయవనరులపరంగాచూస్తే 6171.49 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో 6419.12 కోట్లుగా ఉన్నాయి. రానిబాకీలు 79శాతం పెరిగి రూ.1385.66 కోట్లకు పెరిగాయి. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో 774.41కోట్లుగా ఉన్న సంగతి తెలిసిందే. కార్పొరేట్ హోల్‌సేల్ బ్యాంకింగ్‌పరంగా 2088.98 కోట్ల రూపాయలకు పడిపోయింది. గత ఏడాది 2562.28 కోట్లుగా ఉన్న సంగతి తెలిసిందే. రిటైల్ బ్యాంకింగ్ కార్యకలాపాలద్వారా రూ.1984.67 కోట్లు ఆర్జించింది. గత ఏడాది ఇదేకాలంలో 1973.66 కోట్లు సాధించింది. స్థిరాస్థి ప్రమాణాలు దెబ్బతిన్నాయి.స్థూల నిరర్థక ఆస్తులపరంగా 9.96 శాతం పెరిగాయి. గత ఏడాది 7.53శాతంనుంచి భారీగాపెరిగాయి. ఇక నికర నిరర్థకఆస్తులు కూడా 5.04శాతంనుంచి 6.27శాతానికిపెరిగాయి. దీనివల్ల జూన్‌త్రైమాసికంలో కేటాయింపులనిష్పత్తి 6.27శాతంగా నిలిచింది.

మార్కెట్లలో పెరిగిన పప్పుదినుసుల ధరలు



ఇండోర్, ఆగస్టు 6: పప్పుదినుసులకు కీలకమార్కెట్ అయిన ఇండోర్‌లో కొత్తసరుకుల రాక భారీగా తగ్గడంతో మార్కెట్లలో పప్పుదినుసులధరలు పెరిగాయి. ప్రభుత్వం కూడా కొన్నిరకాల పప్పుదినుసుల విత్తనాలపై ఎగుమతికి ఆస్కారం కల్పించడంకూడా ఇందుకు మరికొంతకారణం అయింది. కందిధరలు క్వింటాలుకు 3350గా నిలిచింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 2900 నుంచి మూడువేల వరకూ కొనసాగింది. కందిధరలు మధ్యస్తంగా ఉన్న రకం క్వింటాలుకు రూ.4100 నుంచి రూ.4200గా నిలిచింది. ఇక పెద్దగుళ్ల మినుములు క్వింటాలు రూ.4300నుంచి రూ.4400గా నడిచాయి. పెసర పెద్దవి క్వింటాలుకు రూ.4500నుంచి రూ.4600గా ఉంటే మధ్యరకం పెసలు క్వింటాలుకు రూ.3800నుంచి 4000గా నడిచాయి. పెసలధరలలు పెరగడం వల్ల పప్పుదినుసుల్లో కూడా పెరిగింది. మధ్యరకం పెసర పప్పు క్వింటాలు రూ.5వేల నుంచి రూ.5100గాను, పెద్దపప్పు రూ.5200 నుంచి రూ.5400గాను ఉంటుంది. పొట్టుపెసరపప్పు క్వింటాలుకు రూ.5700 నుంచి రూ.5800గా నిలిచింది.

బులియన్ ధరలు

	6 న ముగింపు	క్రితం ముగింపు
ఢిల్లీ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29020	29140
22 క్యారెట్లు (10గ్రా)99.5	27140	27260
వెండి .999 (కేజీ)	40953	40953
ముంబయి		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29000	29130
22 క్యారెట్లు (10గ్రా)99.5	27120	27250
వెండి .999 (కేజీ)	40948	40948
చెన్నయ్		
24 క్యారెట్లు10(గ్రా)	28990	29150
22 క్యారెట్లు	27110	27300
వెండి బార్ (కేజీ)	40966	41266
హైదరాబాద్		
24 క్యారెట్లు (10గ్రా)	29040	29210
22 క్యారెట్లు (10గ్రా)	27160	27300
వెండి (కేజీ)	40983	40983
విజయవాడ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	28990	29150
22 క్యారెట్లు (10గ్రా)99.5	27110	27270
వెండి .999 (కేజీ)	40953	40953
విశాఖపట్నం		
24 క్యారెట్లు10(గ్రా)	29990	29150
22 క్యారెట్లు	27110	27270
వెండి బార్ (కేజీ)	40953	40953

చిన్నబ్యాంకుల విలీనంతో ఎంఎస్ఎంఇకి గండి



న్యూఢిల్లీ,ఆగస్టు 6: చిన్నబ్యాంకులను విలీనం చేయడం వల్ల దేశంలో ఎంఎస్ఎంఇ రంగం దెబ్బతింటుందన్న అంచనాలు ఎక్కువయ్యాయి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి ఎక్కువగా చిన్నబ్యాంకులనుంచే రుణపరపతి అందుతోంది. చిన్నమొత్తాల్లో రుణాలు పొందడం వీరికి సునాయాసంగా ఉంది. రిసర్జంట్ ఇండియా సంస్థ వెల్లడించిన ఆర్థికసేవల నివేదికలో ఈ అంశాలను ఉటంకించింది. పెద్ద బ్యాంకులు సాధారణంగా ఎంఎస్ఎంఇకి చిరువ్యాపారాలకు తక్కువ ప్రాధాన్యతనిస్తాయి. ఈ రంగం కూడా పెద్ద బ్యాంకులను చేరుకోలేకపోతుంది. అటువంటి తరుణంలోనే ఎంఎస్ఎంఇలకు చిన్న బ్యాంకులు అండగా నిలిచాయి. అందులోనూ చిన్న బిజినెస్ ఖాతాలను బ్యాంకులు ఏర్పాటుచేసుకోగలిగాయి. పెద్దబ్యాంకుల్లో చిన్నబ్యాంకుల విలీనం వల్ల ఎంఎస్ఎంఇ రంగానికి రుణపరపతి వనరులు పూర్తిగా మూసుకుని పోయినట్లేనని చెప్పాలని రిసర్జంట్ ఇండియా ఎండి జ్యోతిప్రకాష్ గాడియా వెల్లడించారు. ఎంఎస్ఎంఇ రంగానికి సంబంధించినంతవరకూ ఉపాధిపరంగా దేశంలో 45శాతం మందికి కల్పిస్తోంది. ఉత్పత్తిరంగంలోనే 45శాతం వాటాతో ఉంది. ఎగుమతుల్లో 40శాతం, దేశ జిడిపిలో ఎనిమిదిశాతం వాటా సమకూరుస్తున్న ఎంఎస్ఎంఇ రంగాన్ని విస్మరిస్తే భవిష్యత్తులో ఉపాధికి గండమేనని ఆర్థికనిపుణుల అంచనా. అయితే ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థల బ్యాంకుల్లో ఎంఎస్ఎంఇ శాఖలు ఏర్పాటయ్యాయి. కొన్ని బ్యాంకుల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటుచేసి ఇందుకు రుణపరపతిని సరళీకృతంచేసామని చెపుతున్నాయి. వాస్తవానికి రుణపరపతి మంజూరులో రిటైల్‌రంగానికి మాత్రమే ప్రాధాన్యతనిస్తున్న బ్యాంకులు వాస్తవంలో ఎంఎస్ఎంఇరంగానికి సైతం గండికొడుతున్నాయనే చెప్పాలి. ప్రైవేటురంగం పరంగా ఈ అంశానికి సంబంధించి ముందంజలో ఉన్నాయి. అందువల్లనే ఎన్‌పిఎలపరంగా కూడా ప్రైవేటురంగం కొంత మెరుగుపడింది. ప్రభుత్వరంగ బ్యాంకులు రుణపరపతికి ఎక్కువగా మొండిబకాయిల పెరుగుదలనే ప్రధానకారణంగా చూపించి కార్పొరేట్, ఇతర చిన్నపరిశ్రమలకు సైతం రుణాల మంజూరులో వెనుకంజ వేస్తున్నాయి.

రూ.లక్ష కోట్లకు పెరిగిన ఎస్‌బిఐ లైఫ్ నిర్వహణాస్తులు

ముంబయి,ఆగస్టు 6: ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ నిర్వహణాస్తులు లక్షకోట్లకు పెరిగాయి. బ్యాంకస్యూరెన్స్ విక్రయాలేజోరందుకోవడంతో నిర్వహణాస్తుల్లో గణనీయంగా వృద్ధి నమోదుచేసింది. బ్యాంకు ద్వారా పంపిణీ అయే ప్రీమియంలు మంచి లాభాలను తెచ్చాయి. దీనివల్లనే ఎస్‌బిఐ లైఫ్ ఐపిఒకు వచ్చేందుకు దారితీసింది. ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ బ్యాంకస్యూరెన్స్ విక్రయాలు సంఘటిత వార్షిక వృద్ధి రేటున 46.7శాతంగానిలిచి రూ.1944కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు సంవత్సరం రూ.4185కోట్లనుంచి ఉన్న రాబడులు మరింతగాపెరిగాయి. ప్రైవేటు జీవితబీమా సంస్థలు భారత్‌లో ఇదేకాలంలో 27.2 శాతం మొత్తం వృద్ధినిసాధిస్తే ఎస్‌బిఐలైఫ్‌మరింత వృద్ధినిసాధించింది. అందువల్లనే కంపెనీ కొత్తబిజినెస్ ప్రీమియంలలో రెండోఅతిపెద్ద సంస్థగా నిలిచింది. 20.6శాతం మార్కెట్‌వాటాను సాధించింది. ఎస్‌బిఐ లైఫ్ ఎండిసిఇఒ ఆర్జిత్‌బసు మాట్లాడుతూ బ్యాంకస్యూరెన్స్ ప్రీమియం రెండువిధాలుగా పెరిగింది. కొత్త భాగస్వాములతో సంస్థ సంతకాలు చేయడం ద్వారా ఒకటి. పంజాబ్ సింధ్‌బ్యాంకు 1500 శాఖలద్వారా వచ్చే ఆదాయం ఎస్‌బిఐలైఫ్ భాగస్వామ్యం కూడా ఉంది. అలాగే సౌత్‌ఇండియన్‌బ్యాంకు 850శాఖల ద్వారా కూడా దక్షిణాదిలో మార్కెట్‌ను ఎస్‌బిఐలైఫ్ సాధిస్తుంది. ఎస్‌బిఐలైఫ్ అంతకుముందు ఎస్‌బిఐ అనుబంధ బ్యాంకులనుంచి కూడా మంచి వ్యాపారాన్ని సాధిస్తుందని అంచనా. ఇతర బ్యాంకుల కస్టమర్లకు గ్రూప్ బీమా పాలసీలు అందిస్తు న్నట్లు బసు వెల్లడించారు. ఎక్కువగా గృహరుణాల కస్టమర్లకు అందిస్తున్నామన్నారు. ఎస్‌బిఐకు ఉన్న శాఖాపరమైన విస్తృత నెట్‌వర్క్‌తో ఎస్‌బిఐలైఫ్ పాలసీలను మరింతగా విక్రయిస్తోంది. ఎస్‌బిఐ లైఫ్‌జాయింట్ వెంచర్‌లో ఉన్నందున ఎస్‌బిఐఎనిమిదిశాతం వాటాలు, పరిభాస్ కార్డిఫ్‌లో నాలుగుశాతం వాటాలనుఐపిఒద్వారా విక్రయిస్తున్నాయి. మొత్తం 20లక్షల షేర్లు ఉద్యోగులకు కేటాయించింది. మరో 1.2కోట్ల వాటాలనుఎస్‌బిఐ వాటాదారులకు డిస్కౌంట్‌పై అందిస్తుంది.

నిర్మలా లాజిస్టిక్స్‌కు 20 అశోక్‌లేలాండ్ గురు ట్రక్కులు

హైదరాబాద్,ఆగస్టు 6: అశోక్‌లేలాండ్ ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త గురుట్రక్‌లను మొత్తం 20వరకూ ఏకమొత్తంలో కస్టమరుకు సరఫరా చేసారు. ఆటోమోటివ్ మాన్యుఫ్యాకర్చరర్స్ మాధవ్‌శర్మ, అశోక్‌లేలాండ్ రీజినల్‌మేనేజర్ దివాకర్‌రెడ్డిలు కలిసి నగరంలో తమ క్లయింట్ నిర్మలా లాజిస్టిక్స్‌కు 20 గురు బిఎస్4 ట్రక్కులను పంపిణీచేసింది. ఇంటిలిజెంట్ ఎగ్జాస్ట్ గ్యాస్ రీసర్క్యులేషన్ వ్యవస్థతో రూపొందించిన గురు ట్రక్కులు రవాణారంగానికి ఎంతో ఉపకరిస్తాయని కంపెనీ వెల్లడించింది. బిఎస్-4 ఉద్గారాల నిబంధనలకు అనుగుణంగా ఐఇజిఆర్ టెక్నాలజీని ఈ ఏడాది ఏప్రిల్‌లోప్రారంభించింది. 400 హెచ్‌పివరకూ ఉన్న ఇంజన్లకు ఈ వ్యవస్థను అమర్చింది. ఇప్పటివరకూ ప్రపంచంలో ఏ ఇతర సంస్థలోను ఈవ్యవస్థలేదు. అశోక్‌లేలాండ్ గురుట్రక్కులు అత్యధికఇంధన సామర్థ్యంతో ఉంటాయి. హెచ్ సిరీస్‌ఇంజన్లు 115హెచ్‌పితో నడుస్తున్నాయి. 11.9 టన్నుల జివిడబ్ల్యు, 13.1టన్నుల జివిడబ్ల్యు ఎక్కువ పేలోడ్‌తో వస్తున్నది. పవర్‌స్టీరింగ్, రేడియల్ టైర్లుఇతర అన్నిప్రామాణిక ఫీచర్లతోపాటు అనువైన క్యాబిన్‌లోమ్యూజిక్ వ్యవస్థ, నిద్రపోయేందుకు సౌకర్యం, మొబైల్‌ఛార్జర్ వంటివ ఇఉన్నాయి. అశోక్‌లేలాండ్‌కు ఆటోమోటివ్ మాన్యుఫ్యాకర్చరర్స్ అధీకృత డీలర్‌గా పనిచేస్తోంది. తెలంగాణ,ఎపిల్లో మొత్తం 30 సేవల కేంద్రాలు ఏర్పాటుచేసింది.



పసిడిమార్కెట్‌లో మాంద్యం



ముంబయి,ఆగస్టు 6: బంగారంధరలు రూ.200లకుపైగా పెరిగి పదిగ్రాముల బంగారం దేశ రాజధాని పరిసరాలమార్కెట్లలో రూ.29,420కి చేరింది. విదేశీ మార్కెట్లలో డిమాండ్ నీరసించడం, స్థానిక డిమాండ్ కూడా తగ్గడమే ఇందుకు కారణమని అంచనా. వెండిధరలు కూడా అదేదారిలో నడిచాయి. కిలో ఒక్కింటికి రూ.825లు తగ్గి రూ.38,325గా నిలిచాయి. పారిశ్రామిక యూనిట్లు, నాణేల తయారీదారులు నుంచి డిమాండ్ పడిపోవడమే ఇందుకుకీలకంగా నిలిచింది. విదేశీ ధోరణులు నీరసించడం, స్థానిక జ్యూయెలర్లు, రిటైలర్లు నుంచి దేశీయ స్పాట్ మార్కెట్లలోకూడా డిమాండ్ నీరసించడం వల్ల ధరలు దిగజారాయని బులియన్ నిపుణులు చెపుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడిధరలు 0.75శాతంగా ఉంది. ఔన్స్ ఒక్కింటికి రూ.1258.40డాలర్లుగా నడిచింది. వెండిధరలు కూడా ఔన్స్ ఒక్కింటికి 2.49శాతం తగ్గి16.24 డాలర్లుగా నడిచాయి. డాలరుతో రూపాయి విలువలు మెరుగుపడటంతో దిగుమతులు మరింత చౌకగా వచ్చాయి. ఈ ప్రభావం ధరలపైచూపింది. రూపాయి రెండేళ్ల గరిష్ట స్థాయికి పెరిగి 63.58కి చేరింది. అదనంగా స్థానిక జ్యూయెలర్లనుంచి డిమాండ్ తగ్గింది. దేశరాజధాని పరసరాల్లో పదిగ్రాముల 99.9 కేరట్ల బంగారం, 99.5 కేరట్ల స్వచ్ఛమైన బంగారం రూ.200 తగ్గి రూ.29,420లుగాను, రూ.29,270లుగాను కొనసాగింది. ముందురోజు పదిగ్రాములకు రూ.190 వరకూ పెరిగింది. సవర్లలో చూస్తే ఎనిమిదిగ్రాముల బంగారం రూ.24,500గా నిలిచింది. బంగారందారిలోనే వెండిధరలు కూడానడిచాయి. కిలోకు రూ.825 వరకూ తగ్గి రూ.38,325గా నిలిచింది. వారం వారం పంపిణీ కింద కిలోకు రూ.910 తగ్గి 37,260లుగా నడిచింది. వెండి నాణేల పరంగా ప్రతి వంద నాణేల కొనుగోలుకు రూ.72వేలు, విక్రయాలకు రూ.73వేలుగా కొనసాగాయి.

ఫార్మారిటైల్ హెల్త్‌కేర్‌రంగాల్లోనే జీతాలపెంపు

విజ్‌డమ్ జాబ్‌సర్వే



హైదరాబాద్, ఆగస్టు 6: ఫార్మా, రిటైల్, హెల్త్‌కేర్‌రంగాల్లో ఇటీవలికాలంలో భారీగా జీతాల పెంపు కనిపిస్తోంది. ఐటి, బ్యాంకింగ్, ఆర్థికరంగ సేవలు, బీమా రంగాలు కొంతమేర పెంపులేదని విజ్‌డమ్‌జాబ్స్ నివేదిక ఉటంకించింది. జీతాల పెంపులో బెంగళూరు నగరం ఎక్కువగా ఉంది. 9.7శాతం జీతాలు పెంచితే ఢిల్లీలో అతితక్కువగా 7.7శాతం మాత్రమే జీతాల పెంపు ఉన్నట్లు విజ్‌డమ్ వెల్లడించింది. జీతాలపెంపులో హైదరాబాద్ కూడా టాప్‌మూడు నగరాల్లో ఒకటిగా నిలిచింది. అలాగే తరచూ ఉద్యోగులు మారుతున్న ధోరణులు కూడా 8.9శాతం, 10.2శాతంగా ఉన్నాయి. ఢిల్లీ, ముంబై వంటి మహానగరాలో అతితక్కువ మంది మాత్రమే ఒక కంపెనీని వీడి మరోకంపెనీకి ఉద్యోగులు మారుతున్నట్లు తేలింది. ఈ రెండునగరాల్లోను 11.6శాతం, 6.8 శాతం ఉద్యోగుల నిష్క్రమణం, కొత్తవాటిలో చేరడం జరుగుతోంది. విజ్‌డమ్ జాబ్స్ భారత్‌లోని 120 కంపెనీలు,పదిపరిశ్రమలు, హెల్త్‌కేర్, బిఎఫ్ఎస్ఐ, ఆతిధ్యరంగం, రిటైల్, ఎఫ్ఎంసిజి, ఫార్మా, ఐటి, టెలికాం, ఉత్పత్తి, మౌలికవనరులరంగాలకు చెందిన వాటిలోనిర్వహించిన సర్వేలో ఆసక్తికరమైన అంశాలు వెల్లడి అయ్యాయి. ఎక్కువశాతంపరిశ్రమల్లో కొంత ఆదా ఉన్నప్పటికీ రెండంకెల్లో జీతాల పెంపు కనిపిస్తున్నదని వెల్లడించింది. ఐటి రంగం ఎక్కువ శాతం పెంచుతున్నట్లు తేలింది. మధ్యస్థాయి, సీనియర్‌కేడర్ ఉద్యోగులకు ఈ పెంపు అనివార్యం అయింది. విజ్‌డమ్ వ్యవస్థాప కులు సిఇఒ అజయ్ కొల్లా మాట్లాడుతూ కొన్ని రంగాలు జీతాల పెంపులో పొదుపుపాటిస్తుంటే మరికొన్ని రంగాల్లో రెండంకెల్లో ప్రగతి కనిపిస్తోంది. ఫార్మారంగంలో 10.9శాతం జీతాలు పెరిగాయి. హెల్త్‌కేర్ రిటైల్ రంగాల్లో 10.8 శాతంగా ఉంది. ఆతిధ్యరంగం, ఐటి రంగాల్లో 9.9 శాతంగాను, 9.8శాతంగా జీతాలు పెరిగాయి. ఎఫ్ఎంసిజి, టెలికాం రంగాల్లో 9.6శాతం జీతాలుపెరిగితే మౌలికవనరులరంగం ఉత్పత్తిరంగాల్లో 9.2 శాతం, 9శాతం చొప్పున జీతాలుపెరిగాయి. ప్రాంతాల వారీగాచూస్తే జీతభత్యాలు పెద్దనగరాల్లో ప్రోత్సాహకరంగా లేవు. బెంగళూరు 9.7శాతం, చెన్నై పుణెనగరాలు 9.1శాతం, 9శాతంగా ఉన్నాయి. హైదరాబాద్, ముంబై, కోల్‌కతా 8.9శాతం, 8.7శాతం, 8.5శాతంగా ఉన్నాయి. ఢిల్లీ అతి తక్కువగా జీతాలపెంపులో కేవలం 7.7శాతం మాత్రమే పెరుగుదల కనిపిస్తోంది. ఇక ఐటిరంగం నుంచి ఎక్కువగా కంపెనీలు మారుతున్న ధోరణులు కనిపిస్తున్నాయి. టాప్ పది రంగాల్లో కంపెనీలు మారుతున్న ధోరణులు ఐటిరంగంలో 24శాతం, టెలికాం రంగంలో 22శాతం, ఆతిధ్యరంగంలో 20శాతం, రిటైల్ హెల్త్‌కేర్‌లో 19.6శాతం, 19.3శాతంగా ఉన్నాయి. ఫార్మా బిఎఫ్ఎస్ఐ రంగాల్లో 18.9శాతం, ఎఫ్ఎంసిజిలో 18.7శాతం, ఇన్‌ఫ్రారంగపరంగా 17.8 శాతంగా ఉన్నాయి. ఉత్పత్తిరంగంలోనే అతి తక్కువగా తరచూ సంస్థలు మారుతున్నారు. ఈ రంగంలో కేవలం 11.1శాతంమాత్రమే ఉద్యోగులు కొలువులు మారేందుకు ఇష్టపడుతున్నట్లు తేలింది.

56% క్షీణించిన హెచ్‌పిసిఎల్ నికరలాభం

న్యూఢిల్లీ, ఆగస్టు 6: ప్రభుత్వరంగంలోని హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ నికరలాభాలు 56శాతం దిగజారాయి. నికరలాభం గత ఏడాది 2098 కోట్లు ఆర్జిస్తే ఈ ఏడాది కేవలం రూ.924.75 కోట్లు మాత్రమే సాధించింది. ముడిచమురు కొనుగోళ్ల తర్వాత ధరలు తగ్గడం మార్కెటింగ్‌కు ముందు నెలకొన్న అనిశ్చితి వల్ల కంపెనీకి 1595 కోట్లు నష్టం వచ్చిందని అంచనా. ఈ త్రైమాసికంలో ఇన్వెంటరీ నష్టం మొత్తంగా 960 కోట్లుగా ఉంది. అదేసమయంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.1935 కోట్లు లాభం వచ్చింది. స్థూల రిఫైనరీ మార్జిన్ పరంగాచూస్తే గత ఏడాది 6.83 డాలర్లుగా ఉంటే ఈ ఏడాది 5.86 డాలర్లుగా నిలిచింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గురువారం 45శాతం తన నికరలాభాల్లో తగ్గుదలనుప్రకటించింది. ఇన్వెంటరీ నష్టాలే ఇందుకు కారణమని స్థూల రిఫైనింగ్‌మార్జిన్ తగ్గడానికి ఇదే కీలకమని రెండుకంపెనీలు ప్రకటించాయి. భారతీయ ముడిచమురు కొనుగోళ్ల ధరలు బ్యారెల్‌కు 51.48 డాలర్లుగా నడిచాయి. గత ఏడాది కేంద్రకేబినెట్ హెచ్‌పిసిఎల్‌లోని 51శాతం వాటాలను ఒఎన్‌జిసి కొనుగోలుకు సమ్మతించింది. సంస్థ లాభాలు తగ్గడానికి ఇదొక మూలకారణం అని చెపుతున్నారు.

హైటెక్స్‌లో 'ఫార్మాలిటికా' సదస్సు

హైదరాబాద్, ఆగస్టు 6: నగరంలో ఫార్మాలిటికా 2017 సదస్సును యుబిఎం ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. భారత్‌కు బల్క్‌డ్రగ్స్ రాజధానిగా ఉన్న హైదరాబాద్‌లో ఈ సదస్సును ఈనెల 11,12తేదీల్లో నిర్వహిస్తున్నట్లుయుబిఎం ఇండియా వెల్లడించింది. హైటెక్స్ ఎగ్జిబిషన్ కేంద్రంలో జరిగే ఈ సదస్సుపరంగా ఫార్మాలిటికాలో విశ్లేషణాత్మక, గుణాత్మక బయోటెక్, ప్రయోగశాలల యంత్రసామగ్రి, లాబ్‌కెమికల్స్, ఫార్మా యంత్రాలు, పాకేజింగ్,ఉపరంగాలవంటివి ఎన్నో సంస్థలనుంచి ప్రాతినిధ్యం ఉంటుంది. స్టాండర్డ్ గ్రూప్‌ఆఫ్ కంపెనీస్, శానిట్ ఎక్విప్‌మెంట్, గంధి ఆటోమేషన్స్, మాక్‌ఫార్మాటెక్,ఎస్‌కెఫార్మా మెషినరీ, స్టెరిమాక్స్‌ఇంజినీర్, ఉతోపియా ఆప్టోవిజన్, రాహుల్‌ఎంటర్‌ప్రైజెస్,కెమిపాక్ ఇండియా, శ్రీనైనా గ్లాస్ కోమల్ ఇండస్ట్రీస్, ఆల్‌ఫామ్ టెక్నాలజీస్, కిర్లోసక్ న్యూమాటిక్, వంటి సంస్థలు పాల్గొంటున్నట్లు యుబిఎం ఇండియా వెల్లడించింది. ఈ సదస్సులోఫార్మారంగంలో శరవేగంగా జరుగుతున్న మార్పులు, జాతీయ ఔషధరంగ విధివిధానాలు ఫార్మావిజన్ 2020 ప్రచారం వంటివి కీలకంగా ఉంటాయని వెల్లడించారు. ఫార్మాలిటికాసదస్సును హైదరాబాద్‌లో నిర్వహించడం మంచి పరిణామంగా యుబిఎం ఇండియా ఎండి యోగేష్‌ముద్రాస్ వెల్లడించారు. ఈ సదస్సుకు ఫార్మెక్సిల్, అసోసియేషన్ ఆఫ్‌కాంట్రాక్ట్ రీసెర్చి ఆర్గనైజేషన్స్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫార్మాక్యూటికల్ ఇండస్ట్రీ, బల్క్‌డ్రగ్‌మాన్యుఫ్యాకర్చరర్స్ అసోసియేషన్ వంటి సంస్థలు మద్దతు పలుకుతున్నాయి.

డెబిట్‌కార్డులపైనా 'ఫ్లిప్‌కార్ట్' ఇఎంఐలు!

ముంబయి, ఆగస్టు 6: భారత్‌లో ఇ-కామర్స్ సంస్థలమధ్య పోటీ పతాకస్థాయిలో నడుస్తోంది. ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌గ్రేట్ ఇండియన్‌సేల్స్ పేరుతో ఆఫర్లు అదరగొడుతున్నది.పోటీని తట్టుకోడానికి ఫ్లిప్‌కార్ట్ ఏకంగా డెబిట్‌కార్డులపై ఇఎంఐ సదుపాయం కల్పించేందుకు నిర్ణయించింది.రిజర్వుబ్యాంకు లెక్కల ప్రకారం 79.98 కోట్లమేర డెబిట్‌కార్డుదారులున్నారు. క్రెడిట్‌కార్డులు వాడుతున్న వారుకేవలం 3.14కోట్లుగా ఉన్నారు. ఇప్పటివరకూ కంపెనీలు క్రెడిట్‌కార్డులపైనే ఇఎంఐ ఆప్షన్స్ ఇస్తున్నఆయి. డెబిట్‌కార్డ్ హోల్డర్స్ ఇఎంఐ సదుపాయం కల్పిస్తే అమ్మకాలుమరింత జోరందుకుంటాయని ఫ్లిప్‌కార్ట్ విశ్వసిస్తోంది. అతిత్వరలతోనే ప్రారంభించే బిగ్‌బిలియన్‌డేస్ సేల్‌లోభాగంగా ఫ్లిప్‌కార్ట్ ఈ ఆఫర్‌నుప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే సాధ్యాసాధ్యాలపైయాక్సిస్‌బ్యాంకు, ఎస్‌బిఐలతో చర్చించామని పైలట్‌ప్రాజెక్టు కింద రెండు బ్యాంకులతోకలిసి పనిచేస్తామని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. దీనితో కంపెనీ రెవెన్యూ,సేల్స్ భారీగా పెరిగే అవకాశం ఉంటుందని నమ్ముతోంది. పండుగలసీజన్ త్వరలోనేప్రారంభం కానుండటంతోప్రస్తుతం ఉన్న పది గోదాములతోపాటుమరో ఏడు గోదాములను ఏర్పాటుచేసేందుకు ఫ్లిప్‌కార్ట్ ప్రణాళికలువేస్తోంది. ఈ ఆఫర్ పొందే అవకాశం అందరికీ ఉండదని, కస్టమర్ల అంతర్గత సమాచారం ఆధారంగా ప్రత్యేక ఇసేవలకు ఎంపికచేసినవారికే అందిస్తామని ఫ్లిప్‌కార్ట్ చెపుతోంది. ప్రయోగాత్మకంగా గృహోపకరణాలపై వర్తింపచేసి తర్వాత మిగిలిన కేటగిరీలకు విస్తరిస్తామని సంస్త ప్రతినిధులు చెపుతున్నారు. ఎంపికచేసిన కస్టమర్లకు ఇమెయిల్‌ద్వారా ఆఫర్ తెలియజే స్తామని కంపెనీ చెపుతోంది. దీనితోపాటు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, స్పెషల్ ఆఫర్లు ఎప్పటిలాగే ఉంటాయని ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది.

పోటీపరీక్షలకోసం 'మ్యాడ్‌గైలాబ్స్' యాప్

హైదరాబాద్, ఆగస్టు 6: భారత్‌లో వివిధ పోటీపరీక్షలకు సన్నద్ధంకావడంలో తిరుగులేనిపరిష్కారం అందిస్తున్న మాడ్‌గే లాబ్స్ యాప్ అద్భుత సమాచారం అందిస్తోంది. ఐఐటి రూర్కీ పూర్వవిద్యార్థులు అలోక్ కతియార్, సంజయ్ జగర్‌వాల్, విశాల్‌మీనా తమ కలల ప్రాజెక్టుగా ఈయాప్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటురంగ ఉద్యోగపరీక్షలు రాసే అభ్యర్థులకు ప్రతి అడుగులోనూతోడుగా నిలిచేలా రూపొందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకేవేదికపైకి వచ్చే అవకాశాన్నిమ్యాడ్‌డై లేబ్స్ అందిస్తోంది. ఇంగ్లీష్, మరాఠి, బెంగాలి, తమిళ తెలుగు భాషల్లో ఈయాప్ పనిచేస్తుంది. ఐబిపిఎస్, ఆర్ఆర్‌బి, ఎస్ఎస్‌సి, రైల్వేస్, స్టేట్ పిఎస్‌సిలాంటిపరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావడాన్ని ఇది తేలికచేస్తోంది.పుట్టగొడుగుల్లా వస్తున్న సంస్థలు విద్యార్థులను సందేహాల్లోనికి నెట్టివేస్తున్న తరుణంలో అభ్యర్థులు హిందీలేదా ఇంగ్లీష్‌లలో ఉండే స్టడీమెటీరియల్‌చదువుతారని, అందుకోసం అందుబాటులోకి మాడ్‌గైల్యాబ్స్ యాప్‌ను తెచ్చినట్లు సంస్థ సహవ్యవస్థాపకుడు అలోక్ కతియార్ వెల్లడించారు. అభ్యర్థులకు అవసరమైన మేరకు పరీక్షల సన్నద్ధ సమాచారాన్ని అందిస్తామని, నాలుగు విభిన్న భాషల్లో పరీక్షలుంటాయని అన్నారు.

కేరళలో కమ్యూనిస్టులది రక్తచరిత్ర

ఆరెస్సెస్ కార్యకర్త హత్యను ఖండించిన జైట్లీ

మృతుని కుటుంబానికి మంత్రి పరామర్శలు

దాడి చేసిన సిపిఎం కార్యకర్తలకు ప్రభుత్వ అండ ఉందని ఆరోపణ

తిరువనంతపురం, ఆగస్టు 6 : కేరళలో కమ్యూనిస్టులు హత్యారాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రత్యర్థి పార్టీలకు చెందిన నేతలు కార్యకర్తలపై దాడులకు దిగి, వారి రక్తాన్ని కళ్లచూడటం పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేసారు కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ. గతనెల 29న హత్యకు గురైన ఆరెస్సెస్ కార్యకర్త రాజేష్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా జైట్లీ మీడియాతో మాట్లాడుతూ, కేరళలో ఆరెసెస్, బిజెబి కార్యకర్తలపై అధికార కమ్యూనిస్టు పార్టీ దాడులను ప్రోత్సహిస్తోందని, రాజేష్ హత్య ఈ క్రమంలోనే జరిగిందని, అలాగే ఎనిమిది నెలల క్రితం మరో ఆరెస్సెస్ నేత జయప్రకాష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, ఇప్పటికీ ఆయన కోలుకోలేకున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. సిపిఎం పార్టీకి చెందిన కార్యకర్తల రాజేష్‌ని హత్య చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయని, ఆతని శరీరంపై 89 తీవ్రగాయాలున్నట్లు వైద్యుల నివేదికలు ఇచ్చారంటే ఎంత అనాగరికంగా, అత్యంత క్రూరంగా హత్యజరిగిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, మృతుని కుటుంబాన్ని అదుకునేందుకు కేవలం కేరళ కార్యకర్తలే కాదు యావత్ దేశం మీతో ఉందన్న భరోసా మృతుని కుటుంబానికి ఇచ్చారు. దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలలో చిన్నపాటి దాడి జరిగినా పార్లమెంటును పనిచేయటానికి సహకరించని పార్టీలు తమ నేతృత్వంలో జరుగుతున్న హత్యాకాండ గురించి ఎందుకు మౌనంగా ఉంటున్నాయని కమ్యూనిస్టు పార్టీ నేతలని నిలదీసారు మంత్రి జైట్లీ. ప్రత్యర్థి ఇళ్లపై దాడులు చేయటం, హింసాకాండలతో ఇళ్లని తగుల బెడు తున్న సిపిఎం గూండాల చర్యలు ఉగ్రవాదానికి మించి ఉన్నాయని ఈ తరహా దాడులు శత్రుదేశా లపైనా జరిగి ఉండవని వ్యాఖ్యానించారు. సిపిఎం కార్యకర్తల దాడి, హత్య ఘటనల్లో పోలీసులు కేసులు నమోదు చేసి ఊరుకోవాలని ప్రభుత్వం వత్తిడి చేస్తోందని, తమ పార్టీ కార్యకర్త లకు అండగా నిలుస్తూ, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం దర్యాప్తులు అడ్డుకుంటోందని ఆరోపించారు మంత్రి జైట్లీ.



కేరళలో హత్యకు గురైన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త రాజేష్ కుటుంబాన్ని ఆదివారం పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ

మా వాళ్లనీ పరామర్శించండి

అరుణ్ జైట్లీ ఎదుట సిపిఎం ప్రదర్శన

మంత్రి ఆరోపణలను ఖండించిన కమ్యూనిస్టు నేతలు

అమిత్‌షా వచ్చాక కాషాయ గూండాలు రెచ్చిపోతున్నారని ఆరోపణ

తిరువనంతపురం, ఆగస్టు 6 : దేశంలోనే అత్యంత ఉన్నతంగా ఉండే రాష్ట్రంలో పాగా వేయాలని బిజెపి భావిస్తోందని, ప్రశాంతంగా ఉండే ప్రాంతాలలో మంత్రులను పర్యటింప చేసి ప్రజలను రెచ్చగొడుతోందని సిపిఎం కేరళ రాష్ట్రపార్టీ కార్యదర్శి కోటియరీ బాలకృష్ణన్ ఆరోపించారు. ఆదివారం కేరళలో ఆరెస్సెస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శలకు వచ్చిన కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ఆరోపణలను నిరసిస్తూ రాజ్‌భవన్ ముందు సిపిఎం నేతలు భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా బాలకృష్ణన్ మాట్లాడారు. కాషాయ ఎజం డాతో హింసాత్మక వాతావరణాలను సృష్టించడంలో బిజెపి అగ్రగామి అని, ఇటీవల అమిత్‌షా పర్యటన తదుపరి కేరళలో సిపిఎం పార్టీ కేడర్‌పై రాజకీయ దాడులకు బిజెపి పాల్పడుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఆరెస్సెస్-బిజెపీలు రాజకీయ హింసపై తప్పుడు ప్రచారం ప్రారంభించాయని ఆరోపించారు. ఆరెస్సెస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన జైట్లీ బిజెపి వారి చేతిలో చనిపోయిన 21 మంది కమ్యూనిస్టు కార్యకర్తల కుటుంబాలను, బంధువులను పరామర్శించాలని డిమాండ్ చేసారాయన. రాజేష్ హత్యకేసును విచారించేందుకు ముఖ్యమంత్రి పినారాయ్ విజయన్ జూలై 30న రాష్ట్ర డిజిపి లోక్నాథ్ బెహ్రా నేతృత్వంలో ప్రత్యేక కమిటీని నియమించిందని, హత్యకేసుతో సంబంధాలున్నట్లు ఆరోపణలున్న వారిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు వివరించారాయన. అమిత్‌షా పర్యటన తదుపరి పెరిగిన హింస, జైట్లీ పర్యటనతో మరింత వేగం పుంజుకునే ఆస్కారం ఉందని ఆగ్రహం వ్యక్తం చేసారు. జూలై3న కాషాయగూండాల చేతిలో గాయపడిన శ్రీజన్‌బాబుకు ఏడు శస్త్ర చికిత్సలు జరిగినా మృత్యువుతో పోరాడి ఓడిపోయాడని, కేవలం సైద్ధాంతిక విభేదాలతో కాకుండా రాజకీయ ప్రేరణలు, ఉద్దేశ పూర్వకంగా రెచ్చగొట్టే బిజెపి, ఆరెస్సెస్ నేతల ప్రసంగాల కారణంగానే పార్టీ నేతలతపై దాడులు జరుగుతున్నట్లు కనిపిస్తోందని, ఇప్పటికే ఆరెస్సెస్ కార్యకర్త హత్య కేసుపై విచారణ జరుగుతోందని వివరించారు బాలకృష్ణన్.



ఆదివారం కేరళకు వచ్చిన కేంద్ర మంత్రి జైట్లీ తమ పార్టీ కార్యకర్తలనీ పరామర్శించాలంటూ రాజ్‌భవన్ ముందు నిరసనకు దిగిన కేరళ సిపిఎం నేతలు, కార్యకర్తలు

రాహుల్‌పై రాళ్లదాడి కేసులో

ముగ్గురు బిజెపి కార్యకర్తల అరెస్టు

బుల్లెట్‌ప్రూఫ్ రాహుల్ వద్దన్నారన్న ప్రభుత్వం - కేసు తేల్చకుంటే ప్రధానికి గాజులు పంపిస్తామన్న కాంగ్రెస్

గాంధీనగర్, ఆగస్టు 6 : గుజరాత్ వరదబాధితుల పరామర్శలకు వచ్చిన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీపై జరిగిన రాళ్లదాడి కేసులో మరి ముగ్గురు భారతీయ జనతాపార్టీకి చెందిన కార్యకర్తలని అరెస్టు చేసినట్లు బనాస్కాంత పోలీసులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ధనరా సర్కిల్ ఇనస్పెక్టర్ జెఎస్ ఖాంత్ ఆదివారం మీడియాకు వివరిస్తూ, అధికార బిజెపి పార్టీకి చెందిన కార్యకర్తలైన భగవాన్ దాస్ పటేల్, మోర్ సింగ్ రావు, ముఖేష్ తగ్గర్‌లను ఈ ఘటనలో పాల్గొనట్లు గుర్తించి అరెస్టు చేసినట్లుచెప్పారు. ఇప్పటికే ఇదే కేసులో బిజెపి యువజన విభాగ కార్యదర్శి జాయేల్ డార్జిని అరెస్టు చేసామని, మరి కొందరిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అరస్టయిన వారిపై చట్టపరిధిలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రాహుల్ సాధారణకారు వాడారు...

గుజరాత్ వరదబాధిత ప్రాంతాలలో పర్యటనకు వచ్చిన రాహుల్‌గాంధీకి భద్రతా నిబంధనల మేరకు బుల్లెట్ ప్రూఫ్ కారు అందుబాటులో ఉంచామని, అయితే తను కార్యకర్తలతో కలసి వారి కారులోనే వెళ్లానని ప్రభుత్వ వాహనాన్ని తిరస్కరించారని ప్రోటోకాల్ అధికారులు మీడియాకు తెలిపారు.

మోడీ, అమిత్‌షాలకు గాజులు

తమ పార్టీ నేతపై రాళ్లదాడికి దిగిన వారిని పట్టుకోలేమని ప్రధాని, అమిత్‌షా ప్రకటిస్తే, వారికి గాజులు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని, గోవా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ప్రతామాకౌటినో ప్రకటించారు. దాడి జరిగి రెండు రోజులు దాటుతున్నా నిర్దిష్ట అరెస్టులు చూపకుండే ఉండేలా గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం అడ్డుపడుతోందని ఆమె ఆరోపించారు. వరద బాదితులను పరామర్శించేందుకు వచ్చిన వ్యక్తి కారుపై వెనుకవైపు నుంచి దాడి చేయటం పిరికి బందల చర్యల అని వ్యాఖ్యానిస్తూ, దాడికి సంబంధించి ప్రధాని నుంచి కానీ అమిత్‌షా నుంచి కానీ కనీసం ఖండన ప్రకటన వెలువడక పోవటం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేసారు. బిజెపి, ఆరెస్సెస్‌లు చేసే రాజకీయాలు ఇలానే ఉంటాయని వ్యాఖ్యానించారు కౌటినో. విపక్ష నేతపై సొంత పార్టీ వారే దాడి చేసినా వారిని పట్టుకోలేని పరిస్థితి నెలకొందని, ప్రధానితో పాటు బిజెపి నేతలకు గాజులు కానుకగా పంపిస్తామన్నారామె.



ఇద్దరు ఐపిఎస్‌ల తొలగింపు

సేవల్లో ప్రతిభ, విధి నిర్వహణలో వైఫల్యమే ప్రధాన కారణం

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ సిఫార్సులకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

మీ సేవలు ఇక చాలంటూ హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు

న్యూఢిల్లీ, అగస్టు 6 : విధినిర్వహణలో తమ ప్రతిభాపాటవాలు చూపని అధికారులను తొలగించే నిర్ణయాన్ని ఛత్తీస్ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ క్రమంలో చత్తీస్‌ఘడ్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఐపిఎస్ అధికారులను నాన్-పెర్మాఫర్మన్స్ పేరుతో విధుల నుంచి తొలగిస్తున్నట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ముఖ్యమంత్రి రమణ్ సింగ్ మీడియాకు వివరించారు.

1983లో పోలీసు శాఖలో చేరిన ఏఎం ఝూరీ 2000- బ్యాచ్‌కి ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారిణిగా ఎంపికై పదోన్నతి పొందింది. అలాగే 2002 బ్యాచ్ ఐపిఎస్ అధికారి కెసి అగర్వాల్‌లు రాష్ట్ర పోలీసు సేవలో చేరారని, అయితే ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్- 1958 మేరకు వారి 15 ఏళ్ల సర్వీసును పూర్తిగా సమీక్షించామని, ప్రజల ఆశలకు విరుద్ధంగా వారికి సేవలందించడంలో పూర్తిగా విఫలమవుతు న్నందున ఈ ఇద్దరు ఐపిఎస్ అధికారులను తొలగించేందుకు అనుమతులు కోరుతూ చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం తరపున కేంద్రానికి నివేదించినట్లు సిఎం వివరించారు. ఈ నివేదికను ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రి మండలి సమీక్షించి, రాష్ట్ర ప్రభుత్వ వినతి సహేతుకమేనని నిర్ణయానికి తమ ఆమోద ముద్ర తెలియ జేసింది. దీంతో హోంమంత్రిత్వశాఖ నుంచి అగర్వాల్, ఝూరీలను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు రాష్ట్రప్రభుత్వం వెల్లడించింది. ఇద్దరూ డిఐజి స్థాయి ర్యాంకు అధికారులేనని, అయితే గత 15 ఏళ్లుగా వీరి విధి నిర్వహణ వైఫల్యతను పరిగణలోనికి తీసుకుని తొలగించేందుకు సిద్ధమైనట్లు తెలిపింది. కాగా ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ మేరకు ప్రతి అధికారి పనితీరును 15 సంవత్సరాల సేవల తదుపరి 25 సంవత్సరాల తరువాత సమీక్షించి మూడు నెలల ముందు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి సదరు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తుంది. ఆపై అధికారి ప్రవర్తనపై విచారణ తదుపరి రాష్ట్రప్రభుత్వం మరో నివేదికను అందిస్తుంది. దీనిపై కేంద్రం తగిన చర్యలు తీసుకుంటుంది.



ఇప్పటికే ఇద్దరు అధికారుల ఔట్

ఛత్తీస్‌గడ్‌లోని రమణ్‌సింగ్ ప్రభుత్వం గత జనవరిలోనూ ఇద్దరు అధికారులపై దుష్ప్రవర్తన ఫిర్యాదులపై విచారించి 1992 చత్తీస్‌గడ్ కేటర్ అధికారి రాజ్‌కుమార్ దేవంగాన్‌ని, 1998 బ్యాచ్ యూనియన్ టెరిటరీ కేడర్ అధికారి మయాంక్ షీల్ చోహాన్‌లని ఇదే విధంగా సేవల నుంచి తొలగించిన విషయం విదితమే.

అక్రమ ఆయుధాల వ్యాపారి 'వనీ' అరెస్ట్

మనీలాండరింగ్ కేసులో ఇడి సమన్లు నిరాకరణ

శ్రీనగర్ నుంచి ఢిల్లీకి తరలింపు - నేడు కోర్టుకు



కాశ్మీర్, ఆగస్టు 6 : మనీలాండరింగ్ కేసులో పలుమార్లు సమన్లు జారీ చేసినా ఈడి ముందు హాజరయ్యేందుకు ఇష్టపడని వేర్పాటువాద నేత అస్లాం వనీని ఇడి అధికారులు అరెస్టు చేసారు. ఆదివారం ఉదయం శ్రీనగర్‌లోని ఆతని నివాసంపై స్థానిక పోలీసుల సహాయంతో దాడి చేసిన అధికారులు వనీని అదుపులోనికి తీసుకున్నట్లు మీడియాకు వివరించారు. ఇప్పటికే వనీ మనీలాండరింగ్ కేసులలో విచారణలకు హాజరు కాకపోవటంపై ఢిల్లీ హైకోర్టు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లు జారీ చేసిందని, సమన్లు అందుకున్నప్పటికీ ఆయన కోర్టు ముందుకు వచ్చేందుకు అంగీకరించక పోవటం వల్లే అరెస్టు అనివార్యమైందని చెప్పారు. అక్రమ ఆయుధాల వ్యాపారిగా పేరుగాంచిన వనీ దశాబ్ద కాలంగా మనీల్యాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, తాజా అరెస్టు నేపథ్యంలో ఇప్పటికే తమ అదుపులో ఉన్న కాశ్మీర్ వేర్పాటు నేత షబీర్‌షాతో కలిపి విచారిస్తే అనేక కేసుల చిక్కుముడి వీడుతుందని భావిస్తున్నట్లు ఇడి అధికారి ఒకరు తెలిపారు. అరెస్టు చేసిన వనీని ఢిల్లీ తరలించినట్లు వివరించారు.

అమర్‌నాథ్ యాత్రికుల బస్సుపై దాడి కేసులో

మరి ముగ్గురు అరెస్టు

ఒకరు కాశ్మీరీ, ఇద్దరు పాక్ జాతీయులుగా గుర్తింపు

దాడి తదుపరి ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చినట్లు ఆరోపణలు



జమ్ము, ఆగస్టు 6 : అమర్నాథ్ యాత్రీకులబస్సుపై జూలై 9న దాడి చేసి ఎనిమిది మంది మరణానికి కారణమైన ఘటనలోమరి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రకటించింది. ఈ మేరకు జమ్మూకాశ్మీర్ పోలీసు అధికారి మునీర్‌ఖాన్ వివరాలను మీడియాకు వివరిస్తూ, ఆదివారం స్థానిక పోలీసుల సహాయంలో ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వటంతో పాటు వాహనాలు అందు బాటులో ఉంచిన వారిని గుర్తించామని వీరిలో స్థానికంగా ఉండే ముగ్గురి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దాడి అనంతరం పోలీసుల కంటబడకుండా వీరిని జూలై 10 వరకు తమ ఇళ్లలో ఉగ్రవాదులను ఉంచారని, వాహనాలను తెరచాటుకు పంపారని వివరించారు. అయితే అరెస్టయిన ముగ్గురిలో స్థానిక వ్యక్తిగా ఒకరిని గుర్తించామని, మరి ఇద్దరు పాకిస్థాన్ నుంచి ఇటీవలే వచ్చి ఇక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. మరోవైపు యాత్రీకులపై దాడి పథకానికి వ్యూహారచన చేసిన ఉగ్రవాది అబూఇస్మాయిల్‌తో పాటు యార్వారీ చిత్రాలను మీడియాకు అందించారు.

ప్రధాని రక్షణకు ప్రత్యేక జాగిలాలు

భద్రతా బలగాలలో వచ్చి చేరిన స్నిఫర్ డాగ్స్ - ఇజ్రాయెల్ సైనిక విభాగంలో శిక్షణ

న్యూఢిల్లీ, ఆగస్టు 6 : ఎస్‌పిజీ భద్రత కలిగిన వారి రక్షణకు సరికొత్త డాగ్‌స్క్వాడ్‌ని రూపొందించే పనిలో రక్షణశాఖ పడింది. ఈమేరకు ఇజ్రాయోల్‌నుంచి ఆదివారం ప్రత్యేక భద్రతాదళ పరిధిలోనికి స్నిఫ్ అండ్ అటాక్స్ పేరుతో పిలిచే జాగిలాలను తీసుకువచ్చి చేర్చింది. గత కొంతకాలంగా ఇజ్రయిల్‌నుంచి కానైన్స్, లాబ్రెడార్, జర్మనషెఫెర్డ్స్, బెల్జియం మిలినోయిస్ తదితర జాతి జాగిలాలను 30 వరకు సేకరించి భద్రత కోసం వినియోగిస్తున్నట్లు సీనియర్ భద్రతాదళ అధికారి వివరించారు. నేరస్తులను ఇట్టే పట్టేయగల సత్తా బెల్జియన్ మలినోయిస్ జాతి కుక్కల సొంతమని, ఇది పేలుడు పదార్థాలను కనిపెట్టడంతో పాటు బాంబులను పసిగట్టగల సామర్థ్యం ఉన్నవని చెప్పారు. వీటితో పాట గత పదేళ్లుగా ఇజ్రయిల్ మిలటరీలో ప్రత్యేక శిక్షణ పొందిన కానైన్ జాతికి చెందిన శునకాలను సైతం సేకరించినట్లు వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీపై ఉగ్రవాదుల నుంచి ముప్పు ఉండే అవకాశాలున్నట్లు నిఘావర్గాల హెచ్చరికలతో ఈ ప్రత్యేక జాగిలాలు రప్పించినట్లు వివరించారు. ప్రధానితో పాటు మాజీ ప్రధానులు, ఎస్‌పిజి భద్రత ఉన్న కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీలు రక్షణలో భాగంగా ఈ జాగిలాలను వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే జాగిలాల ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు దేశంలోనే అత్యున్నత సేవలందించే ఛండీ గఢ్‌లోని భానులో ఉన్న పారామిలటరీ బోర్డర్ ఫోర్సుకు చెందిన జాగిలాల శిక్షణా కేంద్రం ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ఇజ్రాయోల్ అధికారులు సహకరిస్తారని వివరించారు.



ఛలో గుజరాత్

బెంగళూరు రిసార్టుకు గుడ్ బై

ఇంటిదారి పడుతున్న కాంగ్రెస్ సభ్యులు

ప్రత్యేక బస్సులలో గాంధీనగర్‌కు తరలింపు

బెంగళూరు, ఆగస్టు 6 : రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో గుజరాత్ కాంగ్రెస్ సభ్యులతో బెంగళూరులో క్యాంప్ రాజకీయాలు చేసిన కాంగ్రెస్‌పార్టీ తాజా రాజకీయ పరిణామాలతో వారందరినీ స్వంతరాష్ట్రానికి పంపేటందుకు చర్యలు చేపట్టింది. ఈనెల8వ తేదీన రాజ్యసభ ఎన్నిక జరగనుండటంతో ప్రస్తుతం బెంగళూరులోని ఈగల్టన్ రిసర్ట్‌లో బసచేసిన 44 మంది కాంగ్రెస్ శాసనసభ్యులను సోమవారం సాయంత్రం ప్రత్యేక బస్సులలో గుజరాత్ తరలించనుంది. తమ పార్టీ శాసనసభ్యులను ఒక్కొక్కరికీ 15 కోట్ల రూపాయలు చొప్పున ఇచ్చి కొనుగోలు చేసేందుకు బిజెపి ఆఫర్లు ఇచ్చిందని, ఇప్పటికే ఆరుగురు సభ్యులను తమవైపుకు తిప్పుకున్న ఆ పార్టీనుంచి సభ్యులను రక్షించేందుకు బెంగళూరు రావాల్సి వచ్చిందని చెప్పారు కాంగ్రెస్ ఎమ్మెల్యే శైలేష్‌పార్మర్. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ శాసనసభ్యులపై ఆశల జల్లు కురిపిస్తున్న బిజెపిని ధీటుగా ఎదుర్కొంటామని, తమ పార్టీ అభ్యర్థి అహ్మద్ పటేల్‌ని ఖచ్చితంగా గెలిపించుకు తీరుతామని స్పష్టం చేసారు. ఈ క్రమంలో కాంగ్రెస్ శాసనసభ్యులు సోమవారం బెంగళూరులో బయలుదేరి మంగళవారం నేరుగా ఓటింగ్‌లో పాల్గొనేలా అన్ని ఏర్పాటు పూర్తిచేసారు కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మనుసింఘ్వి. బెంగళూరులో గుజరాత్ సభ్యులను తన సొంత రిసార్టులలో ఉంచినందునే కన్నడ మంత్రిపై కేంద్రం ఐటి విభాగాన్ని ఉసిగొలిపి దాడులు చేయించిందని ఆరోపించారు. నిజాయితీగా వ్యాపారం చేసుకుంటున్న మంత్రిపై ఉద్దేశ పూర్వకంగానే మోడీ సర్కారు చేస్తున్న దాడులను ధీటుగా ఎదుర్కొంటామని అన్నారు. కాగా అహ్మద్ పటేల్ విజయం సాధించేందుకు 44 సభ్యుల బలం అవసరం కాగా ప్రస్తుతం కాంగ్రెస్‌కు 51 సభ్యుల బలం ఉంది.

ఇటీవల కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరిన శాసనసభ్యుడు బల్వంత్ సింగ్ రాజ్‌పుత్ ప్రస్తుత రాజ్యసభ ఎన్నికలలో అహ్మద్ పటేల్‌కు పోటీగా నిలవటంతో కాంగ్రెస్ పార్టీ ఆందోళన చెందుతోంది. బిజెపి ప్రలోభాలకు దూరంగా కాంగ్రెస్ తన సభ్యులను తీసుకు వెళ్లినా, ఎన్నికల నాటికి రాజ్‌పుత్ ప్రభావానికి కొందరినైనా లొంగదీసుకుని ఇతర ఓట్లతో గట్టెక్కించాలని బిజెపి వ్యూహాలు రచిస్తోంది. కాగా బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సైతం గుజరాత్ నుంచి రాజ్యసభకు పోటీకి దిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రేపు జరగనున్న ఎన్నికలలో గెలుపు ఓటములు ఎవరిని వరిస్తాయో చూడాలి.

అద్దెలలో అక్రమాలు..జేబులు నింపుకుంటున్న ముతావలీలు

వక్ఫ్ ఆస్తులన్నీ అన్యాక్రాంతం

నగరం నడిబొడ్డునే ఆక్రమణల పర్వం

హైదరాబాద్, ఆగష్టు 5, ప్రభాతవార్త : రక్షకులే భక్షకులుగా మారితే.. చివరకు మిగిలేది ఏముంటుంది..? ప్రజల ఆస్తులను రక్షించి ప్రజ లకు మేలు జరిగేలా చూడాల్సిన వారే తమ జేబులు నింపుకోవడానికి, రెండు చేతులా ఆర్జించడానికి కొంత మంది ముతవల్లీలు తెరలేపిన అక్రమాలకు వక్ఫ్‌బోర్డుకు అపార నష్టాన్ని కల్గించింది. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా యధేచ్ఛగా జరిగిన ఆక్రమణలకు నేడు తెలంగాణ రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులు కరిగి పోతూ వచ్చాయి. ఆక్రమణల వెనుక అధికారులు, ప్రజా ప్రతినిధుల ప్రమేయం కూడ ఉందనే ఆరోపణలు ఒకపైపు ఉంటే అతి తక్కువ అద్దెతో ఏళ్ళ తరబడి వక్ఫ్ ఆస్తులను అనుభవిస్తున్న వారు అద్దె పేరుతో అక్రమణలకు పాల్పడ్డ అనేక సంఘటనలు ఉన్నాయి. ఆస్తులకు రక్షణగా ఉండాల్సిన ముతవల్లీలు వారికి సహాయ సహకారాలు అందించడం పరిపాటిగా మారింది. వక్ఫ్‌బోర్డు అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంతో విలువైన వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంత మయ్యాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కోట్లాది రూపాయల విలువైన వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమైనా వాటిని పరిరక్షించుకోవడంలో బోర్డు అధికారులు దృష్టిసారించిన దాఖలాలు లేవు. నగరం నడిబోడ్డున ఇలాంటి ఆక్రమణల పర్వం బోర్డు అధికారులకు ముప్పతిప్పలు పెడుతోంది. అద్దె పేరుతో పెద్ద ఎత్తున ఆక్రమణాలు జరుగగా ఆలస్యంగా మేల్కొన్న బోర్డు అధికారులు వాటిని తొలగించేందుకు కార్యాచరణకు పూనుకోవడం పెద్ద దుమారాన్నే రేపింది. యూసుఫేన్ దర్గాకు చెందిన వక్ఫ్ స్థలంలో ఏళ్ళ తరబడి అనుభవిస్తున్న అద్దెదారులు కనీసం 170 స్టాల్స్ వరకు నిర్వహిస్తున్నారు. వీరు అద్దె పేరుతో స్థానిక స్మశానాన్ని ఆక్రమించుకునా న్నరని వారి ఆక్రమణలను తొలగించేందుకు ఇటీవల కొత్తగా ఏర్పడిన వక్ఫ్‌బోర్డు నోటీసులు జారీ చేసింది. యూసుఫేన్ దర్గాను అభివృద్ధి పరుచేందుకు ఆక్రమణలు తొలగించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో అద్దెకుంటున్న షాపు యజమానుల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదరయ్యింది. ఇంతకు ముందు ఈ దర్గాకు ముతవల్లీగా ఉన్న ఫైసల్ అలీ షాకు రూ. లక్ష నుండి 5 లక్షల వరకు ఒక్కొక్కరు డబ్బులు ముట్టచెప్పినట్లు షాపు యజమానులు అంటున్నారు. ఈ షాపుల పై ఆధారపడి చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న తమను ఉన్నట్టుండి ఖాళీ చేయాలంటే ఎలా అని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముతవల్లీ లక్షలాది రూపాయలు తీసుకొని తన జేబు నింపుకోగా వక్ఫ్‌బోర్డుకు ఏలాంటి ఆదాయం సమకూరక పోవడం గమనార్హం. గతంలో కొంతమంది షాపు యజమానులు కోర్టును ఆశ్రయించగా అప్పటి వక్ఫ్‌బోర్డు స్పెషల్ ఆఫీసర్ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ వారి నుండి అద్దె ను అంగీకరించారు. అప్పటి నుండి వారు క్రమం తప్పకుండా నెలకు రూ.6,000 చొప్పున అద్దెను ముతవల్లీకి చెల్లిస్తూ వచ్చినట్లు షాపు జయమానులు పేర్కొంటున్నారు. ఇక్కడి ముతవల్లీ ఫైసల్ షా పై అనేక ఆరోపణలు ఉనా న్నయి. దీంతో అతడిని తొలగించారు. ఇక్కడ దశాబ్దాల తరబడి చిరువ్యాపారాలు చేసు న్న వారు అనేక మంది ఉన్నారు. తమను ఉన్నట్టుండి ఖాళీ చేయమంటే ఎక్కడికి పోయేదని వారు నిలదీస్తున్నారు. తాను రూ.1.5 లక్షలు చెల్లించానని ఓ వ్యాపారి తెలిపారు. నాలుగేళ్ళ క్రితం తన వద్ద ముతవల్లీ రూ. 2.5 లక్షలు తీసుకున్నారని మొహమ్మద్ సిరాజ్ అనే వ్యాపారి తెలిపారు. మొహిసిన్, హామీద్ కుటుంబాలు కూడా రెండేసి లక్షల చొప్పున ముతవల్లీకి చెల్లించినట్లు తెలిపారు. ఇక్కడ నిర్వహిస్తున్న షాపుల్లో కనీసం 40 షాపులు అక్రమంగా ఉన్నాయని వక్ఫ్ అధికారులు గుర్తించారు. వాటిని తొలగించేందుకు నోటీసులు జారీ చేశారు. అయితే వారందరు చిరువ్యాపారులు కావడం, ముతవల్లీకి లక్షలాది రూపాయలు ముట్ట చెప్పిన వారు కావడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అనేక ఆక్రమణలు వక్ఫ్‌బోర్డు ముతవల్లీలు, అధికారుల సహకారంతో జరిగాయనే విషయం ఈ ఘటన తేటతెల్లం చేస్తోంది.

నష్టాల్లో వేరుశెనగ రైతు

తగ్గుతున్న పంట విస్తీర్ణం
వంట నూనెపై ప్రభావం
ప్రత్యామ్నాయంవైపు దృష్టి

హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో వేరుశెనగ రైతులు కష్టకాలంలో కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్రంలో వేరుశెనగ పంట విస్తీర్ణం క్రమేపీ తగ్గిపోవడంతో రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో వలసబాట పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వరి పంట తరువాత అత్యధికంగా సాగు జరిగే పంటల్లో వేరుశెనగ ప్రధానమైనదిగా రైతులు చెబుతున్నారు. దక్షిణ భారత ధాన్యాగారం కృష్ణా, గోదావరి డెల్టాలయితే, దక్షిణ భారత దేశం మొత్తానికి ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాల నుండే వేరుశెనగ పంట నూనెను అందించే ప్రాంతాలుగా గుర్తింపు ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో 2014-15 సంవత్సరంలో 69.4 శాతం ఉన్న వేరుశెనగ సాగు 2016-17లో 3.21 శాతానికి తగ్గిపోయినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో వేరుశెనగ సాధారణ విస్తీర్ణం 10,74,483 హెక్టార్లుకాగా ప్రస్తుత ఖరీఫ్‌లో 8.50 లక్షల హెక్టార్లలో ఈ పంటను వేయాలని ప్రభుత్వం లక్ష్యంతో ఉంది. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా ఇప్పటి వరకూ కేవలం 2.89 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులతో వేరుశెనగ సాగు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ ఖరీఫ్ సీజనులో రాష్ట్రంలో వేరుశెనగ విస్తీర్ణం 5.50 లక్షల హెక్టార్లకు దాటే అవకాశం ఎంత మాత్రం లేదని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో వేరుశెనగ విస్తీర్ణం క్రమేపీ తగ్గిపోతుండడం ప్రభుత్వవర్గాలను కలవరపరుస్తున్నాయి. గత కొన్నేళ్లుగా వ్యవసాయం దెబ్బతినడంతో వేరుశెనగ పంట విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులలో వేరుశెనగ పంటపై దాని ప్రభావం తీవ్రంగా చూపించింది. సాగు జరిగిన ప్రాంతాల్లో కూడా అత్యధిక భాగం వర్షాభావంతో పూర్తిగా నష్టపోవడంతో అందుకు అనుగుణంగా ఉత్పత్తి పడిపోతోందని రైతులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో వేరుశెనగ విస్తీర్ణం రానురాను తగ్గిపోతోంది. 2013-14 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 8,77,112 హెక్టార్లలో వేరుశెనగ సాగుకాగా, 2014-15లో 7,46,776 హెక్టార్లు, 2015-16 సంవత్సరంలో 6,65,256 హెక్టార్లలోను, 2016-17 సంవత్సరంలో 6,13,036 హెక్టార్లలోనూ సాగు చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 5.50 లక్షల హెక్టార్లకు మించి సాగు అయ్యే వీలు లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా వేరుశెనగను అనంతపురం జిల్లాలో సాగు చేస్తుండగా, ఆ తర్వాత స్థానంలో చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాలు ఉన్నాయి. ఈ ఖరీఫ్ సీజనులో అన్ని పంటలూ కలిపి అనంతపురం జిల్లాలో 8,37,503 హెక్టార్లలో సాగు చేయాలనే లక్ష్యానికిగాను ఇప్పటి వరకూ



1,62,185 హెక్టార్లలో సాగైంది. అలాగే కడప జిల్లాలో 1,51,120 హెక్టార్ల లక్ష్యానికి 22,840 హెక్టార్లు, కర్నూలు జిల్లాలో 5,91,102 హెక్టార్ల లక్ష్యానికి ఇప్పటి వరకూ 2,64,775 హెక్టార్లలో అన్ని పంటలూ సాగైయ్యాయి. ఇందులో వేరుశెనగ సాగును పరిశీలిస్తే అనంతపురం జిల్లాలో 6,95,753 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికిగాను 2016 సంవత్సరంలో 4.21 లక్షల హెక్టర్లలోనూ, చిత్తూరు జిల్లాలో 1,36,479 హెక్టార్లకుగాను 1,08,100 హెక్టార్లలోనూ, కర్నూలు జిల్లాలో 1,34,936 హెక్టార్లకు 56,751 హెక్టార్లలోనూ, కడప జిల్లాలో 76,541 హెక్టార్లలో వేరుశెనగ సాధారణ విస్తీర్ణం కాగా, 2016లో 22,934 హెక్టార్లలోనూ సాగు చేశారు. ఈఖరీఫ్‌లో ఇది మరింత తగ్గుతుందని వ్యవసాయ శాఖ అధికారులు లెక్కలు వేస్తున్నారు. కాగా ప్రకృతి వైపరీత్యాలకు తోడు ప్రభుత్వ విధానాలు రైతన్నలపట్ల శాపంగా పరిణమిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా రాష్ట్రంలో వేరుశెనగ పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెరిగిపోతున్న పెట్టుబడులు, చీడ పీడలు, పకృతివైపరీత్యాలు, తగ్గుతున్న దిగుబడులు, కరువైన ప్రభుత్వ ప్రోత్సాహం వెరసి వేరుశెనగ రైతులకు నష్టాలు మిగలడంతో ఈ పంట వేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఏటా పెట్టుబడులు పెరుగుతుండగా, దానికి అనుగుణంగా మద్దతు ధరలు లేకపోవడంతో రైతాంగం భారీగా నష్టాల్లో కూరుకుపోతున్నారు. పెట్టుబడుల నిమిత్తం తెచ్చిన అప్పులను సైతం తీర్చే పరిస్థితి కనిపించడం లేదు. కనీస మద్దతు ధరల విషయంలో వేరుశెనగ రైతులపై కక్ష కట్టినట్లు విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి గిట్టుబాటు ధరలు కల్పిస్తామని, స్వామినాధన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని ప్రకటించినా, వాస్తవంగా రెండు సీజన్లలోనూ క్వింటాలుకు కేవలం 0.75 శాతం మాత్రమే పెంచి మిగిలిన అన్ని పంటల కంటే అత్యంత తక్కువగా మద్దతు ధరలను ప్రకటించింది కేవలం వేరుశెనగకేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరుశెనగ పంటకు 2015-16లో క్వింటాకు 4,030 రూపాయలు ఉండగా, 2016-17లో క్వింటాకు 4,220 రూపాయల చొప్పున కనీస మద్దతు ధరను నిర్ణయించింది. అయితే పెట్టుబడులు మాత్రం 2015-16లో అన్ని ఖర్చులూ కలుపుకొని క్వింటాకు దాదాపు 4,310 రూపాయలుకాగా, 2016-17 సంవత్సరంలో 4,680 రూపాయల వరకూ అవుతుందని రైతులు లెక్కకడుతున్నాయి. ఈలెక్కన క్వింటాకు 460 రూపాయల చొప్పున రైతులు నష్టపోతుండగా, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండడం లేదు.

గత రెండేళ్లతోపాటు, 2016-17 ఖరీఫ్ సీజనులో కూడా రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడడంతో అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లో 245 మండలాలను కరవు మండలాలుగా అక్టోబర్ నెలలో ప్రభుత్వం ప్రకటించింది. వేరుశెనగ పంటను అధికంగా పండించే అనంతపురం జిల్లాలో 63 మండలాలు, చిత్తూరు జిల్లాలో 53 మండలాలు, కర్నూలు జిల్లాలో 36, కడప జిల్లాల్లో 32 కరవు మండలాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఆయా జిల్లాలోల వేరుశెనగ సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. దీనికి తగినట్లుగా ఒక ఎకరం సాగుకు అత్యధి కంగా విత్తనానికి ఖర్చు చేసేది వేరుశెనగ పంటకు మాత్రమే అని రైతులు అంటున్నారు. అంతేకాకుండా పూత దశ తరువాత నీరు అందకపోయి నట్లయితే తాలుకాయలు తప్ప నాణ్యమైన దిగుబడి రాదని సంబంధిత రైతులు అంటున్నారు. అదే వరి, పత్తి, పప్పు ధాన్యాలు వంటి పంటల విషయంలో పూత దశ తరువాత నీరు లేకపోయినా కనీసం సగం పంట అయినా చేతికి అందివచ్చే అవకాశం ఉంది. కానీ వేరుశెనగ పంటకు మాత్రం అటువంటి అవకాశం లేదంటున్నారు. ఈనేపథ్యంలో వేరుశెనగ పంటను వేసేందుకు రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో రాష్ట్రంలో వేరుశెనగ పంట విస్తీర్ణం తగ్గిపోగా, దిగుబడులు కూడా పడిపోతున్నాయి. దీని ప్రభావం నూనె ధరలపై తీవ్రంగా చూపనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తిరుమలలో శ్రీవారి దర్శనానికి 12 గంటలు



తిరుమల, ఆగస్టు 6 ప్రభాతవార్త: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 32 కంపార్టుమెంట్లు నిండిపోయి 12గంటలు కేటాయించారు. సాయంత్రం 6గంటలవరకు సుమారు 60,449వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేలా టిటిడి అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులు సమర్పించిన హుండీ లెక్కింపుల్లో ఆదివారం స్వామివారి ఆదాయం 2.49కోట్లు రూపాయలు చేకూరింది.

ఇక కక్షిదారులకూ డ్రెస్ కోడ్

విచారణలకు జీన్స్, చెక్ షర్టులతో వస్తే కుదరదు
హిమాచల్ హైకోర్టు సంచలన మార్గదర్శకాలు
ప్రభుత్వ అధికారులకు చెప్పాలని సిఎస్‌కి సూచనలు



న్యూఢిల్లీ, ఆగస్టు 6 : న్యాయస్థానానికి హాజరయ్యే న్యాయవాదులు నల్లకోటు, వైట్‌కాలర్‌తో ప్రత్యేక డ్రస్‌కోడ్ పాటిస్తారు. అయితే తాజాగా విచారణలకు వచ్చే కక్షిదారులు. ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు ఖచ్చితంగా డ్రస్‌కోడ్ పాటించాల్సిందేనని హిమాచల్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ తర్లోక్‌సింగ్ చౌహాన్, జస్టిస్ అజయ్ మోహన్ గోయిల్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ హిమాచల్ ప్రభుత్వ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తూ కక్షిదారులు కోర్టు విచారణలకు హాజరైనపుడు తగిన దుస్తులు ధరించేలా చర్యలు చేపట్టాలని, జీన్ ఫ్యాంటులు, చెక్ షర్టులు ధరించి రాకుండా ఉండాలంటూ మార్గదర్శకాలు నిర్దేశించింది. ఈ మార్గదర్శకాలను ప్రభుత్వ అధికారులందరికీ ఈ నిర్ణయాన్ని తెలియజేయాలనిప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. తగిన దుస్తులు ధరించి కోర్టుకు హాజరు కావటం ద్వారా కక్షిదారులు తమ కేసులపై శ్రద్ధ పెట్టడంతో పాటు న్యాయపాలనకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందని ధర్మాసనం తన ఆదేశాలలో వ్యాఖ్యానించింది. ఆదేశాలు ఉల్లంఘించే వారిపై న్యాయస్థానం క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోదని హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే ఇదే తరహా ఆదేశాలను ఏప్రియల్‌లో జార్ఖండ్ హైకోర్టు సైతం జారీ చేయటం గమనార్హం.

వలస బాటలో అమరావతి రైతులు

- అమలు కాని హామీలు, ఆదుకోని ఎపి ప్రభుత్వం

- అష్ట కష్టాలు పడుతున్న అన్నదాతలు

హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. రాజధాని కోసం భూములను త్యాగం చేసిన రైతులును సీఆర్‌డీఏ ఆదుకోకపోవడంతో వారు పొట్ట చేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస బాట పట్టారు. మూడు పంటలు పండించి ఒకప్పుడు దర్జాగా బతికిన అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల రైతులు ప్రస్తుతం అగమ్యగోచరంలో కొట్టుమిట్టాడుతున్నారు. రాజధాని నిర్మాణం నిమిత్తం రైతులు ఇచ్చిన భూములకు గాను అన్ని విధాలుగాను ఆదుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చిన సీఆర్‌డీఏ ఇప్పుడు వాటిని ఏవిధంగా ఎగవేయాలా అనే దిశగా ఆలోచన చేయడంతో వారి బతుకు ప్రశ్నార్థకమైంది. రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లోని 29 గ్రామాల్లో ల్యాండ్‌పూలింగ్ పద్దతిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఆర్‌డీఏ భూమి సేకరించింది. ఇప్పటి వరకూ 34 వేల ఎకరాల చొప్పున రైతుల వద్ద భూమిని తీసుకుంది. ఇందకుగాను సంబంధిత రైతులకు ప్రతీ ఏడాది కౌలు, ఫ్లాట్లు కేటాయించింది. అయితే రాజధానిగా ప్రకటించే సమయంలో రైతులతోపాటు, వారితో సమానంగా ఉన్న కౌలు రైతులు, రైతు కూలీలను ఆదుకుంటామని అప్పట్లో ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇప్పటి వరకూ ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా గ్రామాల్లో పలువురు రైతులు వారికున్న భూమిలో కొంత ప్రభుత్వానికి ఇచ్చి, మరికొంత అమ్ముకుని జీవనం కోసం ఉపయోగించుకుంటున్నారు. మరికొందరు రైతులు అయితే తమకున్న కొద్దిపాటి భూమిని ప్రభుత్వం తీసుకుంది. దీంతో రెండున్నర సంవత్సరాలుగా ఆయా గ్రామాల రైతాంగం వ్యవసాయ పనులకు దూరమయ్యారు. నిత్యం పొలం పనులతో హడావిడిగా గడిపే రైతన్నలు నేడు గ్రామాల్లో రచ్చ బండలు వద్ద ఖాళీగా కూర్చుంటునా న్నరు. స్థానికంగా వ్యవసాయ పనులు లేక కూలీలు కూడా నానా పాట్లు పడుతున్నారు. నెల నెలా కౌలుతోపాటు, జాతీయ ఉపాధి హామీ పధకం ద్వారా స్థానికంగా పనికల్పిస్తామన్న ప్రభుత్వం ఆ హామీని మరచిందని బహిరంగంగా విమర్శిస్తున్నారు. కూలీలకు ఇస్తామన్న 2,500 రూపాయల పెన్షన్ సైతం మూడు, ఆరు నెలలకు ఒకసారి అందుతున్నాయి. దీంతో వారంతా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా రాజధాని ప్రాంతాంలో జరిగే నిర్మాణాలు తదితర పనుల్లో స్థానికులను తీసుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ ప్రాంతాల వారినే పనుల్లోకి తీసుకుంటున్నారు. అదేవిధంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పెట్టి పనులు కల్పిస్తామన్న ప్రభుత్వం ఆవైపుగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గత్యంతరం లేక పొట్ట చేత పట్టుకుని పనులు వెదుక్కుంటూ దూర ప్రాంతాలకు తరలిపోతున్నారు. రైతులకు ఇవ్వాల్సిన కౌలు విషయంలో కోత పెడుతోందనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఇచ్చిన భూములకు సకాలంలో కౌలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు భూముల కొలతలను తగ్గించి కౌలు చెల్లిస్తున్న సీఆర్‌డీఏ తీరు వివాదాస్పదమవుతోంది. ఏటా పెరగాల్సిన కౌలును పెంచకపోగా, దాన్ని తగ్గించి చెల్లిస్తుండడం రైతాంగంలో ఆగ్రహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉన్న ఆరెకటికలను ఎస్సీ జా బితాలో చేర్చాలని ఆరె కటిక పోరాట సేవాసమితి డిమాండ్ చేసింది. తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 10 నుంచి న్యూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌వద్ద రిలే నిరాహారదీక్షలను చేపడుతున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కళ్యాణ కార్ ఈశ్వర్ చౌదరి తెలిపారు. ఆరెకటికలు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఎస్సీ జాబితాలో కొనసాగుతుండగా, మరికొన్ని రాష్ట్రాల్లో బిసి-ఎ జాబితాలోనూ కొన సాగుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 15లక్షల జనాభా ఉన్న ఆరెకటికలు బిసి-డి జాబితాలో కొనసాగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత వెనుకబడిన కులాల వారికి రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తూ చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఆరెకటికలు సామాజిక వర్గం విద్యా, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అత్యంత వెనకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరెకటికలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఈశ్వర్ డిమాండ్ చేశారు.

సింగూరు నీటికై ఎదురు చూపులు

చుక్క నీరు లేని నిజాం సాగర్ - డెడ్ స్టోరేజీకి పడిపోయిన నాగార్జునసాగర్ - ఎండిపోతున్న పంటలు

హైదరాబాద్, అగస్టు 6 ప్రభాతవార్త: అన్నదాతలకు సాగునీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాజెక్టుల కింద ప్రస్తుత ఖరీఫ్ సీజనుకు సాగునీరు పెద్ద సమస్యగా తయారైంది. కాల్వల్లో నీరు లేక ఎండిపోవడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకమవుతోంది. పంటల సాగు కోసం లక్షలాది రూపా యలను అప్పులు చేసి తెచ్చినా నీరు లేకపోవడంతో అవి ఎండిపోతున్నాయని, ఇక అప్పులు ఏవిధంగా తీర్చగలమని పలువురు రైతులు గగ్గోలు పెడుతు న్నారు. వేసిన పంటలు తడులు నీరందితేనే పంటలు చేతికందే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో మొత్తం 43,24,318 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి గాను, ఇప్పటివరకూ 31,15,439 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. ఇందులో వరి సాగు 10 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికిగాను కేవలం 6.10 లక్షల హెక్టా ర్లలో మాత్రమే నాట్లు పడినట్లు వ్యవ సాయ శాఖ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో వరుణుడు మొహం చాటేయ డంతో జలాశయాల్లో నీటిమట్టాలు అంతంత మాత్రం గానే ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 4,88,750 ఎకరాలు సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనావేయగా, ఇందులో 2.50 లక్షల ఎకరాల్లోనే వేశారు. తెలంగాణ రాష్ట్రంలోని పొద్దతిరుగుడు, ఉల్లి, ఉలవలు 25 శాతం సాగుకాగా, వరి, రాగి, వేరుశెనగ, ఆముదం సాగు 26 నుండి 50 శాతం వరకూ, సోయాబీన్, చెరుకు, మొక్కజొన్న 51 నుండి 75 శాతం, కంది, పెసర, మినుము, పసుపు, జొన్న పంటలు 76 నుండి 100 శాతం చొప్పున, పత్తి సాగు 100 శాతం సాగైనట్లు అధికారవర్గాల లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలోని గద్వేల్, సూర్యాపేట్, మంచి ర్యాల, వనపత్తి జిల్లాల్లో 50శాతం వరకూ సాగు చేయగా, మేడ్‌చర్ల్, వికారాబాద్, నిజామాబాద్, మెదక్, యాదాద్రి, వరంగల్ రూరల్, జయశంకర్, మహబూ బాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లా, ఆసిఫాబాద్ జిల్లాల్లో 51 నుండి 75 శాతం సాగుచేశారు. అలాగే రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, వరంగల్ అర్బన్, జనగాం, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో 76 నుండి 100 శాతం, మహబూబ్‌నగర్ జిల్లాలో 100 ఖరీఫ్ సాగు



చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగూరు జలాలను ఎప్పుడు విడుదల చేస్తుందా అని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు సింగూరు జలాలను విడు దల చేయాలని రైతులు ఆందోళనలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు అయినాభారీగా వర్షాలు కురవకపోవడంతో నిజామా బాద్, కామారెడ్డి జిల్లాల రైతులు సింగూరు జలాల పైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో వేసిన పంటలకు నీరెలా అందుతుందనే ఆందోళన రైతులను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. వర్షాలు లేకపోవడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి చుక్కనీరు వచ్చి చేరలేదు. ఈ ప్రాజెక్టు నుండి నీరు వస్తుందనే భరోసాతో ఆయకట్టు కింద రైతులు వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. కానీ నిజాంసాగర్ ప్రాజెక్టులో మాత్రం సాగుకు సరిపడా నీరు లేదు. ఇప్పటికే సింగూరు జలాలను విడుదల చేయాలని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తు న్నారు. వ్యవసాయ మంత్రి జిల్లాలోనే ఇటువంటి పరి స్థితి ఉంటే ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. సింగూరు నుండి 5 టిఎంసీల నీటిని విడుదలచేస్తే కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఖరీఫ్ గట్టెక్కే అవకాశం ఉందని రైతులు చెబుతు న్నారు. సింగూరు జిల్లాలను నిజాంసాగర్ ప్రాజెక్టుకు వదలకుంటే ఆయకుట్ట రైతులపై తీవ్ర ప్రభావం చూపనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కామారెడ్డి, నిజామాబాద్ జజిల్లాల ఆయకట్టు కింద సుమారు 1.10 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. బిర్కూరు, నసురుల్లాబాద్, రుద్రూరు, కోటగిరి, బోధన్ తదితర మండలాలకు చెందిన ఆయకట్టు రైతులు సింగూరు జలాల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. సింగూరులో ప్రస్తుతం నీరు సమృద్ధిగా ఉండడంతో తమ వాటా కింద రావాల్సిన 8 టిఎం సీల నీటికి బదులు 5 టిఎంసీల నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి విడుదల చేయాలని డిమాండ్ చేస్తు న్నారు. ఈ నీటిని రాష్ట్ర ప్రభుత్వం జూలై నెలలోనే విడుదల చేయాల్సిఉండగా, ఇప్పటికీ విడుదల చేయక పోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందు తున్నారు. సింగూరు జలాలను విడుదల చేస్తేనే తమ పంటలు దక్కుతాయని లేకుంటే సర్వనాశనం అవుతామని రైతులు వాపోతున్నారు. మహబూ బ్‌నగర్ జిల్లా పాలమూరు జిల్లా రైతులకు జూరాల ప్రాజెక్టు వరప్రదాయనిగా ఉన్నా ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. చెంతనే కృష్ణమ్మ ఉన్నా పంట పొలాలకు నీరందక బీడు భూములుగా మారుతున్నాయి. జూరాల ప్రాజెక్టు కింద కొన్నేళ్లుగా కుడి, ఎడమ కాల్వల కింద 1.7 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజనులో పంట కళకళలాడాల్సిన సమయంలో చుక్కనీరు లేక వెలవెల బోతున్నాయి. ఈ ఏడాది కుడి,ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేయలేదు. నాగార్జున సాగర్ ఆయ కట్టు రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. తెలంగాణతోపాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వరప్రదా యనిగా ఉన్న సాగర్ ఇప్పుడు నీళ్ల లేక వెలవెల బోతోంది. లక్షల ఎకరాల్లో నీరు, రెండు రాష్ట్రా ల్లోనూ జలవిద్యుత్‌తో వెలుగులు నింపుతున్న ఆప్రాంతం ప్రస్తుతం కళా విహీనంగా మారింది. నాగార్జున సాగర్ జలాశాయం పరిధిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దాదాపు 21 లోల ఎకరాలు సాగవుతున్నాయి. ప్రాజెక్టు చరిత్రలోనే డెడ్ స్టోరేజీ కంటే 10 అడుగుల లోతు నీటి మట్టానికి పడిపోయింది. సాగర్ కుడి, ఎడమ కాలువల పరిధిలోని లక్షలాది ఎకరాలకు సాగు నీటి సౌకర్యం ప్రశ్నార్థకంగా మారడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గతంలో ఇదే సమయానికి ఎగువ ప్రాతమైన శ్రీశైలం ప్రాజెక్టు నుండి రోజుకు 4వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరేది. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉంది. కేవలం అట్టడుగు నీటి నిల్వ సామర్థ్యం 510 అడుగుల కంటే తక్కువగా 501 అడుగులకు పడిపోయింది. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిస్థితి ఈవిధంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాగునీటి కష్టాలను ఖరీఫ్ రైతాంగం ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో 42,06,686 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు చేయాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 18,02,365 లక్షల హెక్టార్లలో సాగైంది. ఇందులో 16 లక్షల హెక్టార్లలో వరి సాగవుతుందని అంచనా వేయగా, 9.25 లక్షల హెక్టార్లలో నాట్లు పడినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో రైతాంగానికి సాగునీరు పెద్ద సమస్యగా తయారైంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులతో పాటు, పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా డెల్టాలకు నీరు అంతంతమాత్రంగా అందడంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరిగ పరిస్థితి కనిపించడం లేదు. వర్షాభావ పరిస్థితులతో అనంతపురం జిల్లాలో వేరుశెనగ పైర్లు గాలికి వడబడిపోయి, ఎండలకు మాడిపోయే పరిస్థితి ఎదురైంది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కేవలం 36 శాతం మాత్రమే రైతులు పంటలు వేశారు. కృష్ణా నదికి ఎగువ నుండి నీరు రాకపోవడంతో సాగర్ ఆయకట్టులో రైతాంగం నారుమళ్లు పోయలేదు దీంతో ఆయా ప్రాంతాల్లో వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఖరీఫ్ సాగుకు నీరు అందించడం రైతులకు పెద్ద సమస్యగా తయారైంది.

మహిళాభ్యుదయానికి ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం: డా.డి.వి.వి.శ్రీలక్ష్మీవాణి

హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త: మహిళల అభ్యుదయానికి ప్రభుత్వం ప్రోత్సాహం అవసరమని, దీనికి బ్యాంకర్లు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమెన్స్ ఎంటర్ ప్ర్యూనర్స్ అసోసియేషన్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం స్కేల్ డెవలప్‌మెంట సంస్థ జాతీయ అధ్యక్షురాలు డా.డి.వి.వి.శ్రీలక్ష్మీవాణి పేర్కొన్నారు. ఆదివారం నాంపల్లి చేనేత భవన్‌లో మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. సమారు 150 మంది మహిళలు ఇందులో పాల్గొన్నారు. రెండు నెలల పాటు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని, కోర్సు పూర్తి చేసిన మహిళలకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రుణాల మంజూరీ, ప్రభుత్వ పథకాలను ప్రోత్సహించడమే కాకుండా మహిళా యూనిట్‌లను నెలకొల్పేందుకు దోహదపడతాయని తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

నత్తనడకన లబ్ధిదారుల ఎంపిక

ముందుకు సాగని దీపం కనెక్షన్లు

హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త: కిరోసిన్ రహిత నగరాలుగా, వంటచెరుకు రహిత గ్రామాలుగా తెలంగాణను పొగ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేంకు ఉద్దేశించిన ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్ల ప్రక్రియ తెలంగాణ రాష్ట్రంలో నత్తనడకన నడుస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యంగా తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్న పేద కుటుంబాలకు మహిళల పేరిట దీపం పథకం కింద ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లు అందజేస్తోంది. అయితే ఇందుకు సంబంధించి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యంగా నగరాల్లో నత్తనడకన నడుస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారులు దీనిపై దృష్టి సారించకపోవడంతో దీపం పథకం మసకబారుతోంది. ఈ విషయంలో పౌరసరఫరాల శాఖ కూడ దృష్టి సారించకపోవడంతో మంజూరైన కనెక్షన్లు ఇవ్వడానికి లబ్దిదారుల ఎంపిక కూడా సకాలంలో జరుగని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. తెలంగాణ రా ష్ట్రానికి దీపం పథకం కింద 9.12 లక్షల గ్యాస్ కనెక్షన్లు మంజూరైతే దీనిలో 4.65 లక్షల కనెక్షన్లు మాత్రమే ఇవ్వడం జరిగింది. ఇందుకు గాను ప్రభుత్వం ఆయిల్ కంపెనీలకు ఇప్పటివరకు రూ. 96.74 కోట్లు విడుదల చేసింది. ప్రభుత్వం ఆయిల్ కంపెనీలకు విడుదల చేసిన మొత్తంతో దాదాపు 6.04 లక్షల ఎల్‌పిజి కనెక్షన్లు ఇవ్వవచ్చు. అయితే ఆయిల్ కంపెనీలు ఇప్పటివరకు ఇచ్చిన కనెక్షన్లు కేవలం 4.65 లక్షలు మాత్రమే కావడం గమనార్హం. ఇంకా 1.39 లక్షల ఎల్‌పిజి కనెక్షన్లకు సంబంధించిన అమౌంట్ ఆయిల్ కంపెనీల వద్ద అందుబాటులో ఉంది. రాష్ట్రానికి ఇంకా 20 లక్షల దీపం కనెక్షన్లు విడుదల కావాల్సి ఉంది. ఇందుకు అవసరమైన లబ్దిదారుల ఎంపిక జరుగాల్సి ఉంది. ఇప్పటికే మంజూరైన గ్యాస్ కనెక్షన్లలో దాదాపు 5 లక్షల కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కొత్తగా మరో 20 లక్షల కనెక్షన్లు మంజూరైత మొత్తం 25 లక్షల కనెక్షన్లు ఇవ్వడానికి లబ్దిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. ఇదివరకు మండల పరిషద్ డెవలప్‌మెంట్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు లబ్దిదారులను ఎంపిక చేసేవారు. లబ్దిదారుల ఎంపికలో కాలయాపన జరుగుతుండడంతో దీపం పథకం నత్తనడకన జరుగుతోంది. దీంతో ప్రభుత్వం లబ్దిదారుల ఎంపిక అధికారాన్ని తహాశీల్దార్లకు అప్పగించింది. లబ్దిదారుల ఎంపికను వేగవంతం చేసి దీపం పథకం కనెక్షన్లు స్పీడప్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందు కోసం ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. లబ్దిదారుల ఎంపికకు సంబంధించి ఆహార భద్రత కార్డులు ఉండి ఎల్‌పిజి కనెక్షన్లు లేని కుటుంబాలను గుర్తించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీపం కనెక్షన్ల కేటాయింజు పౌరసరఫరాల శాఖ నిర్వహిస్తోంది. దీనిపై పౌరసరఫరాల శాఖ ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతం చేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. తెల్ల రేషన్ కార్డులు కల్గి ఉండి గ్యాస్ కనెక్షన్ లేని వారిని గుర్తించి ఆ వివరాలను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్లను ఆదేశించడం జరిగింది. అర్హులను ఎంపిక చేయడంలో ఎస్సి, ఎస్టి పర్సంటేజ్‌ను దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేయాల్సి ఉంటుంది. మండలాన్ని లక్ష్యంగా చేసుకొని టార్గెట్‌ను పూర్తి చేసేందుకు అధికారులకు సూచించడం జరిగింది.

రెండో టెస్టులో శ్రీలంక ఓటమి

సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా



ప్రభాతవార్త స్పోర్ట్స్ ప్రతినిధి: భారత్ జట్టు గత రెండేళ్ల కాలంగా టెస్టుల్లో తిరుగులేని విజయాలతో దూసుకెళ్తోంది.కోహ్లీ సేనకు అప్రతిహత జైత్రయాత్రకు తిరుగులేదు. రికార్డులను చెరిపి వేస్తూ సరికొత్త ఘనతలు లిఖిస్తూ టెస్ట్ క్రికెట్‌ను శాసించే టీమిండియా దిశగా సాగుతోంది. వరుసగా ఎనిమిదో సిరీస్ కైవసం చేసుకొంది. 9 విజయాలతో ఉన్న ఆస్ట్రేలియాకు అడుగు దూరంలో నిలిచింది. శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండో టెస్టు గెలిచి 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది భారత్ జట్టు. చివరి టెస్టు గెలిచి చరిత్ర సృష్టించాలని ఉవ్విళూరుతుంది.

చెదిరిన శ్రీలంక కల

కొలంబో టెస్టులో గెలిచి సొంతగడ్డపై సిరీస్‌ని సమం చేయాలని ఉవ్విళ్లూరిన శ్రీలంక కల చెదిరింది. స్పిన్నర్ రవీంద్ర జడేజా (5/152) చెలరేగడంతో శ్రీలంకని ఇన్నింగ్స్,53 పరుగుల తేడాతో నాలుగో రోజే భారత్ అలవోకగా ఓడించేసింది. ఇప్పటికే గాలెలో జరిగిన తొలి టెస్టులో 304 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్...తాజా విజయంతో మూడు టెస్టుల సిరీస్‌ని 2-0తో చేజిక్కించుకుంది. సిరీస్‌లో మూడో టెస్టు ఆగస్టు 12 నుంచి జరగనుంది.

తొలి ఇన్నింగ్స్‌ని భారత్ జట్టు 622/9 వద్ద డిక్లేర్ చేయగా...శ్రీలంక తొలి ఇన్నింగ్సలో 183 పరుగులకు ఆలౌటై...అనంతరం ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 386 పరుగకులకే కుప్పకూలిపోయింది. మ్యాచ్‌లో అర్ధశతకంతో పాటు 7వికెట్లు పడగొట్టిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

శ్రీలంక పతనాన్ని శాసించిన జడేజా

ఓవర్ నైట్ స్కోరు 209/2తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక జట్టులో ఓపెనర్ గుణరత్నె 307బంతుల్లో 16ఫోర్లతో 141 పరుగులు చేసి పరువు నిలిపే ఇన్నింగ్స్ ఆడాడు.శ్రీలంక పతనాన్ని రవీంద్రజడేజా శాసించాడు. నాలుగో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంక బ్యాట్స్‌మెన్ (16)ను అశ్విన్ బోల్తా కొట్టించగా.. చండీమాల్ (2)ను రవీంద్ర జడేజా అవుట్ చేశాడు. అనంతరం గుణరత్నెను జడేజా పెవిలియన్‌కు పంపాడు. అప్పుడు జట్టు స్కోరు 310. అతను ఔటవ్వగానే...భారత్ బౌలర్లు ఏ దశలోనూ లంకేయుల్ని కోలుకోనివ్వలేదు. మాథ్యూస్ (36), డిక్వెలా (31) కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నా ఫలితం లేకపోయింది.

లంకేయుల ఓటమిని శాసించిన రవీంద్ర జడేజా

వరుసగా టెస్టుల్లో 8వ సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా

చివర్లో పెరీరా (4)ను, డిసిల్వా (17) నువాన్ ప్రదీప్ (1) స్పిన్నర్లని ఎదుర్కోలేక వరుసగా వికెట్లని సమర్పించేసుకున్నారు. మథ్యూస్; పెరీరా, ధనుంజయలను జడేజా పెవిలియన్‌కు పంపగా...డిక్వెలాను పాండ్యా, ప్రదీప్‌ను అశ్విన్ ఔట్ చేశాడు. దీంతో 386పరుగులకే శ్రీలంక పోరాటం ముగిసింది.

బ్యాటింగ్, బౌలింగ్‌లో ఆకట్టుకున్న ఆటగాళ్లు

ఈటెస్టులో భారత మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ ఛతేశ్వర పుజారా (133), అజింక్యా రహానె (132) శతకాలు బాదగా....లోకేశ్ రాహుల్ (57), అశ్విన్ (54), సాహా (67), రవీంద్ర జడేజా (70 నాటౌట్) అర్థశతకాలు సాధించడంతో భారత్ 9 వికెట్ల నష్టానికి 622 పరుగులు చేయగలిగింది. బౌలింగ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి జడేజా (2/84, 5/152), అశ్విన్ (5/69, 2/132) లంక బ్యాట్స్‌మెన్ పనిపట్టారు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో గుణరత్నె (141)తో పాటు కుశాల్ మెండిస్ (110) శతకాలు సాధించారు.

వరుసగా టెస్టుల్లో 8వ సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా

2015 ఆగస్టు నుంచి కోహ్లీసేన ఆడిన ఏ టెస్టు సిరీస్‌లోనూ ఓడిపోలేదు.ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా లాంటి అగ్రశ్రేణి జట్లు సైతం భారత్ చేతిలో మట్టికరిచాయి. గత ఏడాదికాలంగా టీమిండియాలోదూకుడు మరింత పెరిగింది. దానికినిదర్శనమే... ఈసిరీస్ విజయాలు... ఈ రెండేళ్లలో భారత్ వరుసగా శ్రీలంకపై 201, దక్షిణాఫ్రికాపై 3-0, వెసిండీస్‌పై 2-0, న్యూజిలాండ్‌పై 3-0, ఇంగ్లాండ్‌పై 4-0, బంగ్లాదేశ్‌పై 1-0, ఆస్ట్రేలియాపై 2-1 తేడాతో సిరీస్‌లను గెలిచింది. తాజాగా మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో కొలంబో వేధికగా జరిగిన రెండో టెస్టులో విజయం సాధించి 2-0తో ఎనిమిదో సిరీస్ కైవసం చేసుకుంది. టెస్టు చరిత్రలో వరుసగా 9 సిరీస్‌లలో విజయం సాధించిన జట్టుగా ఆస్ట్రేలియా (ఆగస్టు 2005 నుంచి జనవరి 2008వరకు) అగ్రస్థానంలో నిలవగా... తర్వాత 8విజయాలతో ఇంగ్లాండ్ (జూన్ 1884 నుంచి మార్చి 1892వరకు) ఉంది. తాజాగా శ్రీలంకపై విజయంతో భారత్ (ఆగస్టు 2015 నుంచి 6ఆగస్టు 2017వరకు) వరుసగా 8 టెస్టు సిరీస్ విజయాలతో మూడో స్థానంలో నిలిచింది.



మిథాలీ రాజ్‌ను ఘనంగా సత్కరించిన

హైదరాబాద్ క్రికెట్ సంఘం



ఆదివారం హైదరాబాద్‌లో భారత క్రికెట్ క్యాప్టెన్‌మిథాలీ రాజ్‌ను సత్కరిస్తున్న హైదరాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు జి.వివేక్

ఫతేమైదాన్,ఆగస్టు6 ప్రభాతవార్త: మహిళా వరల్డ్‌కప్ క్రికెట్‌లో భారత జట్టును ఫైనల్‌కి చేర్చి జట్టు రెండు స్థానంసాధించడంలో కీలకపాత్ర పోషించిన భారత మహిళా క్రికెట్ క్యాప్టెన్ మిథాలీ రాజ్‌ను హైదరాబాద్ క్రికెట్ సంఘం, హెచ్‌సిఏ వారుఅదివారంనాడు ఉప్పలలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఘనంగా సత్కరించి ఆమెకు క్రికెట్ సంఘం తరుపున 5 లక్షల చెక్కును ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వివేక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్‌కప్‌లో భారత జట్టును 2వ స్థానంలో సాధించడంలో కీలకపాత్ర పోషించిన మిథాలీరాజ్‌ను ఆయన కొనియాడారు. 1991లో అప్పటి ఆంధ్రప్రదేశ్ తరుపున అండర్ -16 క్రికెట్ ఆడి మంచి విజయం సాధించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఈ మహిళా క్రికెటర్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం ఎంతో గొప్ప విషయంగా చెప్పుకోవచ్చని ఆయన అన్నారు.ఈ స్ఫూర్తితో దేశంలో, రాష్ట్రంలో ఇప్పుడిప్పుడు మహిళలు క్రికెట్ ఆడడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. మిథాలీ రాజ్‌కు హైదరాబాద్ క్రికెట్ సంఘం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన చెప్పారు. సన్మాన గ్రహిత భారత మహిళా క్రికెట్ క్యాప్టెన్ మిథాలీరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకూడా నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తుందని ఆమె అన్నారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం వారు ప్రత్యేకంగా నన్ను ఆహ్వానించి ఘనంగా సత్కరించడం ఎంతో అనుభూతినిస్తుందని చెప్పారు. రాష్ట్ర మహిళా క్రికెట్ క్రీడాకారులకు నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. భవిష్యత్తులో మన రాష్ట్రం నుంచి యువ మహిళా క్రీడా కారులు భారత దేశానికి ప్రాతినిధ్యం వహించే విధంగా హెచ్‌సిఏ వారు కృషి చేయాలని చెప్పారు. ఉప్పల్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని మహిళా క్రికెటర్లు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మిథాలీ రాజ్ చెప్పారు. రాష్ట్రానికి చెందిన మహిళా క్రికెట్ క్రీడాకారులు కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వినోద్, హైదరాబాద్ క్రికెట్ సంఘం అడ్మినిస్ట్రేట్ అధికారి సీతాపతి, క్రికెట్ సంఘం ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

టైటిల్ వెనక్కిచ్చేందుకు సిద్ధం : విజేందర్ సింగ్

న్యూఢిల్లీ: తనకు టైటిల్ అవసరం లేదని, సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు వద్దని బాక్సింగ్ ఛాంపియన్ విజేందర్ సింగ్ అన్నారు. డోక్లామ్ సరిహద్దులో నెలకొన్న ప్రతిష్టంభన దృష్ట్యా తన టైటిల్‌ను వెనక్కి ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటించాడు. ముంబైలో చైనా బాక్సర్ జుల్ఫికర్ మైమైతియాలిని ఓడించి, ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్‌వెయిట్ టైటిల్ గెలిచిన విషయం తెలిసిందే. అనంతరం విజేందర్ మాట్లాడారు. డోక్లామ్ సరిహద్దులో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయని, అక్కడ సామరస్యపూర్వక వాతావరణం నెలకొనాలని ఆశిస్తున్నానని, ప్రశాంత వాతావరణం నెలకొనాలని ఈ సందేశం ఇస్తున్నానని, తన టైటిల్‌ను ఇచ్చేందుకు సిద్ధమని, ఇది చైనా ప్రజలకు, అక్కడి మీడియాకు చేరుతుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

ఆఖరి రేసులో బోల్ట్‌కి ఆశాభంగం

ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతోనే సరిపెట్టుకున్న జమైకా చిరుత

గాట్లిన్‌కు స్వర్ణం...కోల్‌మెన్‌కు రజతం



ప్రభాతవార్త స్పోర్ట్స్ ప్రతినిధి: ట్రాక్‌పై చిరుతని తలపించే పరుగుతో పదేళ్లకుపైగా ప్రపంచ వ్యాప్తంగా దశాబ్ధకాలంగా అభిమానులను ఉర్రూతలూగించిన స్ప్రింట్ రారాజుగా వెలుగొందిన జమైకా పరుగు వీరుడు ఉసేన్ బోల్ట్ తన ఆఖరి రేసుని పసిడితో ముగించాలని ఆశపడి భంగపాటుకి గురయ్యాడు. లండన్ వేదికగా జరిగిన ఐఏఏఎఫ్ ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 100మీ ఫైనల్ రేసులో తృతీయ స్థానంలో నిలిచి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. అమెరికి స్ప్రింటర్ జస్టిన్ గాట్లిన్ 9.92 సెకన్లలోనే రేసును ముగించి పసిడి పతకాన్ని ఎగురేసుకపోగా...9.94 సెకన్లతో అమెరికాకే చెందిన కోల్‌మాన్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని చేజిక్కుంచుకున్నాడు. గత పదేళ్లుగా 100మీ రేసులో బరిలోకి దిగిన ప్రతిసారి స్వర్ణంతో అభిమానుల్ని మురిపిస్తూ వచ్చిన ఉసేన్ బోల్ట్...ఈ రేసుని 9.95 సెకన్లతో పూర్తిచేసి కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సాధారణంగా రేసుని నెమ్మదిగా ఆరంభించి మధ్యలో పుంజుకునే ఉసేన్ బోల్డ్ ఆఖరి రేసులో ట్రాక్‌పై ఒత్తిడికి గురైనట్లు కనిపిస్తోంది. ఈ ఫైనల్‌కి ముందు జరిగిన సెమీఫైనల్స్‌లో 100మీ రేసుని కోల్‌మాన్ (9.97సెకన్లు), ఉసేన్ బోల్ట్(9.98 సెకన్లు), యోహాన్ బ్లేక్ (10.04 సెకన్లు) తొలి మూడు స్థానాల్లో ముగించగా...గాట్లిన్ ఆరో స్థానంలో (10.09సెకన్లు)లో పూర్తి చేయడం కొసమెరుపు. అయితే ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన గాట్లిన్ తన చిరకాల వాంఛ నెరవేర్చుకుని...ఎట్టకేలకు బోల్డ్‌ను ఓడించగలిగాడు. కానీ...2009లో బోల్డ్ నెలకొల్పిన 100మీ పరుగు 9.58 సెకన్ల రికార్డుకి మాత్రం గాట్లిన్ చేరువకాలేకపోయాడు. ఇకపై 100మీ రేసులో మనం బోల్ట్‌ను ట్రాక్‌పై మనం చూడలేం...అతని కెరీర్‌కి ఇదే చివరి పరుగు. బోల్ట్ చివరి పరుగును చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. అసాధారణ ప్రతిభతో అంతర్జాతీయంగా ఎంతో మంది క్రీడాభిమానులను సంపాదించుకున్న బోల్ట్ చివరి పోరులోనూ గెలుపొంది తమను అలరిస్తాడని భావించిన ప్రేక్షకుల ఆశ నెరవేరలేదు. పరుగు పూర్తయిన వెంటనే బోల్డ్ ఏమాత్రం నిరాశ చెందకుండా విజేతగా నిలిచిన గాట్లిన్‌కు అభినందనలు తెలిపి...అభిమానుల వైపు వెళ్లి వారితో ముచ్చటిస్తూ....ఫోటోలకు పోజులిస్తూ...సెల్ఫీలు దిగాడు.

బోల్ట్‌ని ఓడించిన గాట్లిన్ కెరీర్‌లో 5 సంవత్సరాల నిషేధానికి గురి

ట్రాక్‌పై దశాబ్దానికిపైగా 100మీ రేసులో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన జమైకా స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్‌ను ఓడించి అమెరికా స్ప్రింటర్ జస్టిన్ గాట్లిన్ కొత్త చరిత్ర లిఖించాడు. భారత కాలమానం ప్రకారం శనివారం అర్థరాత్రి జరిగిన ఐఏఏఎఫ్ ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 100మీ రేసులో మూడు సెకన్ల తేడాతో బోల్ట్ నుంచి స్వర్ణం ఎగురేసుకపోయాడు గాట్లిన్...2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో బంగారు పతకం గెలిచి వెలుగులోకి వచ్చిన గాట్లిన్...తర్వాత ఏడాదే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనూ పసిడితో ట్రాక్‌పై దూసుకెళ్లాడు. దీంతో అతనికి ఇక తిరుగులేదని అంతా భావించారు. కెరీర్‌లో అత్యుత్తమంగా రాణిస్తున్న సమయంలో నిషేధిత ఉత్ప్రేరకాలు వాడుతున్నాడనే ఆరోపణలతో అతనిపై ఏడాది నిషేదం పడింది. అయితే...ఈ వివాదనం నుంచి త్వరగానే గాట్లిన్ కోలుకున్నా...2006లో మళ్లీ అవే ఆరోపణలతో నాలుగేళ్ల పాటు నిషేధం విధించారు. వాస్తవంగా ఎనిమిదేళ్లు విధించినా...అతని ప్రదర్శన దృష్టిలో ఉంచుకుని నాలుగేళ్లు తగ్గించారు. ఈ నిషేదం ముగిసేలోపే ఉసేన్ బోల్డ్ ట్రాక్‌పై తిరుగులేని స్థితికి వచ్చేశాడు.

కోహ్లీసేనకు ఐసిసి షాక్



కొలంబో: శ్రీలంకతో మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తున్న కోహ్లీసేనకు పెద్ద షాక్ తగిలింది. శ్రీలంకతో కొలంబో వేదికగా రెండో టెస్టులో ఆల్‌రౌండర్ ప్రదర్శనతో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన భారత స్పిన్నర్ రవీంద్ర జడేజాపై ఒక టెస్టు మ్యాచ్ సస్పెన్షన్ వేటు పడింది. ఐసిసి ఒక మ్యాచ్ నిషేదం విధించింది. ఐసిసి నియమావళి ప్రకారం జడేజా 24 నెలల కాలంలో ఆరు డీమెరిట్ పాయింట్లకు చేరుకున్నాడు. ఫీల్డింగ్ సమయంలో శ్రీలంక బ్యాట్స్‌మెన్‌కి హాని కలిగించే రీతిలో బంతిని విసిరినందుకు అతనిపై మ్యాచ్ రిఫరీ క్రమశిక్షణ చర్యల కింద మూడు డీమెరిట్ పాయింట్లు ఇచ్చాడు. ఇప్పటికే మూడు డీమెరిట్ పాయింట్లతో ఉన్న జడేజా ఖాతాలో ఈ పాయింట్లు చేరడంతో అతడు ఒక టెస్టు మ్యాచ్ నిషేదానికి గురయ్యాడు. దీంతో ఆగస్టు 12 నుంచి శ్రీలంకతో జరగనున్న మూడో టెస్టుకి జడేజా దూరం కానున్నాడు. ఆటలో మూడోరోజైన శనివారం బంతిని అందుకున్న జడేజా...బ్యాట్స్‌మెన్ కరుణరత్నెని క్రీజులో ఉన్నప్పుడే జడేజా అనవసరంగా గాయపరిచే రీతిలో బంతిని ప్రమాదకరంగా విసిరి తప్పు చేశాడు. ఫీల్డ్ అంపైర్లు ఈ చర్యను ప్రమాదకరమని హెచ్చరించారు. ఇది లెవల్-2 తప్పిదం కావడంతో జడేజా మ్యాచ్ ఫీజులో 50శాతం కోత కూడా విధించారు. గత ఏడాది న్యూజిలాండ్‌తో టెస్టు మ్యాచ్ సందర్భంగా పిచ్‌పై నడిచిన జడేజీ ఖాతాలో మ్యాచ్ రిఫరీ మూడు డీమెరిట్ పాయింట్లు ఇచ్చాడు. ఆగస్టు 12 నుంచి పల్లెకల్‌లో జరిగే మూడో టెస్టు ఆడకుండా నిషేదం విధించారు. అతడి స్థానంలో చైనామన్ బౌలర్ కులదీప్ యాదవ్‌కు జట్టులో చోటు దక్కే అవకాశాలు ఉన్నాయి.

ట్విట్టర్‌లో విజేందర్‌పై ప్రశంసల వర్షం



ముంబయి: చైనా బాక్సర్ జుల్ఫికర్‌పై విజయం సాధించి ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్‌ను సొంతం చేసుకున్న విజేందర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ప్రొఫెషన్ కెరీర్‌ను ఆరంభించిన తర్వాత ఓటమన్నదే ఎరుగక వరుస విజయాలతో దూసుకెళ్తున్న అతడికి అడు క్రీడాభిమానులతో పాటు బాలీవుడ్ ప్రముఖుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. మ్యాచ్‌ను స్వయంగా వీక్షించిన అమితాబ్, అభిషేక్ సహా మిగిలిన ప్రముఖులు సైతం విజేందర్‌కు ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు. చైనాకు చెందిన ప్రత్యర్థిని ఓడించాడు. హోరాహోరీగా సాగిన పోరులో విజయం సాధించిన విజేందర్‌కు అభినందనలు అంటూ అమితాబచ్చన్ కొనియాడారు. మ్యాచ్ చూస్తున్నంతసేపు మహ్మద్ అలీ వర్సెస్ టైసన్ మధ్య పోరులా ఉంది. చైనా అతిథిని మట్టికరిపించావ్. టైసన్‌లా ఇలానే కొనసాగాలి అంటూ రణదీప్ హుడా ట్వీట్ చేశాడు. హోరా హోరీగా సాగిన మ్యాచ్‌లో విజయం సాధించినందుకు గర్వంగాఉందని నేహా దూపియా, అద్నాన్ సమీ, కపిల్ శర్మ, అభిషేక్ బచ్చన్; రితేశ్ దేశ్‌ముఖ్ వంటి బాలీవుడ్ ప్రముఖులు విజేందర్‌ను ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు.

మరీ పేలవంగా ఆడతామని ఊహించలేదు : ఛండీమాల్

కొలంబో: భారత్ చేతిలో తమ జట్టు మరీ ఇంత పేలవంగా ఓడిపోతుందని తాను ఊహించనట్లు శ్రీలంక కెప్టెన్ దినేశ్ ఛండీమాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. కొలంబో వేదికగా ఆదివారం ముగిసిన రెండో టెస్టులో భారత్ ఇన్నింగ్స్, 53పరుగుల తేడాతో అలవోకగా విజయాన్ని అందుకుంది. ఈమ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులకు ఆలౌటైన శ్రీలంక...రెండో ఇన్నింగ్స్‌లో 209/2 దశ నుంచి 386 పరుగులకే కుప్పకూలిపోయింది. అంతకుముందు భారత్ జట్టు తొలి ఇన్నింగ్స్ 9వికెట్లకు 622 పరుగులకు డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. టీమిండియా 600పైచిలుకు పరుగులు చేసింది. కానీ...మేము మాత్రం మరీ పేలవంగా వికెట్లు సమర్పించుకున్నాం. మేము ఊహించిన దానికంటే ఎక్కువగానే పిచ్ నుంచి నాలుగోరోజు భారత్ స్పిన్నర్లకి సహకారం లభించింది. తొలిరోజు, రెండో రోజు లంచ్ విరామం వరకు బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్...క్రమంగా మారుతూ వచ్చింది. అందుకే మేము తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులకు ఆలౌటయ్యాం. ఇక జడేజా విషయానికి వస్తే...అతను ప్రత్యేకమైన బౌలర్. అందుకే అతను నెం.1 టెస్టు బౌలర్‌గా కొనసాగుతున్నాడు. మ్యాచ్ ప్రణాళికలను అతడు చక్కగా అమలు చేసి మమ్మల్ని కట్టడి చేశాడు అని చండీమాల్ ప్రశంసించాడు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/15-17 **Air Surcharge:** Delhi : 40 Ps.